Estd 1938
ఆంధ్రప్రభ
www.prabhanews.com
Journalism first!
సంపుటి:56 . సంచిక:291 . గురువారం 1 ఫిబ్రవరి 2018 . హైదరాబాద్ * పేజీలు:12+12 . వెల: 5.00 .
Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



సారలమ్మ గద్దెనెక్కె..!
గిరిజన కుంభమేళాలో జనజాతర



వనజాతర
జనప్రభంజనం
మేడారం జాతరకు
పోటెత్తిన జనం
అడుగడుగునా
భద్రత కట్టుదిట్టం
9 లో

తక్కువ పన్ను... రైతుకు దన్ను
వైద్యం, విద్యకు అధిక కేటాయింపులు



నేడే కేంద్ర బడ్జెట్

మరికొన్ని గంటల్లో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ నరేంద్రమోడీ ప్రభుత్వానికి అగ్నిపరీక్ష కానుంది. అనేక సవాళ్లు పొంచి ఉన్నాయి. నాలుగేళ్లగా అన్ని రంగాలను ఊరిస్తూ వస్తున్నా, పెద్దగా చేసిందేమీ లేదన్న అభిప్రాయం సర్వత్రా నెలకొని ఉంది. రైతు భారతం తీవ్రంగా దెబ్బతింటే, ఉపాధి అవకాశాలు కొరవడి యువత తీవ్ర ఆగ్రహంతో రగులుతోంది. ఒకపక్క ద్రవ్యలోటును తగ్గించడం ప్రథమ కర్తవ్యం. మరోపక్క అంతర్జాతీయ పెట్టుబడుదారులను, రేటింగ్ సంస్థలను ఆకర్షించాల్సి ఉంది. ఇక ముంచుకొస్తున్న ఎన్నికల దృష్ట్యా, భారీ తాయిలాలతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవాలి. ఇవన్నీ ఒకే పద్దుతో సాధించడం అంత తేలిక కాదు! ఏం చేస్తారా అని దేశీయ వర్గాలే కాకుండా, అంతర్జాతీయ సంస్థలు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. సమతూకాన్ని పాటించడం నరేంద్రమోడీ- అరుణ్‌జైట్లీ ద్వయానికి కత్తిమీదసామే! గత నాలుగేళ్లలో వృద్ధిరేటు అతి తక్కువ స్థాయికి దిగజారిపోయింది. సత్వరం పకడ్బందీ ప్రణాళికలతో ఊపిరిలూదకపోతే వర్తమానం కంటే భవిష్యత్ మరింత ఘోరంగా ఉంటుంది. ఈ తెలివిడి విత్తమంత్రికి లేకపోలేదు! మోడీ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచిన యువతను శాంతింపచేయడంతో పాటు రైతాంగాన్ని స్వాంతనపరచడం కూడా తప్పనిసరి! ఈ నేపథ్యంలో ద్రవ్య గణాంకాలతో కుస్తీ అంత తేలిక కాదన్నది ఆర్థికవేత్తల అంచనా! కాని... గెలుపే లక్ష్యంగా సాగుతున్న మోడీ దేశంలో అధికంగా ఉన్న గ్రామీణ, పట్టణ ప్రాంత పేదల లక్ష్యంగానే ఈసారి బడ్జెట్ ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు...

జైట్లీ పద్దుపై ప్రజల మనోగతం

వివరాలు 10లో...

తెరాస ఓడితే రాజకీయ సన్యాసం చేస్తా!

ఉత్తమ్... నువ్వు రెడీయా!
గద్వాల సభలో కేటీఆర్ సవాల్

దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఎదురుగాలి
మరో 20ఏళ్లు కేసీఆరే తెలంగాణ సీఎం
గూడూరులో చేనేత పార్క్‌కు శంకుస్థాపన

జోగులాంబ గద్వాల, ప్రభ న్యూస్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెరాస అధికారంలోకి రాకుంటే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని, కాంగ్రెస్ అధికారంలోకి రాకుంటే పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి రాజకీయ సన్యాసం తీసుకుంటారా అని ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు సవాల్ విసిరారు. 2019 ఎన్నికల్లో తెరాస వందశాతం అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏ ప్రయోజనం చేసిందని ఓటు వేస్తారా అని ఆయన ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ ప్రతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ స్థానంలోనే మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని ఆయన గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ఎదురు గాలి వీస్తోందని ఈ పరిస్థితులలో రాష్ట్రంలో 70 సీట్లు ఎలా గెలుస్తారని కేటీఆర్ ప్రశ్నించారు. గద్వాల జిల్లాలో బుధవారం పర్యటించిన మంత్రి గద్వాల మండలం 3వ పేజీలో...



సీఎస్‌గా ఎస్.కె. జోషి



8 లో
అదనంగా నీటిపారుదలశాఖ
సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు
అధికారుల అభినందనలు



చందమామ త్రిపాత్రాభినయం

ఆకాశంలో అద్భుతం
ప్లానిటోరియంలకు పోటెత్తిన జనం
అబ్బురపరిచే ఖగోళ అద్భుత వీక్షణం

న్యూఢిల్లీ: చందమామ ఆకాశంలో అద్భుతాన్ని బుధవారం రాత్రి ఆవిష్కరించింది. అరుదైన చంద్ర గ్రహణం ఇదిగిదుగో అన్నట్టుగా అరుణ వర్ణం పులుముకున్న చందమామ రాగి రంగు అంచుతో గగనంలో కనువిందు చేసింది. కనీవినీ ఎరుగని ఘట్టాన్ని వీక్షించడానికి దేశవ్యాప్తంగా వేర్వేరు ప్లానిటోరియమ్‌లను ఖగోళ ప్రేమికులు సందర్శించారు. చందమామ 8వ పేజీలో...

హోంగార్డుల వేతనం ఇరవై వేలు

సీఎం హామీ అమలు
ప్రభుత్వ ఉత్తర్వుల జారీ
డబుల్ బెడ్‌రూం ఇళ్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: హోంగార్డులకు జీతాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. పోలీసులతో సమానంగా వేతనాలు చెల్లించాలంటూ కొన్నాళ్ళుగా హోంగార్డులు పోరాటం చేయడం, అందుకు రాజకీయ పార్టీలు కూడా మద్దతిచ్చారు. ఇటీవల ప్రగతి భవన్‌లో హోంగార్డులతో సమావేశమైన సీఎం కేసీఆర్ 3వ పేజీలో...

భద్రతకు బడ్జెట్‌లో భరోసా



రక్షణ రంగ నిపుణుల మనోగతం

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

రక్షణకు అర్థం మారింది. ఒకప్పుడు రక్షణంటే శత్రువుల బారి నుంచి మనల్ని మనం కాపాడుకోవడం. కానీ ఇప్పుడు రక్షణంటే శత్రువు దాడి చేసేవరకు ఆగకుండా దాడికి పాల్పడే అవకాశం ఉన్నవారిపై ఎదురుదాడి చేసి పీచమణిచేయడం. భారత్ ప్రపంచంలో గొప్ప ఆర్థికశక్తిగా మారుతోంది. అదే సమయంలో భారత్‌కు సరిహద్దు దేశాల నుంచి దాడుల ముప్పు కూడా పెరుగుతోంది. భారత్ శాంతికాముక దేశం. చరిత్రలో ఏనాడూ ఏ దేశంపైన భారత్ దండెత్తలేదు. దీంతో తనను తాను రక్షించుకునేందుకు అనువైన కొద్దిపాటి ఆయుధాలుంటే సరిపోయేది. కానీ ఇప్పుడు ఆర్థికంగా ఎదుగుతున్న భారత్ పట్ల పలు దేశాల్లో ఈర్ష్య పెరిగింది. ముఖ్యంగా చైనా, పాక్‌లు ఎప్పుడు ముట్టడి చేద్దామా అని కాచుకునున్నాయి. ఈ రెండు దేశాలు రక్షణ వ్యవస్థల్ని అత్యంత పటిష్టంగా మలచుకుంటున్నాయి. అందొచ్చిన అత్యాధునిక రక్షణ సామర్థ్యాన్ని సమకూర్చుకుంటున్నాయి. సరికొత్త ఆయుధాల్ని రూపొందించుకుంటున్నాయి. వీటన్నింటిని భారతే లక్ష్యంగా సరిహద్దుల్లో మోహరిస్తున్నాయి. సంప్రదాయసిద్ధంగా వస్తున్న శాంతిమంత్రాన్ని భారత్ పఠిస్తుంటే పొరుగునున్న చైనా, పాకిస్థాన్‌లు మాత్రం ఎప్పుడు భారత భూభాగాన్ని కబళించేద్దామా అన్న ఆతృతతో ఎదురు చూస్తున్నాయి. తరచూ మన భూభాగంలోకి అవి చొచ్చుకొస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో భారత్ కూడా అవసరమైతే ఎదురుదాడికి తగిన సైనిక సంపత్తిని సమకూర్చుకోవాలని రక్షణరంగ నిపుణులు కేంద్రానికి సూచిస్తున్నారు. ఇందుకోసం ప్రస్తుత రక్షణ దళాల ఆధునీకరణకు తగినన్ని నిధులు బడ్జెట్‌లో కేటాయించాల్సిన అవసరముంది. భారత్ తన స్థూల జాతీయోత్పత్తిలో రక్షణరంగానికి 1.6శాతం కేటాయిస్తోంది. అదే చైనా తన జీడీపీలో రక్షణకు 2.1శాతం కేటాయిస్తుంటే పాక్ 2.36శాతం కేటాయింపులు జరుపుతోంది. భారత్ రక్షణ శాఖకు చేస్తున్న కేటాయింపుల్లో సింహభాగం సిబ్బంది జీతభత్యాల వ్యయానికే సరిపోవడంలేదు. పైగా ఇతర రంగాలతో పోలిస్తే రక్షణరంగ కేటాయింపుల్లో వృద్ధి కనిపించడం లేదు. 2016-17లో రక్షణ శాఖకు రూ. 2,49,099 కోట్లు కేటాయించారు. 2017-18లో రూ. 2,62,389 కోట్లు కేటాయించారు. అంతకుముందు 3వ పేజీలో...

పవర్‌లో టాప్‌గేర్

కేటీపీఎస్ 7వ దశ
ట్రయల్‌రన్ విజయవంతం
అందుబాటులోకి
15వేల మెగావాట్ల విద్యుత్
38 నెలల్లోనే నిర్మాణం పూర్తి
రాష్ట్రంలో తొలిప్లాంటుగా రికార్డు
విద్యుత్ శాఖ అధికారులకు
సీఎం కేసీఆర్ అభినందనలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రం విద్యుత్ రంగంలో పురోభివృద్ధిలో శరవేగంగా దూసుకుపోతోంది. 800మెగావాట్ల స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్ధ్యం కలిగిన కొత్తగూడెం కెటిపిఎస్ 7వ దశ ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తికి అత్యంత కీలకమైన బాయిలర్‌ను జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు బుధవారం వెలిగించారు. ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తికి అవరమైన ట్రయల్ రన్‌ను విజయవంతంగా 3వ పేజీలో...

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: బహుళ పాడ్యమి సా. 5.29 వరకు, అనంతరం విదియ; నక్షత్రం: ఆశ్లేష సా. 5.08 వరకు, అనంతరం మఖ; అమృతకాలం: మ. 3.45 నుండి 5.15 వరకు; వర్జ్యం: ఉ. 6.20 వరకు, తె. 4.37 నుండి 6.08 వరకు; దుర్ముహూర్తం: ఉ. 10.00 నుండి 10.48 వరకు, మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు;

లక్షన్నర మెట్రిక్ టన్నుల కందులు కొనండి

కేంద్రమంత్రికి హరీష్‌రావు లేఖ
2 లో

ఔరా..!



ఎక్కడ చూసినా ఇవాళంతా బడ్జెట్ మూడేరా...! మా దాదీని పాకెట్ మనీ అడిగానా, 'బడ్జెట్ రానీరా చూద్దాం' అంటున్నాడు...

టీఆర్టీ పరీక్ష షెడ్యూల్ విడుదల

ఫిబ్రవరి 24 నుంచి మార్చి 4 వరకు
25న ఎస్‌జీటీ (తెలుగు, ఆంగ్లం) పరీక్ష
ఆన్‌లైన్‌లోనే టీఆర్టీ పరీక్ష
ఉదయం, మధ్యాహ్నం ఎగ్జామ్స్
నిర్వహణ: టీఎస్‌పీఎస్సీ వెల్లడి
5 లో



3 లో
ఫిబ్రవరి 19నుంచి
జేఎల్, డీఎల్ పరీక్షలు
23 వరకు నిర్వహణ
కమిషన్ కార్యదర్శి

సహకార సంఘాల ఎన్నికలు వాయిదా

6 నెలలు పర్సన్ ఇన్‌ఛార్జ్‌ల పాలన



3 లో
కొత్త జిల్లాల ఆధారంగా
సహకార సంఘాల పరిధి మదింపు
ఆస్తులు, అప్పులు తేల్చాకే...
అన్ని సంఘాలకు ఇదే విధానం అమలు

2022కి రైతుకు రెట్టింపు ఆదాయం

మార్కెటింగ్ సదుపాయాలపై
4 రాష్ట్రాల్లో అధ్యయనం
మంత్రి హరీష్ రావు వెల్లడి
వివరాలు 2లో...

కేంద్రంపై గంపెడాశలు

- భారీ నిధుల కోసం నిరీక్షణ
- ప్రతిష్టాత్మక పథకాలకు సాయం చేయాలని విన్నపాలు
- విభజన హామీలపై అమీతుమీ
- నేటి కేంద్ర బడ్జెట్‌పై ఉత్కంఠ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర ప్రయోజనాల దిశగా ప్రభుత్వం కుతూహలంగా ఉంది. నేటి బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏ మేరకు ప్రయోజనం చేకూరనుందనే కోణంలో వేచి చూస్తున్నది. హై కోర్టు విభజన, బయ్యారం ఉక్కు కర్మాగారం, విశ్వవిద్యాలయాల ఏర్పాటు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధుల పెంపు, ఎయిమ్స్, సిరిసిల్ల మెగా పవర్‌లూమ్స్ క్లస్టర్, 99 సాగునీటి ప్రాజెక్టుల్లో తెలంగాణ వాటా వంటివాటిపై ప్రభుత్వం ఆశలు పెట్టుకున్నది. మిషన్ భగీరథ పథకానికి రూ. 19, 205కోట్లు, మిషన్ కాకతీయకు రూ. 500కోట్లు, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

కేంద్రంనుంచి కేంద్ర ప్రాయోజిత పథకాలు తగ్గుదల వైపుగా పయణించడం, కొన్ని పథకాలకు కోతలు పెట్టడంపై రాష్ట్రం అసంతృప్తిగా ఉంది. 2016-17లో అన్ని రకాల పన్నులనుండి కేంద్ర ఖజానాకు రూ. రూ.50వేల కోట్లకుపైగా జమయింది. ఆదాయపు పన్ను రూ. 32,186కోట్లు, సేవా పన్ను రూ. 7671కోట్లు, సెంట్రల్ ఎక్సైజ్ రూ.6828కోట్లు, కస్టమ్స్ డ్యూటీ రూ. 3328 కోట్లుగా రాష్ట్రం పేర్కొంది. అయితే కేంద్రంనుంచి రూ. 25వేల కోట్లే రాష్ట్రానికి తిరిగి రావడంపై ప్రభుత్వం అసంతృప్తంగా ఉంది. అయితే ఇది ఫెడరల్ స్ఫూర్తికి లోబడే జరిగిందని కేంద్రం సూచించింది. సీసీఎస్(కేంద్ర ప్రాయోజిత పథకాలు)కు రూ.3 వేలకోట్లు వస్తాయని పెట్టుకున్న ఆశలపై కేంద్రం నీళ్లు పోసింది. ధనిక రాష్ట్రంగా పేరున్న తెలంగాణకు రూ. 1000 కోట్లు మాత్రమే అందజేసింది. 2018 -19ఆర్థిక బడ్జెట్ అంచనాలకు తుది రూపు వస్తున్నది. రూ. 1.75 లక్షలనుంచి రూ. 1.90 లక్షల కోట్ల మొత్తంతో బడ్జెట్ కూర్పు జరుగుతున్నది. ఈనెల 20న ప్రారంభమైన ఆర్థికశాఖ శాఖలవారీ సమీక్షలు, బడ్జెట్ ప్రతిపాదనలు పూర్తయ్యాయి. 2017-18 వాస్తవవ్యయాలు, కొత్తగా శాఖల వారీగా అవసరాల మేరకు ప్రతిపాదనలు, సిబ్బంది, అధికారుల సంఖ్య, జీతభత్యాలు, పథకాల అమలుకు కావాల్సిన మొత్తాలు వంటి వాటిపై చర్చించారు. వీటిపై ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ కూడా సమీక్షించారు. గురువారం కేంద్రబడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత సీఎం



కేసీఆర్ అన్ని శాఖల బడ్జెట్ ప్రతిపాదనలను పరిశీలిం చనున్నారు. కాగా ఈ బడ్జెట్‌లో ప్రతిపాదనలు భారీగా వచ్చాయని, ఒక్కో శాఖ 30శాతానికి మించి ఖర్చులు, వ్యయాలను ప్రతిపాదిం చినట్లుగా సమాచారం. అయితే సర్కార్ మాత్రం ఆచీతూచీ 15 శాతానికి మించకుండా కేటాయింపులు జరపనున్నట్లు తెలిసింది. సాగునీటి రంగానికి, వ్యవసాయ రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఆ తర్వాత బిసి ప్రత్యేక అభివృద్ధి పథకానికి కూడా సముచిత రీతిలో నిధుల కేటాయింపులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారని తెలిసింది.

2017-18లో జాతీయ జీడిపి 7.1 శాతంకాగా తెలంగాణ రాష్ట్ర జిడిపి 10.5 శాతంగా ఉంది. సొంత పన్నుల రాబడిలో వృద్ధిరేటు 17శాతంగా నమోదవుతోంది. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ రాష్ట్రప్రభుత్వ విధానాలు, సుస్థిర నిర్ణయాల ఫలితంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి ఆదాయం గణనీయంగా పెరిగింది. రాష్ట్ర ఏర్పాటు సమయంలో 6.5 శాతంగా ఉన్న జిడిపి క్రమంగా పెరుగుతూ వచ్చింది. ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణం, సామాజిక పింఛన్లు, పెంచిన జీతాలతో కూడిన ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు. రైతులకు రూ.8వేల పంట సాయం అందజేత వంటి వాటికి కీలకంగా నిధుల కేటాయింపు అవసరం కానుంది. వరుసగా ధనిక రాష్ట్రంగా ఖ్యాతి పొందుతున్న తెలంగాణ రాష్ట్రం ఆ దఫా మిగులుతోనే ముందుకు సాగేలా ప్రణాళికలు సిద్దం చేసుకుంది. అయితే తెలంగాణ ప్రజల ఆదాయ స్థితిగతులు కూడా అదే స్థాయిలో నమోదవుతున్నాయి. జాతీయ తలసరి ఆదాయం 10.2 శాతం ఉండగా తెలంగాణలో ఇది 12.6 శాతంగా నమోదు కావడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను తేటతెల్లం చేస్తోంది. 2016-17లో తెలంగాణ తలసరి ఆదాయం 12.6 శాతంగా రూ. 1,58,360కి చేరింది. జాతీయ సఘటు రూ. 1,03,828గా ఉండగా, 2011-12లో రూ. 91,121 తలసరి ఆదాయం తెలంగాణలో ఉండగా జాతీయ స్థాయిలో ఇది రూ. 63460 నమోదైంది. 2012-13లో తెలంగాణలో తలసరి ఆదాయం రూ. 1,00,979తో 10.8శాతానికి చేరుకుంది. అదే సమయంలో జాతీయ స్థాయిలో రూ. 71,011తో 11.9శాతంకాగా, 2013-14లో తెలంగాణకు 1,12,328తో 11.2శాతం జాతీయ సఘటు రూ. 79146తో 11.5 శాతం నమోదైంది. 2014-15లో తెలంగాణలో 1,25,832తో 12.0శాతం, జాతీయస్థాయిలో 86,513తో 9.3శాతం, 2015-16లో 11.8 శాతం ఉండగా 2016-17లో అది తెలంగాణ రాష్ట్రంలో 1,58,360తో 12.6 శాతంగా నమోదవగా, జాతీయ స్థాయిలో 1,03,818తో 10.2 శాతంగా ఉంది. 2013-14 ఒక్క ఏడాదిలో మాత్రమే జాతీయ సఘటుకంటే తెలంగాణ తలసరి ఆదాయం తక్కువగా నమోదుకాగా రాష్ట్ర అవతరణ తర్వాత ఏనాడు వెనుదిరిగి చూడలేదు.

సంక్షేమానికి పెరగనున్న కేటాయింపులు...

గ్రామీణ వికాసం, బడుగు బలహీన వర్గాల సంక్షేమం, వృత్తిదారుల రక్షణే లక్ష్యంగా 2017-18 బడ్జెట్‌ను రూ.4571కోట్ల మిగులుతో ప్రవేశపెట్టారు. పేదల సంక్షేమం, కులవృత్తులకు పూర్వ వైభవం తెచ్చేలా కసరత్తు చేశారు. ఈ బడ్జెట్‌లో తొలిసారిగా ప్రణాళికా, ప్రణాళికేతర పద్దుల స్థానంలో ప్రగతి, నిర్వహణా పద్దులను ప్రవేశ పెట్టారు. ప్రగతి పద్దుకింద రూ. 88,038కోట్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. మానవ వనరులను బలోపేతం చేసి వ్యయాన్ని సహేతుకంగా క్రమబద్ధీకరించడం ద్వారానే నిర్వహణా వ్యయం కంటే ప్రగతి పద్దు వ్యయం ఎక్కువగా సాధ్యమైంది. నిర్వహణా వ్యయం రూ. 61,607కోట్లుగా నిర్ధేశించారు. చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపే లా వారి సంక్షేమం కోసం రూ. 1200 కోట్లను కేటాయించారు. అణ గారిన ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది. ఎస్సీ, ఎస్టీల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేసి నిర్ధేశిత కేటాయించిన నిధులు ఒక ఏడాదిలో వ్యయం కాకపోతే వాటిని తదుపరి ఏడాది కి క్యారీ ఫార్వార్డ్ చేయాలని అసాధారణ నిర్ణయం తీసుకుం ది. ఖ ర్చు కాని నిధులు వచ్చే ఏడాదికి కొంత ఊతంగా నిలవను న్నాయి.

వ్యవసాయ అనుబంధ రంగాలు కీలకం...

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పరిపుష్టత తెచ్చేలా వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ. 46,946కోట్లను కేటాయించింది. సాగునీటి రంగానికి రూ. 25వేల కోట్లను కేటాయించి తన ప్రాధాన్యతను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించింది. గ్రామీణ వృత్తులకు ఆర్థిక ప్రేరణ కల్గించేలా వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలోని 4లక్షల యాదవ కుటుంబాలకు 84 లక్షల గొర్రెలను పంపిణీ చేసేందుకు పథకాన్ని రూపొందించి బడ్జెట్‌లో నిధులను కేటాయించింది. ఎంబీసీల ప్రత్యేక కార్పోరేషన్‌కు రూ. 1000 కోట్లను కేటాయించింది. ఈ ఏడాది దీనిని మరింత పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి రూ. 5070.36 కోట్లను మరో 10 శాతం పెంచే చర్యలు తీసుకునే అవకాశం ఉన్నది. కాగా గతేడాది నుంచి కళ్యాణలక్ష్మి పథకపు ఆర్థిక సాయాన్ని రూ. 51వేలనుంచి రూ. 75,116కు పెంచిన సంగతి తెలిసిందే. గర్భిణిలు, బాలింతలకు పౌషకాహారం, అంగన్‌వాడీలకు సన్నబియ్యం, గర్భిణీ దశలో ఉపాధి కోల్పోయే స్త్రీలకు అంతే మొత్తాన్ని అందిస్తుండగా ఈ ఏడాది ఈ పథకాలకు కేటాయింపులు మరింతగా పెరగనున్నాయి.

2022 నాటికి రైతుకు రెట్టింపు ఆదాయం

- మార్కెటింగ్ సదుపాయాలపై నాలుగు రాష్ట్రాల్లో అధ్యయనం
- మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎకరానికి రూ.8వేల చొప్పున తెలంగాణ ప్రభుత్వం అమలుచేయనున్న పంట పెట్టుబడి పథకం, పెరగనున్న సాగునీటి వసతి, సంక్షేమ కార్యక్రమాలు, మార్కెటింగ్ రంగంలో తీసుకువచ్చిన సంస్కరణలతో తెలంగాణ రైతుల ఆదాయం 2022నాటికి రెట్టింపు అవుతుం దని రాష్ట్ర మార్కెటింగ్ శాఖా మంత్రి హరీష్‌రావు ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. రైతులకు మరిన్ని ప్రయోజనాలు లభించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొం దించాలని ఆదేశించారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, కర్నాటకలలో అమలవుతున్న వ్యవసాయ మార్కెటింగ్ కార్యకలాపాలపై అధ్యయనం చేసి వచ్చిన మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల బృందం మంత్రి హరీష్‌కు బుధవారం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆయా రాష్ట్రాల్లో రైతులు వేసే పంటలు, దిగుబడులు, నిల్వ సదుపాయాలు, మార్కెట్‌యార్డుల పరిస్థితి, మద్దతుధర, రైతులకు చెల్లింపులు, మార్కెట్ స్థిరీకరణ నిధి వంటి అంశాలపై తమ అధ్యయనాన్ని ఈ బృందం మంత్రికి వివరించింది. మహారాష్ట్రలో గత ముప్పయేళ్ళుగా కాటన్ మార్కెటింగ్ కార్పోరేషన్ పనిచేస్తున్నదని అధికారులు మంత్రికి వివరించారు. ఆ రాష్ట్ర మార్కెటింగ్ సంస్థ కందులను కొనుగోలు చేసి పప్పులుగా మార్చి మధ్యాహ్న భోజన పథకానికి హాస్టళ్లకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మధ్యప్రదేశ్‌లో భావంతర్ భుగ్తాన్ పేరిట అమలుచేస్తున్న కార్య క్రమాన్ని మంత్రికి వివరించారు. ఈ పథకం కింద కనీస మద్దతుధర కన్నా మార్కెట్లో రైతుకు తక్కువ ధర పలికిన సందర్భంలో మిగతా డబ్బును నష్టపరిహారం కింద ఆ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చెల్లిస్తున్న దన్నారు. ఎంఎస్‌పితో పాటు తమ రాష్ట్ర రైతుల కోసం సరాసరి ధరను



మధ్యప్రదేశ్ అమలు చేస్తున్నదన్నారు. ధరల స్థిరీకరణ కింద 4000కోట్లను మధ్య ప్రదేశ్ సమకూర్చిందని మార్కెటింగ్ అధికారులు చెప్పారు. హర్యానాలో ఉల్లి, టమాటా, క్యాలిఫ్లవర్ వంటి కూర గాయలను పండించే ముందే ఆయా పంటలు, దిగుబడి అంచనాతో ప్రాథమిక ధరను ప్రభుత్వం ఖరారు చేస్తున్నదని అధికారుల బృందం మంత్రికి వివరించింది. కర్ణాటకలో దాదాపు పదేళ్ళుగా ధరల స్థిరీకరణ నిధి అమలు చేస్తున్నారని మార్కెటింగ్ అధికారులు వివరించారు. మద్దతు ధర రాని సమయంలో ప్రభుత్వం వివిధ పద్ధతుల్లో సహకరిస్తున్నదని, ఆర్థిక సహకారం అందిస్తున్నదన్నారు. నాలుగు రాష్ట్రాల అధ్యయన నివేదికను సిఎం కెసిఆర్‌కు సమ ర్పించిన తర్వాత తగిన నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి అధికారులకు తెలిపారు. వ్యవసాయ పనులు ప్రారంభించే నాటి నుండి పంట దిగుబడి మార్కెట్‌కు వచ్చేంతవరకు , ఆ తర్వాత వాటి కొనుగోలుకు తీసుకుంటున్న చర్యలు, సరిగా మద్దతు ధర లభించేలా జరుపుతున్న కృషిలో తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాల కన్నా అగ్రగామిగా ఉందని మంత్రి అభిప్రాయ పడ్డారు. తాజా కూరగాయలతో నడుపుతున్న మన కూర గాయలు అవుట్‌లెట్‌ల సంఖ్య 100కు పెంచాలని మంత్రి ఆదేశించారు. మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, జాయింట్ డైరెక్టర్ లక్ష్మణుడు తదితరులు పాల్గొన్నారు.

లక్షన్నర మెట్రిక్ టన్నుల కందులు కొనాలి

- కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఈ సీజన్‌లో కందులపంట దిగుబడి 2.84లక్షల మెట్రిక్ టన్నులు వస్తున్న నేప థ్యంలో 1.50లక్షల మెట్రిక్ టన్నులను సేకరించేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రప్రభుత్వాన్ని రాష్ట్ర మార్కెటింగ్ శాఖా మంత్రి తన్నీరు హరీష్‌రావు బుధవారం కోరారు. ఈమేరకు కేంద్ర మంత్రికి తెలంగాణ ప్రభుత్వం తరుపున లేఖరాశారు. మొదట 33,500మెట్రిక్ టన్నుల కందుల కొనుగోలుకు కేంద్రం అంగీకరించగా, మంత్రి హరీష్‌రావు నిరంతర ఒత్తిడితో 53,600మెట్రిక్ టన్నుల సేకరణకు అంగీకరించింది. కానీ కందుల పంట దిగుబడి అనూహ్యం గా ఉండడంతో కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని మంత్రి హరీష్‌రావు భావిం చారు. ఆయన ఆదేశాలతో ఎంపి జితేందర్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి పార్థసారథి ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్ ను, ఆ శాఖా ఉన్నతాధి కారులను కలిసి విజ్ఞప్తిచేయడంతో ఎట్టకేలకు 1,13,600మెట్రిక్ టన్నులు కందుల సేకరణకు అంగీకరిస్తున్నట్లు బుధవారం రాష్ట్రప్రభుత్వానికి తెలిపింది. కందుల దిగుబడి దృష్ట్యా కేంద్రం ఈ పరిమితిని సడలించాలని, 1.50లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు ఆదేశించాలని మంత్రి హరీష్‌రావు కేంద్రానికి లేఖ రాశారు. ఇప్పటివరకు తెలం గాణలో 83,650మెట్రిక్ టన్నుల కందులను సేకరించారు. మార్క్‌ఫెడ్‌కు చెందిన 66, హాకా కు చెందిన 47 కొనుగోలు కేంద్రాల ద్వారా ఈ కొనుగోళ్ళు జరిగాయి. మొత్తం కందుల కొనుగోళ్ళ విలువ రూ.455 కోట్లు, కందుల కొనుగోళ్ళ అనంతరం చెల్లింపులలో ఎలాంటి జాప్యం తగదని మంత్రి హరీష్ అన్నారు.

జనగామ మార్కెట్ కార్యదర్శిపై చర్యలు

కందుల కొనుగోలు కేంద్రాలపై ప్రత్యేక బృందాలతో నిఘాపెట్టాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖా మంత్రి హరీష్‌రావు బుధవారం ఆదేశించారు. కందుల కొనుగోళ్ళలో అక్రమాలు జరిగితే సహించబోనని ఆయన హెచ్చరించారు. కందులు కొనుగోలు చేసిన వెంటనే మార్క్‌ఫెడ్, హాకా సంస్థల అధికారులు కందులను గోడౌన్లకు తరలించి నాఫెడ్ సంస్థకు స్వాధీన పర్చాలని ఆదేశించారు. రైతుల ముసుగులో కొందరు ట్రేడర్లు, దళారులు ఎక్కువ ధరకు అమ్ముతున్నందున అలాంటి కార్యకలాపాలను అరికట్టాలని కోరారు. జనగామ, భువనగిరిలలో కందుల విక్రయాల్లో అవకతవకలు జరిగినందున జనగామ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిపై వెంటనే చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ డైరెక్టర్‌ను మంత్రి హరీష్‌రావు ఆదేశించారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కందుల కొనుగోలు కేంద్రాలపై నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్లను కోరారు.

5 నుంచి గ్రామాలకు భగీరథ నీరు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా ఫిబ్రవరి నుంచి అన్ని గ్రామాలకు తాగునీటిని అందచేయా లని నిర్ణయించారు. మిషన్ భగీరథ పథకం వైఎస్ ఛైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి బుధవారం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారు లతో భగీరథ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రతి గ్రామానికి దశల వారీగా మిషన్ భగీరథ నీటిని బల్క్‌గా సరఫరా చేయాలని ఈ సందర్భంగా వేముల అధికారులను ఆదేశించారు. ఎండాకాలంలో తాగు నీటిసర ఫరాకు ప్రత్యేకంగా నిధుల విడుదల చేయవద్దని సూచిం చారు. ప్రతిగ్రామానికి భగీరథ నీరు చేరేలా చర్యలు తీసుకోవా లని ఆదేశించారు. సివిల్ ,మెకానికల్ పనులకు సంబంధించి 300పంపిగ్ స్టేషన్లు, 1124 పంపుసెట్ల వారీగా పనుల పురోగతిని సమీక్షించారు. ఎలక్ట్రో మెకానికల్ పనుల ప్రస్తుత స్థితి ,పనులు పూర్తయ్యే తేదిలపై చర్చించారు. పనుల స్లోగా నడుస్తున్న దగ్గర గ్యాంగులను పెంచడంతోపాటు కావాల్సిన ఇతర సౌకర్యాలను కల్పించేలా అధికారులను ఆదేశించారు. కొన్ని సెగ్మెంట్లలో చిన్నచిన్న పనులు పూర్తిచేస్తే వందల గ్రామాలకు మంచినీరు సరపరా అయ్యే అవకాశం ఉందని, అటువంటి వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యంగా ఉంటే బ్లాక్‌లిస్టు చేయడా నికి వెనుకాడనని ఏజెన్సీలను హెచ్చరించారు. ఫ్లోరైడ్ ప్రభావిత నియోజక వర్గాలపై మునుగోడు , దేవరకద్రలోని గ్రామాలకు తాగు నీటిని అందించే బాట్లపల్లి డబ్ల్యుటిపిలో ఫిబ్రవరి 12 న ట్రయల్ రన్ నిర్వహించాలని అదేశించారు. పది రోజుల్లో ఆయా గ్రామాలకు శుద్దిచేసిన తాగునీరు అందించాలన్నారు. అందుకు అనుగుణంగా పనులు జరిగేలా క్షేత్ర స్థాయిలో ఉండి పర్యవేక్షించాలని సంబంధింత సీఈకి సూచించారు. త్వరగా పనులు పూర్తి చేసి పంపింగ్ స్టేషన్‌లను ప్రారంభోత్సవాలకు సిద్దం చేయాలన్నారు.

ముఖ్యమంత్రి కార్యా లయ కార్యదర్శి స్మిత సబర్వాల్ మాట్లాడుతూ ఎలక్ట్రో మెకా నికల్ పనులు చేస్తున్న ఏజెన్సీలు గ్యాంగులను పెంచ డంలో నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయని ఏజెన్సీల బిల్లులను ఆపేస్తామని హెచ్చరించారు. ఏజెన్సీ లు చెప్పే వివరాలను కలెక్టర్లతో ధృవపరుచు కుంటామని తెలిపారు. ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి మాట్లాడు తూ ఎలక్ట్రో పనులకు అవసరమైన గ్యాంగులను రప్పించ డంలో ఆర్‌డ బ్యుఎస్ విభాగం నుంచి అన్ని రకాలుగా సహకారం అంది స్తామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్ , సీఈలు కృపాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి జాతీయ సైన్స్ కాంగ్రెస్



హాజరుకానున్న సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్, ఇండియా (ఐటిపిఐ)ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2 నుంచి 4 వ తేదీ వరకు హైదరాబాద్‌లో జాతీ య కాంగ్రెస్‌ను నిర్వహిస్తున్నారు. దేశ వ్యాప్తంగా సుమారు 400 మంది ప్రతి నిధులు పాల్గొనే సమావేశంలో నగర పర్యావరణ ప్రణాళిక, పరిణామాలు, సవా ళ్ళు అనే నేపథ్యంపై ప్రధానంగా చర్చించనున్నారు. బుధవారం హైదరా బాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐటిపిఐ ఛైర్మన్, గ్రేటర్ హైదరా బాద్ సిటీ ప్లానర్ ఎస్. దేవేందర్‌రెడ్డి, ఐటిపిఐ ఎమిరటస్ అధ్యక్షులు డిఎస్ మెశ్రామ్, కార్యదర్శి మురళీధర్‌రెడ్డి, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ సంచాలకులు కె. విద్యాధర్, పూర్వ కార్యదర్శి ప్రదీప్‌కపూర్ తదితరులు మాట్లా డుతూ, మూడు రోజుల పాటు జరుగనున్న సదస్సు ప్రారంభోత్సవ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా సీఎంకేసీఆర్, గౌరవ అతిథిగా పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ హాజరు కానునా రన్నారు. సదస్సు ప్రారం భోత్సవం తర్వాత ఎగ్జిబిషన్‌ను మేయర్ బొంతు రామ్మోహన్ ప్రారంభి స్తారన్నారు. ముగింపు ఉత్సవానికి పంచాయత్ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరు కానున్నారని వివరించారు.ప్రధానంగా మూడు అంశాలను ప్రాధాన్యతగా ఈ సదస్సు జరుగనుందని, నగరీకరణ వల్ల ఎదురవుతున్న పర్యావరణ సవాళ్లు, పర్యావరణం, అభివృద్ధి ప్రణాళికలు, అర్బన్ ఫ్లడింగ్‌లపై ప్రధానంగా దృష్టిసారించనున్నామన్నారు. ప్రైవేట్, పబ్లిక్, కార్పొరేట్ రంగంలోని ప్రొఫెషనల్స్, విద్యావేత్తలు, పరిశోధకులు తగిన అనుభవాన్ని పొందే వేదికగా అత్యాధునిక థియరీలు, సాంకేతికతలు, నైపుణ్యా లను ఈ సదస్సు ద్వారా తెలుసుకోగలు గుతారన్నారు. 2050 నాటికి మన దేశంలో సగానికిపైగా ప్రజలు పట్టణ ప్రాంతాలలో నివసిస్తారన్నది అంచనా అని పేర్కొన్నారు. పెరుగుతున్న పట్టణీ కరణ కారణంగా 2011లో 31 శాతంగా ఉన్న ఈ జనాభా 2050 నాటికల్లా 50 శాతానికి చేరనుందని వివరించారు. ఇదిఅపార అవకాశాలను తీసుకు రావడం తో పాటుగా సవాళ్ళను సైతం తీసుకు వస్తుందని, వేగవంతంగా పట్టణీ కరణ వైపు దేశం వెళ్తున్న తరుణంలో తీవ్రమైన పర్యావరణ సమస్యలు సైతం పెరిగి ప్రణాళిక, ప్రభుత్వ పథకాలలో ముఖ్య భూమికను పోషించ నున్నా యన్నారు. ప్రపంచంతో పాటు మన దేశంలోనూ అసాధారణ వాతావరణ పరి స్థితులు కనిపించనున్నాయని, తీవ్రమైన వర్షపాతం, కరువు, వేడి గాలులు మొదలైనవి కనిపించనున్నాయని వివరించారు.

రైతులపైనే కేసీఆర్ దృష్టి

- ప్రాజెక్టులను అడ్డుకునే కాంగ్రెస్ నేతలను రైతులే తరిమికొట్టాలి: మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట ప్రతినిధి, ప్రభన్యూస్: రాష్ట్రప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత తమ నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతీ అడుగు సీఎం కేసీఆర్ కోసం వేస్తున్నారని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. బుధవారం గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్స వాలు చేయడంతో పాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపడు తున్న ప్రాజెక్ట్‌ల కాల్వ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం గొడుగుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను ప్రారంభించిన అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో యాసంగి పంట పండుతుందన్న నమ్మకం లేకపోయే దన్నారు. రైతులు కరెంట్ సమస్యలతో ఇబ్బందులు పడటమే కాకుండా లోవోల్టేజ్ సమస్యతో మోటార్లు కాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయి రోడ్లెక్కిన సంఘటనలను మంత్రి గుర్తు చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు 24 గంటల విద్యుత్‌ను అందించాలని సీఎం కేసీఆర్ ప్రతినిత్యం తమకు చెప్పేవారని మంత్రి తెలిపారు. సీఎం కేసీఆర్ రైతులకే మొదటి ప్రాధాన్య తను ఇస్తున్నారన్నారు. కేసీఆర్ నాయకత్వంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ నీళ్లను తెచ్చేందుకు రాత్రింబవళ్లు రాక్షసుల్లా తన్లాడుతున్నామన్నారు. రైతుల కంటే మాకేది ముఖ్యం కాదని అవసరమైన మేరకు విద్యుత్ ను వాడుకొని జలాలను సంరక్షించుకోవాలని రైతులకు సూచించారు. ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం



చేయడానికి నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను అడ్డుకునే వారిని రైతులే తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం 17 వేల ఎకరాలలో 16 వేల ఎకరాల భూసేకరణ పూర్తి చేశామని మరో వెయ్యి ఎకరాల భూమిని వేములగట్‌లో దీక్షల పేరిట కాంగ్రెస్ పార్టీ అడ్డుకునే కుట్ర పన్నుతుం దన్నారు. దానికి రైతు నాయకుడైన ముత్యంరెడ్డి చెప్పే మాటలను నమ్మవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో దుబ్బాక ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ సోలిపేట రామలింగారెడ్డి , ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ కర్ణాకర్ బాబు, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బక్కి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న కేసీఆర్



హైదరాబాద్,ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు హత్యా రాజకీయాలకు ప్రణాళికలు రచిస్తున్నారని మాజీ మంత్రి, నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. నల్లగొండ మున్సిపల్ చైర్మన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య ముమ్మాటికి రాజకీయ హత్యేనని ఆయన పునరుద్ఘాటించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియా తో మాట్లాడారు. అధికార టీఆర్‌ఎస్ పార్టీలోకి రానని చెప్పినందుకే హత్య చేశారని ఆయన ఆరోపించారు. కాల్‌డేటా ఇవ్వబోమని సీఎం చంద్రశేఖర్‌రావు చెంచాలు చెబుతు న్నారని ఆయన వివరిం చారు. సీబీఐ విచారణ కోసం కోర్టును ఆశ్రయించినట్లు కోమటిరెడ్డి తెలిపారు. శ్రీనివాస్ హత్యకు ముందు కాల్‌డేటాను ఇవ్వమనే విషయం రాష్ట్ర హోం మంత్రి లేదా డీజీపీ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మార్చి నెలలోపు కాంగ్రెస్ నుంచి పోటి చేసే వారిలో 50 శాతం అభ్యర్థులను ప్రకటించాలని పార్టీ రాష్ట్ర వ్యవ హారాల ఇన్‌చార్జి కుంతియాకు చెప్పినట్లు ఆయన తెలిపారు. గ్రేటర్ హైదరా బాద్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించినట్లు కోమటి రెడ్డి వివరించారు. పాద యాత్రకు అనుమతిస్తే.. తెలంగాణ మొత్తం తిరగడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. లేదంటే నల్లగొండ జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలు గెలుచుకోవడానికి ప్రయత్నిస్తానని వివరించారు.

హత్యలలో తెలంగాణ నెంబర్ వన్: వి. హెచ్

తెలంగాణ రాష్ట్రం హత్యలలో నెంబర్ వన్‌గా నిలుస్తున్నదని ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావు ఆరోపించారు. రాష్ట్రంలో ఆశాంతి నెలకొందని, శాంతి భద్రతలు క్షీణించాయని ఆయన పేర్కొన్నారు. ఇదే విషయంపై కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ రాయనున్నట్లు వీహెచ్ తెలిపారు.

ముందస్తుకు మేం సిద్ధం

- మహాకూటమి దిశగా కసరత్తు: సీఎల్పీ నేత జానారెడ్డి



హైదరాబాద్,ఆంధ్రప్రభ : ముందస్తు ఎన్నికలు వచ్చినా ఎదుర్కొవడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని సీఎల్పీ నేత జానారెడ్డి అన్నారు. అసెంబ్లీ నియోజక వర్గాల పునర్విభజన జరగదనే అభిప్రాయం తనకు ఉందని పునరుద్ఘాటించారు. బుధ వారం ఆయన గాంధీభవన్‌లో టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. డిలిమిటేషన్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తమకు అభ్యంతరం లేదన్నారు. ఎన్నికల సమయంలో కూటములు సహజమని , ఆ దిశగా కసరత్తు జరుగుతున్నట్లు ఆయన వివరించారు. కాంగ్రెస్‌ను వీడి అధికార టీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, తనను టచ్ చేసే ధైర్యం ఎవరికి లేదని జానారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే వారి విషయం కూడా తనకు తెలియదన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీఆర్‌ఎస్ 102 అసెంబ్లీ స్థానాలు గెలుస్తా యని చెప్పడం.. మా శ్రేణులను బలహీన పర్చే ప్రయ త్నంలో భాగమేనని ఆయన అన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలతో పాటు జనం తమ వైపు ఉన్నారని టీఆర్‌ఎస్ చెబుతున్న విషయాన్ని మీడియా ప్రస్తావించగా.. మహాభారతంతో ఎక్కువ అస్త్రాలు, జనం కౌరవుల వైపే ఉన్నారు.. అయినా పాండవులే విజయం సాధించారు కదా..? అంటూ జానారెడ్డి అన్నారు.

రాజీనామాకు రేవంత్ సిద్ధం

టీడీపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారని జానారెడ్డి వివరించారు. అయితే అంతకంటే ముందుగా వివిధ పార్టీల నుంచి అధికార టీఆర్‌ఎస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేల రాజీనామాల విషయంలో స్పీకర్ ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు.

అతి విశ్వాసం పనికి రాదు: కుంతియా

తెలంగాణలో పార్టీ పటిష్టత కోసం తీసుకోవాల్సిన అంశాలపై కాంగ్రెస్ హై కమాండ్ దృష్టిసారించింది. నాయకుల్లో ఉన్న సమన్వ యలో పాన్ని సరి చేసేందుకు దిద్దు బాటు చర్యలు చేపట్టింది. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావా లంటే టీఆర్‌ఎస్ వ్యతిరేక పార్టీల ను కలుపుకుని పోవడమే కాకుం డా.. కాంగ్రెస్ పార్టీ పెద్దన్న పాత్ర ను పోషిం చాలని పలువురు సీని యర్లు పార్టీ హై కమాండ్ దూతకు వివరించారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రాంచంద్ర కుంతియా పార్టీ సీనియర్లతో బుధవారం గాంధీభవన్‌లో సమావేశం అయ్యారు. కొంత మంది సీనియర్లు మాత్రం టీ పీసీసీ నాయ కత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పుపట్టినట్లు తెలిసింది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 70 నుంచి 80 స్థానాలు వస్తాయంటూ గాంధీభన్‌కు పరిమితమైతే లాభం ఉండదని టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కు వ్యతిరేకంగా పలువురు సీనియర్లు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఎన్నికల్లో పోటి చేసే అభ్యర్థు లను 6 నెలల ముందుగానే 60 మంది అభ్య ర్థులను ప్రకటిస్తే ప్రజల్లోకి వెళ్లి పని చేసుకోవడానికి వీలుటుందని మాజీ మంత్రి ఒకరూ కుంతియాకు సూచించినట్లు తెలిసింది. అసెంబ్లీ నియోజక వర్గాలకు ఇన్‌చార్జీలను కూడా నియమించాలని సూచన చేశారు.

గిరిజన కమిషన్ ఏర్పాటుకు కసరత్తు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గిరిజన కమిషన్ ఏర్పాటు పైన ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిశీలించడానికి ఒకే కమీషన్ పని చేస్తుంది. ప్రభుత్వం ఎర్రోళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఎస్టీల కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని గిరిజన సలహా మండలి ప్రభుత్వాన్ని కోరింది. ఈ ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఎస్టీల అభ్యున్నతి పైన ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలియచేశారు. దీనితో పాటుగా గిరిజన పారిశ్రామిక, వాణిజ్య మండలిని ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం దళిత పారిశ్రామిక వాణిజ్య మండలి ఆధ్వర్యంలోనే ఎస్సీ, ఎస్టీల వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. దళితుల్లో వాణిజ్య, పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. విద్య, సామాజిక, ఆర్థిక రంగాల్లో వారికి సముచితమైన స్థానం, గౌరవం కల్పించాలనే ఆలోచనతో ఔత్సాహికులకు ప్రోత్సాహకాలను అందిస్తుంది. ఎస్సీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తుంది. పరిశ్రమలు నెలకొల్పడానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తుంది. ఆసక్తిగల రంగాల్లో పరిశ్రమలు నెలకొల్పడానికి శిక్షణ ఇస్తుంది. కొన్ని ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ముందుకొచ్చింది. అదే విధంగా ఎస్టీలకు తోడ్పాటు అందించాలని భావించింది. ఎస్టీ కమిషన్, ఎస్టీ ఇండస్ట్రియల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటు కోసం కస రత్తు చేస్తుంది. త్వరలోనే గిరిజన సలహా మండలి చేసిన విజ్ఞప్తి మేరకు కమిషన్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉంది అని అధికారులు తెలిపారు. ఫిర్యాదుల పరిశీలన, వ్యవహారాల పర్యవేక్షణకు ప్రత్యేక కమిషన్ ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తిం చిందని తెలిపారు.శాఖల వారిగా పురోగతి నివేదికలను ప్రభుత్వం కోరింది. నిధులు సకాలంలో సక్రమంగా వ్యయం కావడం లేదనే ఆందోళన వ్యక్తమవు తుంది. ఇక మీదట కమిషన్‌ను ఏర్పాటు చేయడంతో ఎస్టీల సమస్యలను సత్వరం పరిష్కరించడం, అభ్యున్నతికి దోహద పడాలనే ఆలోచన మేరకు చర్యలు తీసుకుంటున్నారని అధికారులు తెలిపారు.



భద్రతకు బడ్జెట్‌లో భరోసా

(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్ పరిమాణంతో పోలిస్తే 2017-18లో బడ్జెట్ 9.78శాతం పెరిగింది. అయితే రక్షణశాఖకు కేటాయింపులు మాత్రం 5.55శాతమే పెరిగాయి. 2016-17లో కేంద్ర ప్రభుత్వ మొత్తం బడ్జెట్ వ్యయంలో రక్షణ కేటాయింపులు 17.24శాతం కాగా ఆ తర్వాత ఏడాది మొత్తం బడ్జెట్‌లో రక్షణకు కేటాయింపుల్ని 16.76 శాతానికి తగ్గించేశారు. పైగా రక్షణరంగంలో అనవసర వ్యయం పెరిగింది. 2004-05 బడ్జెట్‌లో రక్షణరంగ కేటాయింపుల్లో 43శాతాన్ని ఆయుధాల కొనుగోలు, ఆధునీకరణకు వ్యయం చేశారు. 2016-17 బడ్జెట్‌లో రక్షణ కేటాయింపుల్లో 71శాతం జీతభత్యాలు, వాహనాల నిర్వహణ, అద్దెల చెల్లింపులకే సరిపోగా ఆధునీకరణ, ఆయుధాల కొనుగోళ్ళకు 29శాతం మాత్రమే మిగిలింది. దీంతో రక్షణ ఒప్పందాలు, ఆయుధాల కొనుగోళ్ళన్నీ వాయిదాల పద్ధతిలోనే చేపట్టాల్సిన పరిస్థితి భారత్‌కు ఏర్పడింది. గత ఏడాది రూ. 2,62,389 కోట్లు రక్షణ శాఖకు కేటాయించినప్పటికీ ఇందులో ఆధునీకరణకు ఖర్చు పెట్టింది రూ. 27,556 కోట్లు మాత్రమే.

తాజా బడ్జెట్‌లో రక్షణ రంగానికి కేటాయింపులు పెంచడంతో పాటు ఆధునీకరణ, ఆయుధసంపత్తి విస్తరణకు తగినన్ని నిధులు కేటాయించాల్సిన అవసరముంది. ఇప్పటికే ఖరారైన ఒప్పందాలకు కేంద్రం అడ్వాన్స్‌లు చెల్లించాలి. ఇందుకు తగిన నిధులు గత బడ్జెట్‌లో అందుబాటులో లేవు. దీంతో ఈ ఒప్పందాలు ఖరారైనా అమలుకు నోచుకోలేదు. దీంతో ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాలు రక్షణశాఖకు అందడంలో తీవ్రజాప్యం జరుగుతోంది. ఇటీవలె భారత వాయుసేనకు చెందిన మిగ్ 21రకం విమానాలు తరచూ ప్రమాదాలకు లోనౌతున్నాయి. వీటిని ఎప్పుడో సోవియట్ నుంచి కొనుగోలు చేశారు. వాటినే ఇప్పటికే వినియోగిస్తుంటే తరచూ ఇవి కుప్పకూలిపోతున్నాయి. దీంతో సామర్థ్యాన్ని పరిశీలించిన నిపుణులు 27మిగ్ 21యుద్ధవిమానాల్ని స్క్వాడ్రన్ నుంచి తొలగించాలని సూచించారు. 2020నాటికి మిగ్ 21 విమానాల్ని మొత్తంగా వాయుసేన నుంచి తప్పించాల్సిన ఆవశ్యకతను ఈ బృందం స్పష్టం చేసింది. 80వ దశకంలో కొనుగోలు చేసిన జాగ్వార్ విమానాలతో కూడిన స్క్వాడ్రన్‌లను కూడా పక్కనపెట్టాలని ఈ బృందం సిఫార్స్ చేసింది. వీటన్నింటిని తొలగిస్తే వీటి స్థానంలో మరింత ఆధునిక యుద్ధవిమానాల్ని కొనుగోలు చేయాలి. ఇటీవలె రాఫెల్ రకం యుద్ధ విమానాల కోసం ఒప్పందం జరిగింది. తేజస్ రకం విమానాలతో ఆరు స్క్వాడ్రన్‌లు ఏర్పాటు చేయాలని కూడా కేంద్రం నిర్ణయించింది. 2032నాటికి కొత్తగా 42స్క్వాడ్రన్‌ల విమానాల అవసరం. మరోవైపు ఐదోతరం స్టెల్త్ జెట్‌లను చైనా, పాక్‌లు సమకూర్చుకున్నాయి. వీటి కొనుగోలు అత్యంత వ్యయభరితం. బ్రిటెన్ యూరో జెట్ రకం విమానాల కొనుగోలుకు ఇజ్రాయెల్‌తో ఇటీవలె ఒప్పందాలు చేసుకుంది. అయితే వీటన్నింటికి అడ్వాన్స్‌లు చెల్లించాలి. ఇందుకు తగ్గ నిధులు కేటాయింపు జరగాలి. రక్షణరంగ అవసరాలకు అనుగుణంగా ఆయుధ తయారీ కర్మాగారాల్ని దేశీయంగా ఏర్పాటు చేయాలి. ఇందుక్కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. అన్నింటికి మించి రక్షణ రంగానికి జరిపిన కేటాయింపుల వ్యయానికి నిర్దేశించిన గడువు తొలగించాలి. ప్రస్తుతం మార్చి 31లోగా వ్యయం చేయని కేటాయింపులు రద్దవుతున్నాయి.

అంతర్జాతీయ ఒప్పందాల విషయంలో చెల్లింపులకు సంబంధించి జాప్యం జరగడం సహజం. జలవనరులు. జాతీయ రహదార్లకు తొలగించిన తరహాలోనే గడువు తొలగిస్తే తప్ప నిధుల సద్వినియోగం సాధ్యంకాదు. ఇక నేవీ విషయానికొస్తే హిందూసముద్రంపై ఆధిపత్యం కోసం చైనా పలురకాల ఒత్తిళ్ళు పెంచుతోంది. ఇప్పటికే దక్షిణ చైనా సముద్రంపై ఆ దేశం ఆధిపత్యం సాధించింది. భారత్‌లోని ప్రధాన నేవీ కేంద్రాలు లక్ష్యంగా శ్రీలంక, పాకిస్థాన్‌లలో చైనా నేవల్‌బేస్‌లను ఏర్పాటు చేసుకుంది. అక్కడ ఆధునిక యుద్ధ విమానాల్ని మోసుకుపోగల భారీ నౌకల్ని మోహరించింది. హిందూ మహాసముద్రాన్ని గుప్పెట పట్టేందుకు చేస్తున్న ప్రయత్నంలో చైనాకు భారత్ ఒకటే ఎదురునిలుస్తోంది. దీంతో భారత నావికాదళ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరముంది. ఇప్పుడున్న సబ్‌మెరైన్లకు తోడుగా అవసరమైతే అణ్వాయుధాల్ని మోసుకుపోగల 22 జలాంతర్గాముల్ని సమకూర్చుకోవాలని గతంలోనే నావికాదళాధిపతి కేంద్రానికి సూచించారు. సైనిక రవాణాకు తగినన్ని ఆర్మీ హెలీకాప్టర్లు అందుబాటులో లేవు. ఇప్పటికీ పాతకాలం నాటి చీతా రకం హెలీకాప్టర్లనే భారత సైనికదళం వినియోగిస్తోంది.

తరచూ అర్ధరాత్రి సమయాల్లో జరుగుతున్న దాడుల్ని సమర్థవంతంగా అరికట్టేందుకు ఇవి ఉపకరించడంలేదు. పైగా ఆధునిక ఆయుధాల్ని అమర్చేందుకు పాతకాలం నాటి చీతాలు సరిపోవు. వీటి స్థానంలో హైటెక్ అసాల్ట్ రైఫిళ్ళను బిగించేందుకు అనువైన ఆధునిక హెలీకాఫ్టర్ల అవసరముంది. రక్షణమంత్రి నిర్మలాసీతారామన్‌కు ప్రధాని మోడి వద్ద మంచి పట్టుంది. తనకున్న సాన్నిహిత్యాన్ని ఉపయోగించైనా మోడిపై ఒత్తిడి తెచ్చి తన శాఖకు నిర్మలా సీతారామన్ తగినన్ని నిధుల్ని మంజూరు చేయించుకుంటారన్న ఆశాభావం సైనిక వ్యవహారాల నిపుణుల్లో వ్యక్తమౌతోంది. చైనా, పాక్‌లకు అంతర్జాతీయ వేదికలపై గట్టిగా హెచ్చరికలు జారీ చేస్తున్న మోడీ ప్రభుత్వం భారత సైన్యం ఆధునీకరణ, ఆధునిక ఆయుధ సంపత్తి సమీకరణలతో అవసరమైతే ఎదురుదాడి చేసైనా పీచమణి చేయగలమన్న హెచ్చరిక జారీ చేసేందుకు తగినన్ని నిధులు బడ్జెట్‌లో కేటాయించాల్సిన అవసర ముందని వీరు విశ్లేషిస్తున్నారు.



ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పనిచేయాలి

- పాసింగ్ అవుట్ పరేడ్‌లో హోంమంత్రి నాయిని

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యం కాగలదని హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ స్టేట్ పోలీసు అకాడమీలో తొమ్మిది నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న 735 మంది మహిళా పోలీసు కానిస్టేబుల్స్ పాసింగ్ అవుట్ పరేడ్ బుధవారం జరిగింది. పరేడ్ గౌరవ వందనం స్వీకరించిన హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి ప్రసంగించారు. గతంలో పోలీసు శాఖలో జాయిన్ కావాలంటే వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం మొత్తంగా 735 మందిలో 159 మంది పోస్ట్‌గ్రాడ్యుయేట్స్ ఉన్నా రన్నారు. ప్రజా సమస్యల పట్ల ప్రధానంగా మహిళల సమస్యల పట్ల కృషి చేయా లని కోరారు. ప్రజలతో మమేకమవుతూ ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. పోలీసు శాఖలో ప్ర భుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిందని, 735 మంది ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లోకి చేరేందుకు సన్నద్ధులుగా ఉండటమే ఇందుకు ప్రత్యక్ష తార్కాణమన్నారు. డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మనం ప్రజా సేవకులన్న విషయాన్ని ఎల్లవేళలా గుర్తుంచు కోవాలన్నారు. వారు కన్నే పన్నుల ద్వారానే సర్వీసులో ఉన్న కాలంలోనూ, పదవీ విరమణ తర్వాత జీతం, పెన్షన్ పొందగలుగుతున్నామన్నారు. ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా.. వారి బాగోగులే మన లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రజలకు భరోసాతో పాటు ప్రజలకు పోలీసులు చేరువై శాంతి భద్రతల పరిరక్షణలో కృషి చేయాలన్నారు. ఆ దిశగా పాటు పడాలని ఆయన ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేశారు. ఒక్కసారిగా 735 మంది మహిళా కానిస్టేబుళ్లకు శిక్షణ నివ్వడం దేశంలోనే ఇదే ప్రథమమని, ఇందుకు కృషి చేసిన అకాడమీ డైరెక్టర్ జితేందర్‌కు హోంమంత్రి నాయిని, డీజీపీ మహేందర్‌రెడ్డిలు అభినందనలు తెలిపారు. కన్నుల పండువగా కొనసాగిన ఈ పాసింగ్ అవుట్ పరేడ్‌లో పలువురు పోలీసు ఉన్నతాధికారులతో పాటు ఆయా మహిళా కానిస్టేబుల్స్ పేరెంట్స్ కూడా తరలివచ్చి వారికి అభినందనలు తెలియజేశారు.

తెరాస ఓడితే రాజకీయ సన్యాసం చేస్తా!



(మొదటిపేజీ తరువాయి)

గూడూరులో చేనేత పార్కు, మౌలిక సదుపాయాలు, పరిపాలనా భవన్ నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఒకేరోజు రూ.40కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని, గద్వాలలో రూ.14 కోట్లతో చేనేత పార్కుకు శంకుస్థాపన చేసిన ఘనత తెరాసదేనని అన్నారు. ఆడ బిడ్డలందరికీ గద్వాల పట్టుచీరలంటే ప్రాణమని అన్నారు.

తెలంగాణ ఏర్పాటు అనంతరం కేసీఆర్ ఛాలెంజ్‌గా తీసుకొని అనతికాలంలోనే 24గంటల నిరంతరాయ విద్యుత్‌ను రైతులకు ఇస్తున్నామని అన్నారు. ఆంధ్రా పాలనలో ఎక్కువగా నష్టపోయింది మహబూబ్‌నగర్ జిల్లా అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాను ఆంధ్రా నాయకులతో చేతులు కలిపి ఆగం చేశారన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే మైనర్ ఇరిగేషన్ ద్వారా పాలమూరు జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందేదన్నారు. నెహ్రూ నుంచి రాహుల్ గాంధీ వరకు తెలంగాణకు అడుగడుగునా అన్యాయం చేశారని కేటీఆర్ మండిపడ్డారు. ఉద్యమ సమయంలో తాను జాతీయవాదినంటూ తప్పించుకున్న చరిత్ర జైపాల్‌రెడ్డిది కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. పాలమూరుకు నీళ్లివ్వకుండా అనంతపురంకు కృష్ణా నీళ్లు తరలిస్తుంటే హారతులు పట్టింది గద్వాల ఎమ్మెల్యే అరుణ కాదా అని ఆయన నిలదీశారు. ప్రజలకు కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేని దద్దమ్మలు కాంగ్రెస్ నేతలని కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. తుమ్మిళ్ల ఎత్తిపోతలతో 50వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు ఎకరానికి రూ.4వేలు పెట్టుబడి ఇవ్వనున్న ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలతో దేశంమొత్తం ఆశ్చర్యం వ్యక్తం చేస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులను ప్రజలు ఛీధరించుకుంటున్నారని, మరో 20ఏళ్ల దాకా తెలంగాణలో కేసీఆరే ముఖ్యమంత్రి అని కేటీఆర్ స్పష్టం చేశారు. గద్వాల నుంచి మొదలైన జైత్రయాత్ర రాష్ట్రమంతా కొనసాగుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు లక్ష్మారెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు నిరంజన్‌రెడ్డి, గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణమోహన్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లో టాప్‌గేర్

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారు. మార్చి 31లోగా ఈ ప్లాంటును గ్రిడ్‌కు సింక్రనైజ్ చేయనున్నారు. బాయిలర్ లైట్ అప్ విజయవంతం కావడంతో ఎంపిక చేసుకున్న సమయం మేరకు ప్లాంటును గ్రిడ్‌కు అనుసంధానం చేయాలనే లక్ష్యం నెరవేరేందుకు మార్గం సుగమమైంది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పనులు చేపట్టి పూర్తి చేసిన మొట్టమొదటి థర్మల్ ప్రాజెక్టుగా కెటిపిఎస్ ఏడవదశ 800మెగావాట్ల ప్లాంట్ చరిత్రలో నిలిచిపోనుంది. రూ.5700 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్లాంటు నిర్మాణ పనులు 2015 జనవరి 1న ప్రారంబించారు. ఈ ఏడాది మార్చి 31నాటికి సరిగ్గా 39 నెలలు పూర్తి కానున్నాయి. దేశంలో కొత్త విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులు ప్రారంభిస్తే 48 నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని కేంద్రీయ విద్యుత్ మండలి (సీఈఏ) నిబంధనలు ఉన్నాయి. అయితే కొత్తగూడెం ప్లాంటు నిర్మాణ పనులు అంతకన్నా తక్కువ వ్యవధిలోనే పూర్తి కావటంతో థర్మల్ ప్లాంట్ల నిర్మాణంలో కొత్త చరిత్ర సృష్టించడానికి కెటిపిఎస్ 7వ దశ ప్లాంటు సిద్ధమవుతున్నది. దేశంలో మరెక్కడా ఇంత తక్కువ సమయంలో విద్యుత్ ప్లాంటు నిర్మాణం జరగలేదు.

ఐడీసీ భారం తగ్గించేలా నిర్మాణం:

దేశంలో శరవేగంగా నిర్మాణం పూర్తి చేసుకున్న థర్మల్ ప్లాంటుగానే కాకుండా ఐడిసి భారం అధికంగా పడకుండా నిర్మాణం చేపట్టిన ప్రాజెక్టుగా కూడా కెటిపిఎస్ 7వ దశ ప్లాంటు చరిత్రలో నిలిచిపోనుంది. అగ్రిమెంట్‌లో నిర్దేశించిన కాలవ్యవధిలోగా పని పూర్తి కాకపోతే ఇంట్రెస్ట్ డ్యూరింగ్ కన్‌స్ట్రక్షన్(ఐడిసి) రూపంలో అదనపు వ్యయం అవుతుంది. ఈ అదనపు వడ్డీ భారాన్ని కూడా విద్యుత్ సంస్థలు భరించి విద్యుత్ కొనగోలు చేయాల్సి వచ్చేది. అంతిమంగా ఆ భారం ప్రజలపైనే పడుతుంది. అయితే నిర్ణీత సమయం కంటే ముందే నిర్మాణం పూర్తికావడం వల్ల కెటిపిఎస్ 7వ దశ నుంచి విద్యుత్‌కు ఐడిసిభారం ఎక్కువగాపడే అవకాశాలు లేవు. దీనివల్ల ఇక్కడి నుంచి వచ్చే విద్యుత్ కూడా చాలా తక్కువ ధరకు లభ్యమవుతుంది. ఈ అరుదైన ఘనత కూడా కెటిపిఎస్ సాధించనుంది.


ట్రయల్ రన్ సక్సెస్‌పై సీఎం హర్షం:

కెటిపిఎస్ ఏడవ దశ నిర్మాణంలో భాగంగా



బాయిలర్‌ను వెలిగించి ట్రయల్ రన్ ప్రారంభించటం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సీఎం కేసీఆర్ జన్‌కో ,ట్రాన్స్‌కో సంస్థల సీఎండీ ప్రభాకర్ రావుకు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. పారదర్శకత, పనుల్లో వేగం సాధించా లనే లక్ష్యాలతో విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాన్ని ప్రభుత్వరంగ సంస్థల కు అప్పగిం చామని, ఈ లక్ష్యం నెరవేరు తున్నం దుకు సంతోషంగా ఉంద న్నారు. తక్కువ సమ యంలో నిర్మిస్తున్న కెటిపిఎస్‌ను స్ఫూర్తిగా తీసుకుని భద్రాద్రి, యాదాద్రి ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని సీంఎం పిలుపునిచ్చారు. తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యుత్ శాఖ ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని సీఎం కేసీఆర్ అభినం దించారు.

డిసెంబర్ నాటికి 17వేల మెగావాట్లు: సీఎండి



తెలంగాణ రాష్ట్రానికి 28 వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉండే విధంగా ప్రణాళిక రచించి, రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్దేశించిన లక్ష్యం మేరకు విద్యుత్ ఉత్పత్తిని పెంచుతున్నట్టు సిఎండి ప్రభాకర్ రావు వెల్లడించారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్మాణంలో ఉన్న కెటిపిఎస్ 7వ దశ భద్రాద్రి ప్లాంటును సందర్శించారు. పనుల పురోగతిపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎండీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి రాష్ట్రానికి 17వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. తెలం గాణ రాష్ట్రం ఏర్పడే నాటికి కేవలం 6573 మెగావాట్ల విద్యుత్ మాత్రమే అందుబాటులో ఉండేదన్నారు. ఈ మూడున్నరేళ్లలోనే దాన్ని 14,972 మెగావాట్లకు చేర్చగలిగామన్నారు. ఇందులో 3వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కూడా ఉందన్నారు. మార్చి 31నాటికి కెటిపిఎస్ నుంచి 800మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి రానుందన్నారు. డిసెంబర్ 31నాటికి 1080 మెగావాట్ల సామర్థ్యం కలిగిన భద్రాద్రి ప్లాంట్ నిర్మాణం కూడా పూర్తవుతుం దన్నారు. భద్రాద్రి ప్లాంటులో రెండు యూనిట్లను డిసెంబర్‌లో, మరో రెండు యూనిట్లను ఏప్రిల్‌లో సింక్రనైజ్ చేయనున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం 3200 మెగావాట్ల సోలార్ విద్యుత్ వస్తోందని, డిసెంబర్ నాటికి మరింత సోలార్ విద్యుత్ అందుబాటులోకి రానుందన్నారు. మొత్తం 17వేల మెగావాట్ల విద్యుత్ తెలంగాణకు అందుబాటులో ఉండనుందన్నారు. యాదాద్రి నాలుగు వేల మెగావాట్ల పవర్‌ప్లాంట్ నిర్మాణం కూడా శరవేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. కేవలం ఈ మూడు ప్లాంట్ల ద్వారానే తెలంగాణ జెన్‌కో మొత్తం 5880మెగావాట్ల థర్మల్ విద్యుత్‌ను కొత్తగా సమకూర్చుకోబొతుందని ప్రభాకర్ రావు వెల్లడించారు.

ఆదిలాబాద్ ప్రాజెక్టులకు మహారాష్ట్ర సానుకూలం

- రెండు ప్రాజెక్టులకు వన్యప్రాణి బోర్డు లైన్ క్లియర్
- మంత్రి హరీశ్‌రావు హర్షం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉమ్మడి ఆదిలాబాద్‌లోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలకు సంబంధించిన రెండు సాగునీటి ప్రాజెక్టులకు బుధవారం వన్యప్రాణి బోర్డు అనుమతి లభించింది. ఇరిగేషన్ మంత్రి హరీష్ రావు గత కొన్నిమాసాలుగా మహారాష్ట్రతో జరుపుతున్న చర్చలు ఫలప్రదమయ్యాయి. చనాకా-కొరాటా, తుమ్మిడిహట్టి ప్రాజెక్టులపై మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రెండు ప్రాజెక్టుల వల్ల వన్యప్రాణిలకు ఎలాంటి హాని లేదని మహారాష్ట్ర తెలిపింది. పెన్‌గంగ నదిపై నిర్మిస్తున్న చనాకా-కొరాటా ద్వారా 51వేల ఎకరాలకు, ప్రాణహితపై నిర్మిస్తున్న 2లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తుండగా.. మహారాష్ట్ర గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అధ్యక్షతన బుధవారం ముంబై సహ్యాద్రి గెస్ట్‌హౌజ్‌లో ఆ రాష్ట్ర వన్యప్రాణి బోర్డు సమావేశమైంది. సమావేశంలో మహారాష్ట్ర ఆర్థికమంత్రి సుధీర్ మునిగంటి వార్ వికాస్ ఖర్కే, రాష్ట్ర అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ భగవాన్, తెలంగాణకు చెందిన ఆదిలాబాద్ సిఈ భగవంతరావు, డిప్యూటీ ఫారెస్ట్ కన్జర్వేటర్ శ్రీనివాస్, పెన్‌గంగ ఎస్ఈ అంజాద్‌హుస్సెన్ పాల్గొన్నారు. చనాకాకొరాటా, తుమ్మిడి హట్టి బ్యారేజీల నిర్మాణం రెండు వన్యప్రాణి కేంద్రాలపై ప్రభావం ఉండదని తేల్చిన మహారాష్ట్ర వన్యప్రాణి మండలి జాతీయ వన్యప్రాణి మండలికి సిఫార్సుచేసింది. మహారాష్ట్ర వన్యప్రాణి బోర్డు నిర్ణయంపై మంత్రి హరీష్ హర్షం వ్యక్తం చేశారు.

హోంగార్డుల వేతనం ఇరవై వేలు

(మొదటిపేజీ తరువాయి)

వేతనాల పెంపుతో పాటు పలు హామీలను ఇచ్చారు. సీఎం ఇచ్చిన హామీల మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఉత్తర్వులలోని అంశాలన్నీ ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. హోంగార్డుల దినసరి వేతనం రూ. 675 లకు పెంచారు. ఇక నుంచి ప్రతీ ఏటా వేయి రూపాయల వేతనం పెరగనుంది. అదే విధంగా ట్రాఫిక్ విధులను నిర్వహించే హోంగార్డులకు కానిస్టేబుళ్ళకు ఇస్తున్నట్లుగా 30 శాతం అలవెన్స్‌ను చెల్లించనున్నారు. యూనిఫాం అలవెన్స్ కింద రూ. 2500 లు ఇవ్వనున్నారు. మహిళా హోంగార్డులకు (ఇద్దరు పిల్లల వరకు) ఆరు మాసాలు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేస్తారు.

అదే విధంగా పురుష హోంగార్డు భార్య ప్రసవిస్తే 15 రోజులు వేతనంతో కూడిన సెలవు ఇవ్వనున్నారు. బందోబస్తు విధులను నిర్వహించే హోంగార్డులకు కానిస్టేబుళ్ళకు చెల్లించే విధంగా అలవెన్సులను వర్తింప చేయనున్నారు. హోంగార్డులు వారి కుటుంబసభ్యులకు అన్ని పోలీసు ఆస్పత్రులలో ఉచిత వైద్య సేవలు అందనున్నాయి.

హోంగార్డులకు డబుల్ బెడ్‌రూంలను కూడా మంజూరు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఆదేశాలను ప్రత్యేకంగా జారీ చేయనున్నట్లు ఉత్తర్వులలో స్పష్టం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో పోలీసు శాఖలో పని చేస్తున్న దాదాపు 10 వేల మందికి లబ్ధి చేకూరనుంది.



రెసిడెన్షియల్ కాలేజ్ జెఎల్, డీఎల్ పరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని రెసిడెన్షియల్ సొసైటీల అధ్వర్యంలో నడుస్తున్న కాలేజీల్లో జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ లెక్చరర్లు, ప్రిన్సిపాల్స్‌తోపాటు, స్కూల్స్ ప్రిన్సిపాల్స్ నియామకాలకు సంబంధించిన ప్రధాన పరీక్షల తేదిలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. జూనియర్ లెక్చరర్లకు ఫిబ్రవరి 19న ఉదయం పేపర్-1 పరీక్షను, మధ్యాహ్నం పేపర్-2ను నిర్వహించనున్నారు. డిగ్రీ లెక్చరర్లకు 20న ఉదయం పరీక్ష నిర్వహిస్తారు. 20 మధ్యాహ్నం లైబ్రేరియన్లకు పరీక్షలను నిర్వహిస్తారు. స్కూల్స్‌లో ప్రిన్సిపాల్స్ నియామకం కోసం 21న ఉదయం పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం పేపర్-2 పరీక్ష ఉంటుంది. జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్స్‌కు 22న ఉదయం పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం పేపర్-2 పరీక్షను నిర్వహిస్తారు. జూనియర్ కాలేజెస్‌లో ఫిజికల్ డైరక్టర్ల కోసం 23న ఉదయం, డిగ్రీ కాలేజెస్‌లో ఫిజికల్ డైరక్టర్ల కోసం మధ్యాహ్నం పరీక్షలను నిర్వహించనున్నట్టు కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలను కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు తెలిపారు.

సహకార ఎన్నికలు వాయిదా

- ఆరు నెలలు పర్సన్ ఇంచార్జీల పాలన • అన్ని సంఘాలది ఇదే తీరు
- కొత్త జిల్లాల ఆధారంగా పరిధుల మదింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఊహించినట్లుగా సహకార ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసింది. మరో ఆరు నెలల పాటు పర్సన్ ఇంచార్జుల ఆధ్వర్యంలో సహకార సంఘాలు కొనసాగనున్నాయి. పదవీ కాలం ముగుస్తున్న ప్రాథమిక సహకార సంఘాలు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, జిల్లా కేంద్ర మార్కెటింగ్ సంఘాలు, రాష్ట్రసహకార అపెక్స్ బ్యాంకు పాలక వర్గాలను ఆరు నెలలపాటు పర్సన్ ఇంచార్జీలుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని 456 సహకార సంఘాల పదవీ కాలం నేటితో ముగిసింది. మరో 427 సంఘాల పదవీ కాలపు గడువు ఫిబ్రవరి 3తో ముగియనుంది. అదేవిధంగా కొంత అటుఇటుగా మిగిలిన సంఘాల గడువుకూడా ముగియనుంది. అయితే ఈ అంశంపై తీవ్ర తర్జనభర్జనల తర్వాత క్యాబినెట్ సబ్ కమిగటీ ఈ కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే పొడిగింపునిచ్చిన ఈ ఆరు నెలల్లోగా మరోసారి సమావేశమై తదుపరి నిర్ణయం తీసుకోనున్నామని పేర్కొంది. కాగా ప్రస్తుతం ఉన్న పాలకమండళ్లు తెలంగాణ ఆవిర్భావానికి ముందు 2013లో ఎన్నికయ్యాయి. ఆ తర్వాత రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన జరగడంతో 10 జిల్లాలు 31 జిల్లాలుగా ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం పాత పాలకమండళ్లు పాత జిల్లాల ఆధారంగానే పనిచేస్తున్నాయి. వీటి ఆస్తులు, అప్పులు, పరిధులను తిరిగి నిర్ధారించాల్సిన అవసరం ఏర్పడింది. 31 జిల్లాల పరిధిలో వీటి నిర్ధారణ, ఆస్తులు, అప్పుల మదింపు తర్వాత ఈ ప్రక్రియకు రిజర్వు బ్యాంకు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఓటర్ జాబితా ప్రకటన, నూతన చట్టం నేపథ్యంలో అనివార్యంగా ఎన్నికలను వాయిదా వేయాల్సిన పరిస్థితి తలెత్తింది.

సహకార చట్టంలో మార్పులు...

ఇటీవలే సహకార రంగంలో ప్రభుత్వం కీలక సంస్కరణలు తెస్తూ చట్ట సవరణ చేసింది. తద్వారా సహకార రంగంలో మరింత పారదర్శకతను తెచ్చేలా కృషి చేసింది. కోఆపరేటివ్ సొసైటీల పనితీరును మరింత ప్రభావవంతం చేయడంతోపాటు వాటిని మెర్గు పర్చడమే లక్ష్యంగా కీలక మార్పులు చేసింది. పనిలోపనిగా సహకార ఎన్నికల ప్రక్రియలో కూడా సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి రాష్ట్రంలోని సహకార చట్టంలో కీలక మార్పులు తెస్తూ గత నెల తెలంగాణ సహకార చట్టాన్ని సొంతంగా ఏర్పాటు చేసుకుంది.

వ్యవస్థీకృత మార్పుల్లో భాగంగా ఏపీ కో ఆపరేటివ్ సొసైటీస్ యాక్టు-1964లో కీలక సవరణలను చేసింది. సవరించిన టిసిఎస్ చట్టంలోని సెక్షన్ 31 బి ప్రకారం అన్ని సహకార సొసైటీల ఎన్నికలను అదనపు రిజిస్ట్రార్ ర్యాంక్ అధికారి నేతృత్వంలో ఏర్పాటు చేయనున్న కో ఆపరేటీవ్ ఎలక్షన్ అథారిటీ నిర్వహించనుంది. సహకార ఎన్నికల నిర్వహణకుగానూ నిర్దేశిత రాష్ట్రసహకార ఎన్నికల అథారిటీని అదనపు రిజిస్ట్రార్ శ్రీనివాసరావు నేతృత్వంలో ఏర్పాటు చేసింది. కో ఆపరేటివ్ సొసైటీలకు ఎన్నికల నియమావళి, నిర్వహణ, ఎన్నికల ప్రవర్తన విధానాలను ఈ చట్టంలోని నిబంధన 22 కల్పించనుంది. ఈ నిబంధనల మేరకు జిల్లా రిజిస్ట్రార్, జిల్లా కలెక్టర్లు ఎన్నికలకు ఆదేశించే అధికారం, సహకార సంఘాలు, సొసైటీలకు ఎన్నికల అధికారులను నియమించే హక్కును, రాష్ట్ర ప్రభుత్వంనుంచి ఎలాంటి సాయం పొందకుండానే సహకార సంఘాలకు సొంతంగా ఎన్నికల నిర్వహణకు వీలు కలుగుతుంది. సవరించిన చట్టంలోని సెక్షన్ 31బికు అనుగుణంగా రూల్ 22ను ప్రభుత్వం తెచ్చింది. తెలంగాణ కో ఆపరేటివ్ సొసైటీస్ రూల్ 22 ప్రకారం కీలక నిబంధనలను తెరపైకి తెచ్చింది.

- అన్ని సహకార సంఘాలు, అన్ ఎయిడెడ్ సొసై టీలు తమ పదవీకాలం ముగిసేందుకు 60 రోజుల ముందే రాష్ట్రసహకార ఎన్నికల అథారిటీకి ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంటుంది.
- ఎన్నికల ప్రతిపాదనలకు ముందే రిజిస్ట్రార్ ఆమోదం పొందిన ఓటర్ల జాబితా కల్గి ఉండాలి. ఓటర్ల జాబితా ఎన్నికల్లో కీలకంగా నిలుస్తూ పలు సందర్భాల్లో వివాదాలకు కారణమవుతోంది. పారదర్శకతతో కూడిన జాబితాను రిజిస్ట్రార్‌కు సమర్పించాలి. ఆయన అభ్యంతరాలను స్వీకరించాలి. వాటి పరిశీలన తర్వాతే తుది జాబితా ఖరారు చేయాలి. గతంలో తక్కువ స్థాయి అధికారి నేతృత్వంలో వీటి పరిశీలన జరిగేది. గతంలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత జాబితా సిద్ధం చేసేవారు. కానీ దీనిని తాజాగా మార్చిన ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ జారీకి ముందే అర్హత కల్గిన జాబితాను ఖరారు చేసి ఆమోదించాలి.
- ఎన్నికల వ్యయం అభ్యర్థులు రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీలో జమ చేయాలి.
- గతంలో రిజర్వుడు స్థానాలు, ఖాళీగా ఉన్న సీట్లు నామినేషన్ పద్ధతిలో భర్తీ చేయడం ఆనవాయితీగా ఉంది. దీంతో అనేకఅక్రమాలు జరిగాయని ప్రభుత్వం గుర్తించింది. అయితే ఇప్పుడా పద్ధతికిస్వస్తి చెప్పిన ప్రభుత్వం ఖాళీలు, రిజర్వుడు సీట్లను ఎన్నికల ద్వారానే భర్తీ చేయాలని నిర్ణయించింది. రాజీనామా లేదా మరణంతో ఖాళీ, లేదా అనర్హతతో ఖాళీ అయిన స్థానాల్లో అయితే రెండున్నరేళ్లకంటే తక్కువగా పదవీ కాలం ఉంటే నామినేషన్ ద్వారా భర్తీ చేయాలి. ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన సభ్యుడు నామినేషన్‌కు అనర్హుడని ప్రభుత్వం నిర్ణయించింది,
- నిర్వహణ కమిటీల కూర్పును గరిష్ఠంగా 21 మంది సభ్యులుగా సవరిస్తూ చట్టంలో పేర్కొంది.
- చేతులు ఎత్తడం ద్వారా నిర్వహించే ఎన్నికల ప్రక్రియ 50కంటే తక్కువ అర్హత కల్గిన ఓటర్లున్న సంఘాలకు మాత్రమే పరిమితం చేశారు.
- ఇప్పటి కాలనికి అనుగుణంగా ఎన్నికల ప్రక్రియకు అవసరమైన పత్రాల రూపకల్పన. ఓటర్ల జాబితాలో ఫోటోల చేర్పు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.
- పాన్, బ్యాంకు ఖాతా నెంబర్, కెసిసి వివరాలను నామినేషన్లలో తెలపాల్సి ఉంటుంది. ఫోటోలతో కూడిన ఓటర్ల జాబితా తయారీకి ఆదేశం.
- ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న ఈ కిలక నిర్ణయాలన్నీ సహకార ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు కారణమవుతాయని, తద్వారా సహకార సొసైటీలు ప్రజాస్వామ్యాన్ని మరింత ప్రభావవంతంగా ద్విగుణీకృతం చేస్తాయని సర్కార్ యోచిస్తోంది. తెలంగాణ సహకార రంగం బలోపేతానికి ఇది వెన్నువముకగా నిలుస్తుందనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ మార్పులకు ఆమోదం తెలిపింది.

కారుణ్యానికి కత్తెర

- పరిహారంగా రూ. 75 లక్షలు
- కోల్ ఇండియా ప్రతిపాదనను తిరస్కరిస్తున్న జాతీయ కార్మిక సంఘాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కారుణ్య నియామకాలకు శాశ్వతంగా కత్తెర వేసేదిశగా కోలిండియా యాజమాన్యం వేస్తున్న అడుగులపై జాతీయ కార్మికసంఘాలు ఆగ్రహంగా ఉన్నాయి. విధి నిర్వహణలో ఉండి సహజ మరణం పొందినా, లేదా బయట ఇతర కారణాల వల్ల మృతిచెందినా, అన్‌ఫిట్ అయినా.. కార్మికుల పిల్లలకు ఉద్యోగం ఇచ్చే నిబంధన ఇంతకాలం అమల్లో ఉండగా.. దీనిని శాశ్వతంగా తొలగించి పరిహారంగా రూ.75లక్షలు ఇస్తామని కోలిండియా తాజాగా ప్రతిపాదించింది. రెండురోజుల క్రితం బిలాస్‌పూర్‌లో జరిగిన పదవ బొగ్గుగని కార్మికుల వేతన సబ్‌కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనను జాతీయ కార్మికసంఘాల ముందు యాజమాన్యం ఉంచగా.. తిరస్కరించాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ వారసత్వ ఉద్యోగాల హక్కును వదులుకునేది లేదని స్పష్టం చేశాయి. ప్రతిపాదించిన రూ.75లక్షలను మూడు విడతలలో చెల్లిస్తామని కోలిండియా యాజమాన్యం చెబుతోంది. కోలిండియాలో ఇప్పటికే ఉన్న కారుణ్యనియామకాలను కూడా.. వదిలించుకునేందుకు సిద్ధమవుతుండగా, సింగరేణి కాలరీస్‌లో వీటికి తోడు కార్మికుల వారసుల పిల్లలందరికీ ఉద్యోగాలిస్తామని రాష్ట్రప్రభుత్వం చెబుతున్న మాటలు.. చేస్తున్న ప్రయత్నాలు ఏ మేరకు సఫలమవుతాయోనన్న చర్చ జరుగుతోంది. కోలిండియా యాజమాన్యం కారుణ్యనియామకాలు రద్దు చేసేందుకు ప్రయత్నిస్తూనే 15వేల మంది ఉద్యోగులను, 3వేల మంది అధికారులను కుదించేందుకు ప్రత్యేక వీఆర్ఎస్‌కు సిద్ధమైంది.

దేశవ్యాప్తంగా బొగ్గుపరిశ్రమలో భిన్న పరిస్థితులుండగా, సింగరేణిలో ప్రభుత్వహామీల అమలుపై ఉత్కంఠ నెలకొంది. సింగరేణిలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల అధ్యయనానికే ఇటీవల కేంద్ర బొగ్గుమంత్రిత్వశాఖ కార్యదర్శి సుశీల్‌కుమార్ పర్యటించి వెళ్ళారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 1 ఫిబ్రవరి 2018

బడ్జెట్‌కు సహేతుకతే ప్రాణం!

జమిలి ఎందుకంటే..!

అసెంబ్లీకీ, పార్లమెంటుకూ ఒకే సారి ఎన్నికలను నిర్వహించడాన్నే జమిలి ఎన్నికలు అంటారు. మనదేశంలో ఏటా ఏదో ఒక రాష్ట్రంలో లేదా,కొన్ని రాష్ట్రా ల్లో ఎన్నికలు అనివార్యమవుతుండటం వల్ల వ్యయం తడిసి మోపెడవుతోంది. ఈ మాట అటుంచితే, ఎన్నికల నియమావళి కారణంగా ఆయా రాష్ట్రాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోతున్నమాట నిజమే. జమిలి ఎన్నికలు మనకు కొత్త కాదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇరవై ఏళ్ళ పాటు జమిలి ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యానికి 1967లో గండి పడటం, కాంగ్రెస్‌కి ప్రత్యామ్నాయంగా అధికారంలోకి వచ్చిన సంకీర్ణ ప్రభుత్వాలు పేకమేడల్లా కూలి పోవడంతో మళ్ళీ మళ్ళీ ఎన్నికలు నిర్వహించాల్సి రావడం కారణంగా జమిలి సంప్రదాయం వెనక్కి పోయింది. ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎన్‌డియే-2 ప్రభుత్వం మళ్ళీ ఈ ఆలోచన చేస్తోంది. జమిలి ఎన్నికలపై అన్ని పార్టీలు ఏకాభిప్రాయానికి రావాల్సిన అవసరం గురించి ప్రధానమంత్రి మోడీ చాలా సందర్భాల్లో బోధ చేశారు. ఇప్పుడు దేశానికి ప్రథమ పౌరుడైన రాష్ట్రపతి రామనాథ్‌కోవింద్‌కూడా అదే సూచన చేశారు. అంటే జమిలి ఎన్నికల ప్రతిపాదనను ప్రభుత్వం తీవ్రంగానే పరిశీలిస్తోందన్న విషయం సుస్పష్టమైంది. దేశంలో రాజకీయ వాతావరణం తమకు అనుకూలంగా ఉన్నప్పుడే ప్రభుత్వాధినేతల నుంచి ఇలాంటి ప్రతిపాదనలు వస్తుంటాయి. మోడీకి ఇప్పుడు సొంత పార్టీలోనే కాకుండా, రాజకీయంగా తిరుగులేదు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణ మెజారిటీని సాధించినా సంకీర్ణ ధర్మాన్ని పాటించడం కోసం ఎన్‌డిఏ కూటమిలో భాగస్వామ్య పక్షాలకు కేంద్ర మంత్రివర్గంలో స్థానం కల్పించారు. అప్పటికి పలు మహారాష్ట్ర, హర్యానా, ఉత్తరప్రదేశ్ వంటి అనేక రాష్ట్రాల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున సంకీర్ణాన్ని కొనసాగించడమే మంచిదని ఆయన భావించి ఉండవచ్చు. ఆ తర్వాత ఎన్నికలైన రాష్ట్రాల్లో ఢిల్లీ, బీహార్ తప్ప అన్ని చోట్లా తమ పార్టీయే గెలుపొందడంతో ఆయనలో ఆత్మవిశ్వాసం పెరిగింది. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను కూడా దారిలోకి తెచ్చుకున్నారు. ఇప్పుడు ఆయన కూడా జమిలి ఎన్నికలకు సై అంటున్నారు. కనుక, తమకు ఎదురు లేదనే భావన మోడీలో బలపడి ఉండవచ్చు. శివసేన, ఎన్‌డిఏ ఇతర భాగస్వామ్య పక్షాల నుంచి తరచూ చికాకులు ఎదురవుతున్నందున ఒకేసారి ఎన్నికలకు వెళ్ళడమే మంచిదన్న భావన కమలనాథుల్లో ఏర్పడింది. అదే సందర్భంలో వరుస విజయాలతో మోడీలోనూ, కమలనాథుల్లోనూ మార్పు వచ్చిందనీ, తమకు గతంలో మాదిరి గుర్తింపు, గౌరవం లభించడం లేదని మిత్రపక్షాల్లోనూ వచ్చింది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ లలో మిత్ర పక్షాల నాయకులకూ, కమలనాథులకూ మధ్య వాగ్వాదాలు పెరుగుతున్నాయి. ఎవరికి తోచినట్టు వారు మాట్లాడుతుండటంతో ఎవరిని ఎవరు అదుపులో పెట్టాలన్న ప్రశ్న తలెత్తుతోంది. మహారాష్ట్రలో శివసేన నాయకులు బీజేపీతో కటీఫ్ చేసుకుంటున్నట్టు బహిరంగంగానే ప్రకటించిన వెంటనే అది మీకే నష్టమని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పష్టంచేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మా వాళ్ళను నేను అదుపుచేస్తున్నాను, మీ వాళ్ళను అదుపు చేసుకోవల్సిన బాధ్యత మీదే అని కౌంటర్ ఇచ్చిన తర్వాత కమలనాథుల్లో స్వరం మారింది. ఉత్తరప్రదేశ్‌లో మిత్రపక్షంగా ఉన్న సుహేల్దేవ్ భారతీయ సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి ఓం ప్రకాష్ రాజ్‌భర్ రాష్ట్రంలో అవినీతి పెరిగి పోయిందంటూ ముఖ్య మంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై అసంతృప్తిని బహిరంగంగానే వెళ్ళగక్కారు. ఆయనతో సహా నలుగురు ఎమ్మెల్యేలు మాత్రమే ఆ పార్టీలో ఉన్నారు. ఇలా ప్రతి రాష్ట్రంలో మిత్ర పక్షాల నుంచి విమర్శలో, హెచ్చరికలో రావడం కమలనాథులకు చికాకుగా ఉంది. జమిలి జపాన్ని వారు అందుకున్నారు. ఇది సాధ్యమా అన్న సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రపతి సూచించినట్టుగానే అన్ని పార్టీలూ ఏకాభిప్రాయానికి రావల్సి ఉంది. వ్యయం సంగతి అలా ఉంచినా, ఒకే సారి ఎన్నికలను నిర్వహించడానికి తగినంత మంది పోలింగ్ సిబ్బందినీ, భద్రతాదళాలనూ చూసుకోవల్సి ఉంటుంది. ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రా ల్లో ఒక రోజు పోలింగ్ చేపట్టలేకే, ఆరేడు దశల్లో నిర్వహిస్తోంది. గతంలో ఉన్నంత హింస ఇప్పుడు లేకపోయినా, పోలింగ్ కేంద్రాల ఆక్రమణ వంటి అక్రమాలు ఉన్నాయి. ఒకేసారి పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను చూసుకోవడం అధికార పార్టీకి కష్టం కాకపోవచ్చు, ఇతర పార్టీలకు ఇబ్బందే. ఎన్నికల నిధులు చూసుకోవడం కూడా కష్టమే. ప్రతిపక్షాల బలహీనతను చూసి దెబ్బకొట్టేందుకే ప్రభుత్వం ఈ ఆలోచన చేస్తోందన్న వాదన నిరాధారం కాదు. ఎన్నికల సంఘం సంసిద్ధత తెలిపితే ప్రతిపక్షాల అభిప్రాయంతో నిమిత్తం లేకుండానే జమిలి ఎన్నికలను మోడీ చేపట్టవచ్చు. కేంద్రంలో, అన్ని రాష్ట్రా ల్లో బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ (కాంగ్రెస్ రహిత భారత దేశం) తమ లక్ష్యమని ఆయన పదే పదే స్పష్టం చేస్తున్నారు. మోడీ అభిమతం కూడా అదే కనుక జమిలి ఎన్నికలకే ఎక్కువ అవకాశాలున్నాయి.



హర్షవాక్కు

-వేటూరి శ్రీహర్ష(న్యూఢిల్లీ)

పాత రోజుల్లో కేంద్ర బడ్జెట్‌ను సాయంత్రం 5గంటల తరవాత లోక్‌సభలో ప్రవేశపెట్టేవారు. వాజపేయి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన యశ్వంత్ సిన్హా 2001 బడ్జెట్‌నాటికి ఈ సమయాన్ని మధ్యాహ్నం 12గంటలకు మార్చారు. గ్రీన్‌విచ్ సమయానికి తగ్గట్టుగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే పాతకాలపు సంప్రదాయానికి ఆయన తిలోదకాలిచ్చారు. బడ్జెట్ రోజు మీడియాకు ఒక పండగలా ఉండేది. 1990లో టెలివిజన్ ఇంకా శైశవ దశలో ఉంది. ఆహారం, నీళ్ళకు విపరీతమైన డిమాండ్ ఉండేది. ఢిల్లీలోని జాతీయ దినపత్రికలలో ఈ దృశ్యం సాధారణంగా కనిపించేది. చివరి నిముషం దాకా హడావుడే. ముఖ్యమైన సంగతులను చెప్పేందుకు రిపోర్టర్లు డెస్కుల వద్దకు పరుగులు తీసేవారు. బడ్జెట్ ప్రతిపాదనలను తెలియజేసేవారు. వీరందరితోనూ పత్రికా కార్యాలయాలలో రణగొణ ధ్వనులుండేవి.

కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల బడ్జెట్లను గుర్తు చేసుకోవడం, బేరీజు వేయడం నిష్ఫలమైన ప్రయత్నమే అని చెప్పకతప్పదు. అధికారంలో ఉన్నప్పుడు కానీ లేనప్పుడు కానీ ఆయా ప్రభుత్వాలు హామీలను నిలబెట్టుకోవడానికి కృషిచేయలేదు. నా స్నేహితుడొకాయన ఇటీవల నాతో.. రాజకీయాలన్నీ స్థానికాలే అని అన్నాడు. దాన్ని నేను ఇలా మారుస్తాను..బడ్జెట్ ప్రకటనలన్నీ రాజకీయాలే.. అవి అలాగే ఉండిపోతాయి. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే.. 2017బడ్జెట్ మోడీ ప్రభుత్వానికీ, అరుణ్‌జైట్లీకీ సంతృప్తికర ఫలితాలనే ఇచ్చింది. భారత దేశంలో బడ్జెట్ సాంకేతికంగా ఎలా ఉండాలో అలా ఉండడం లేదు. ఎంత సంపాదించాం..ఎంత ఖర్చుపెట్టామనే వివరాలు తప్ప ఏమీ ఉండవు. అదో ప్రభుత్వ జమాఖర్చుల పద్దులా ఉంటుందంతే. ఆర్థిక మంత్రులెవరూ చరిత్ర పుస్తకాలలోకి వెళ్ళరు. 2018 బడ్జెట్‌లో ముఖ్యమైన అంశాలేమిటి? ఏం సాధించదలచుకున్నారు? భారత ఆర్థిక రంగానికి అదేం చేస్తుంది? అన్న ప్రశ్నలు తలెత్తుతాయి. ఇతర రంగాలలో భారత్ సాధించిన విజయాలనూ, ఫలితాలను వ్యవసాయ రంగానికి దూరంగా ఉంచుతున్నారు. ఈ విషయంలో గత ప్రభుత్వాలను నిందించి ప్రయోజనం లేదు. గ్రామీణ సిద్ధాంతం నుంచి ఎన్డీయే ప్రభుత్వం పక్కకు తిరిగే అవకాశాలు తక్కువే. నరేంద్ర మోడీ రాజకీయంగా ఆలోచిస్తే, ప్రాధాన్యత రంగాలకు ఖర్చుచేస్తున్న మాదిరిగా వ్యవసాయానికి 24శాతం కేటాయించినా ఆశ్చర్యం లేదు. 50వేల గ్రామపంచాయతీలలో పేదరికాన్ని రూపుమాపడా నికి వీలుగా గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మరిన్ని నిధులను కేటాయించే అవకాశముంది. సహజంగానే ఇది ఉత్పత్తి రంగంలోనూ, వ్యవసాయ రంగంలోనూ ప్రాధాన్యతను పెంచుతుంది.

పెద్ద కరెన్సీ రద్దు నిర్ణయం చీకట్లో వేసిన బాణం కాదని నిరూపించుకునేందుకు బడ్జెట్‌ను వినియోగించుకునే అవకాశముంది. అరుణ్ జైట్లీ పన్ను ప్రతిపాదనలను కూలంకషంగా పరిశీలిస్తే, ఆదాయ పన్ను శాఖ అధికారులు పన్ను ఎగవేతదారులను లక్ష్యంగా చేసుకున్నట్లే కనిపిస్తోంది. డీమానిటైజేషన్ తరవాత బ్యాంకులలో చేసిన డిపాజిట్లను ఇందుకు ప్రామాణికంగా తీసుకుంటారు. పెద్ద సమాచారం(బిగ్ డేటా) అనే పదం ఇక్కడ ఎవరికి ప్రమాద ఘంటికలు మోగిస్తూ ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పన్ను ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఈ చర్య చెప్పకనే చెబుతుంది. చిన్న వ్యాపారస్థులను, అనధికార వ్యాపారాలను డీమానిటైజేషన్ తీవ్రంగా



దెబ్బతీసిన విషయాన్ని బడ్జెట్‌లో ప్రభుత్వం గమనంలో ఉంచుకోవాలి.

రానున్న 2018 బడ్జెట్ గత బడ్జెట్‌ల కంటే విభిన్నంగా ఉంటుందని ఆశించవచ్చు. ప్రముఖ జ్యోతిశ్శాస్త్రవేత్త బెజన్ దరువాలా ఇదే విషయాన్ని ఊహిస్తున్నారు. ప్రస్తుతం కేంద్ర బడ్జెట్ అంశం జ్యోతిష్యులకూ, హస్త సాముద్రికులకూ కూడా ఒక పరిశీలనాంశమైంది. ఆయనకు సంబంధించిన గణేశా స్పీక్స్ అనే ఓ వెబ్ సైట్ ఆర్థికపరమైన ముందస్తు జాగ్రత్తలను చెబుతోంది. వినియోగదారుని బ్యాంకు బ్యాలెన్సులు, వాటిని ఎలా పరిరక్షించుకోవాలీ, ఎక్కడ పెట్టుబడి పెట్టాలీ కూడా తెలియజేస్తుంది. ఇంతవరకూ సమర్పించిన బడ్జెట్లన్నీ ఆదాయ లోటును తగ్గించుకోవడానికే ప్రయత్నించాయని దారువాలా చెప్పారు. అదే సమయంలో ఆర్థిక రంగాన్ని పరిపుష్టం చేసేందుకు కృషిచేశాయన్నారు. ఇందుకోసమే పన్నుల వ్యవస్థలో పెద్ద మార్పులకు శ్రీకారం చుట్టారు. జిఎస్టీ అమలు తరవాత వస్తున్న ఈ మొదటి బడ్జెట్ కార్పొరేట్, చిన్న తరహా పరిశ్రమల రంగానికి చాలా కీలకమైందంటున్నారు దరువాలా. జైట్లీ సరికొత్త పంథాను ఎంచుకుంటారని ఆయన అంచనా వేస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి సన్నిహితుడుగానో లేక మంచి స్నేహితుడి మాదిరిగానో దారువాలా తన అంచనాను చెబుతున్నారు. పేదలు, గ్రామాలు, రైతుల అభివృద్ధిపై దృష్టి సారిస్తారని దారువాలా చెబుతున్నారు. ఇవన్నీ చూసిన అందరూ ముక్కు మీద వేళ్ళేసుకుంటున్నారు. ఒక న్యూమరాలజిస్టో, జ్యోతిష్యుడో కేంద్ర బడ్జెట్‌లో ఇవుంటాయని ఎలా ఊహించగలరని ప్రశ్నిస్తున్నారు. ఆర్థిక మంత్రి ప్రవేశ పెట్టే బడ్జెట్‌ను వీళ్ళెలా ఊహిస్తారనేది వారికి సమాధానం లేని ప్రశ్న. బడ్జెట్లు కూడా ఎన్నికల ఫలితాలను జ్యోతిష్యులు ఊహించిన మాదిరిగా మారిపోతాయా? అనేది వారి సందేహం. బడ్జెట్లో ఏం ఉండబోతోందో స్వామీజీలూ, బాబాలు కూడా చెప్పేరోజు ఎంతో దూరంలో లేనట్టే ఉంది. వినియోగదారులకూ, పారిశ్రామిక సంస్థలకూ కూడా వారు తమ అంచనాలు చెప్పేస్తారేమో!

కలల బడ్జెట్ అనే మాట వినే ఉంటారు. మాజీ ఆర్థికమంత్రి పళనియప్పన్ చిదంబరం 1997లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు ఈ పేరు పెట్టారు. ఆ ఏడాది మార్చిలో ఆయన కలల బడ్జెట్‌ని పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అది అప్పట్లో భారతీయ పారిశ్రామికవర్గాలకు ఎంతో ప్రీతిపాత్రమైంది. ఆదాయం పన్ను రేటును గరిష్ఠంగా 30 శాతానికి తగ్గించారు. కార్పొరేట్ పన్నును 35 శాతానికి తగ్గించారు. టారిఫ్‌లను సగటు స్థాయిలకు కుదించేశారు. రెండో బడ్జెట్‌లో 25 శాతానికి తగ్గించారు. యూపీఏ తొలి ప్రభుత్వంలో ఆయన 70 వేలకోట్ల

బడ్జెట్ 2018

రూపాయల మేర వ్యవసాయ రుణాలను మాఫీ చేశారు. ప్రధానమంత్రి గ్రామీణ రోజ్ గార్ యోజన, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మొదలైనవన్నీ యూపీఏ కొనసాగడానికి ఉపయోగపడ్డాయి.

అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు తమ సొంత నియోజకవర్గాల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటారు. గ్రామీణ పేదలు, భూమిలేని నిరుపేదలు, చిన్న, మధ్యతరహా రైతులు, నీడలేనివారు ... ఇలా ఎంతోమందికి ఊతం ఇవ్వడం కోసం ఎన్నో పథకాలు, కార్యక్రమాలను ప్రవేశపెట్టడం స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి జరుగుతున్నదే. లబ్ధిదారుల సంఖ్య కూడా ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంది. ఇంతవరకూ అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అభివృద్ధి లక్ష్యాలను చేరుకున్నప్పటికీ, మన దేశం ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశమే. విద్యలో వెనకబడి ఉన్నామనే మాట తరచూ వినిపిస్తూ ఉంటుంది. సర్వశిక్ష అభియాన్, ఇతర విద్యాభివృద్ధి పథకాలలో ఎక్కడ లోపాలు ఉన్నాయన్న సందేహం కలుగుతూ ఉంటుంది.

ఆర్థికవ్యవస్థలో స్టాక్ మార్కెట్ల పని తీరు ఇన్వెస్టర్లు, కేపిటల్ మార్కెట్లతో సహా సంబంధితవర్గాలన్నింటి ప్రయోజనాలతో ముడిపడి ఉంది. స్టాక్ ఎక్స్చేంజి, ప్రభుత్వమూ మధ్య సంబంధం, రాజకీయాలు, మదుపుదారుల ధోరణిల మధ్య సంబంధాలను వివిధ దేశాల్లో వివిధ సందర్భాల్లో అధ్యయనం చేశారు. బడ్జెట్‌కి ముందూ, తర్వాత వెలువడే ఊహాగానాలు మార్కెట్లను కలవర పెడుతూ ఉండటం అనివార్యం. మార్కెట్ సంక్షోభానికి దారి తీయడంకూడా సహజమే. ఇటీవల సిఎస్‌డిఎస్ మూడ్ జాతీయ సర్వే 2018లో చాలా తమ అసంతృప్తిని వ్యక్తం చేశాయి. గతంలో కన్నా ఇంటి ఖర్చులు 41 శాతం పెరిగాయని పేర్కొన్నాయి. తమ ఆర్థిక పరిస్థితి పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశాయి. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు అధికారాన్ని నిలబెట్టుకోవడానికి బడ్జెట్ ముఖద్వారమని భావిస్తాయి. దురదృష్టమేమంటే, యూపీఏ కూటమి పదేళ్ళ పాటు అధికారంలో కొనసాగినా, తన పథకాలు, కార్యక్రమాలను స్థిరపర్చడంలో విఫలమైంది. మోడీ ప్రభుత్వం వాటిని అమలుచేయడంలో విజయంసాధించింది.

అందుకే ప్రధాని మోడీ రాజకీయ ఆలోచన ఈ ఏడాది బడ్జెట్ లో ప్రతిబింబించాలి. రాజకీయ ప్రయోజనాలు లేనిదే బడ్జెట్‌లను తయారు చేయరు. ప్రధాన విధాన మార్పులు, సంస్కరణలు ఏడాదిలో ప్రకటిస్తూనే ఉంటారు. ఇందుకు మంచి ఉదాహరణ డీమానిటైజేషన్. రానున్న మాసాల్లో కూడా ఇలాంటి సంస్కరణలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉండాలి. రాష్ట్రాల్లో వచ్చే ఎన్నికలను బట్టి ఇవి ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతానికి 2018 బడ్జెట్ సహేతుకంగానూ, ఆర్థిక కార్యకలాపాలను పెంచేదిగానూ ఉండాలి.

బాలలూ-నేరాలూ
10,14 స్థానాల్లో తెలుగు రాష్ట్రాలు

జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) నివేదిక ప్రకారం బాలలు చేసిన నేరాల జాబితాలో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు వరసగా 10, 14 స్థానాల్లో ఉన్నాయి. బాలలపై నేరాల్లో ఇవి 16, 17 స్థానాల్లో నిలిచాయి. దేశవ్యాప్తంగా జైళ్ళను తనిఖీచేసి, 16 ఏళ్లు నిండనివారుంటే పరివర్తన గృహాలకు (జువైనైల్ హోమ్) తరలించాలని ఢిల్లీ హైకోర్టు గతంలోనే ఎన్‌సీపీసీఆర్ ని ఆదేశించింది. దరిమిలా సామాజికవేత్తలు, న్యాయవాదులతో కూడిన కమిటీలను రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయి. జిల్లాస్థాయి కమిటీలో నలుగురికి చోటు కల్పించారు. నేరంచేసి పట్టుబడిన బాలలకు సరైన సంస్కారం నేర్పడం, పునరావాసం కల్పించడం చక్కని పరిష్కారమవుతుందని ఐరాస సూచించింది. ఇకదేశంలో బాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాల్సిన అవసరముందని సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల స్పష్టీకరించింది. బాలల నేర న్యాయ చట్టం అమలు గురించి కేంద్రం అరకొరగా ప్రమాణపత్రం దాఖలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా సుప్రీం కీలక వ్యాఖ్యలు చేసింది. కేంద్రం సమర్పించిన ప్రమాణ పత్రంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఇచ్చిన వివరాలను క్రోడీకరించలేదని పూర్తి సమాచారాన్ని న్యాయస్థానానికి నివేదించలేదని ఆక్షేపించింది. పిల్లలంటే కేంద్రానికి పట్టింపు లేదా అని జస్టిస్ మదన్‌లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. రాష్ట్రాల్లో బాలల హక్కుల రక్షణ కమిషన్‌లు, రాష్ట్ర బాలల సంక్షేమ సొసైటీలు, బాలల నేర న్యాయచట్టం అమలు, జిల్లాల స్థాయిలో బాలల న్యాయబోర్డులపై పూర్తి వివరాలు సమర్పించాలని 6 నెలల క్రితమే ఆదేశించినా సరైన స్పందనలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్లమెంటు ఉభయ సభలూ ఆమోదించిన బాలల న్యాయ (బాలల రక్షణ, సంరక్షణ) చట్టం 2015 ప్రకారం క్రూరమైన నేరాలకు పాల్పడిన వ్యక్తుల వయస్సు 16 నుంచి 18ఏళ్ళ మధ్య ఉంటే వారిని వయోజనులుగా గుర్తించాలా లేదా పిల్లలు గానా అనే విషయాన్ని బాలల న్యాయబోర్డులు నిర్ణయిస్తాయి. నేరం రుజువైతే శిక్ష విధించవచ్చు. మరణశిక్ష, జీవితఖైదు మాత్రం ఉండదు. వారికే ఉద్దేశించిన ప్రత్యేక కేంద్రంలో 21 ఏళ్ళ వయస్సు వచ్చేవరకు ఉంచుతారు. అప్పుడు వారి ప్రవర్తనను అంచనా వేస్తారు. ఒకవేళ నేరస్తుడు పరివర్తన చెందితే శిక్షను తగ్గించవచ్చు. బాలల న్యాయబోర్డులో ఒక సామాజిక శాస్త్రవేత్త ఒక పిల్లల హక్కుల కార్యకర్త ఉంటారు. పిల్లలేం చేస్తున్నారు. ఎలా వ్యవహరిస్తున్నారనే దానిపై కొందరు తల్లిదండ్రులు ఉదాసీనంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. వారు చెడుమార్గంలో పయనిస్తున్నా గుర్తించలేకపోవడంతో విపరీత పరిణామాలు తలెత్తుతున్నాయి. అత్యంత హింసాత్మకమైన నేరాలుగా పరిగణించే వాటిలోనే ఎక్కువ మంది బాలలు నిందితులుగా ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. హత్యలు, హత్యాయత్నాలు దోపిడులు, తదితర నేరాలను పోలీసు శాఖ అత్యంత హింసాత్మక నేరాలుగా పరిగణిస్తుంది. పర్యవేక్షణ లేమి, పెంపకంలో లోపాల ఫలితంగా పిల్లలు పక్కదారి పడుతున్నారని జాతీయ నేర గణాంక సంస్థ తాజా నివేదిక వెల్లడించింది. నేరాలకు పాల్పడుతున్న బాలల్లో అత్యధికులు కుటుంబ సభ్యులతో జీవిస్తున్నవారేనని తెలిపింది. పేదరికం కూడా పిల్లలను తప్పుదారి పట్టిస్తోంది. దొంగతనాలు, దోపిడీల వంటి నేరాలకు పురికొల్పుతోంది. గతంలో పోలీసులకు పట్టుబడే బాలనేరస్తుల్లో ఎక్కువమంది వీధిబాలలు, ఎలాంటి ఆశ్రయం లేనివారే ఉండేవారు. ప్రస్తుతం పరిస్థితి మారిందని అధ్యయనాలు తేల్చిచెబుతు న్నాయి. 2001లో బాల నేరస్తులు చేసిన అత్యాచారాలు 399, 2011 నాటికి అవి 1149కు పెరిగాయని జాతీయ నేర గణాంకసంస్థ నివేదించడం సమస్య తీవ్రతను బయటపెట్టింది. ఈ పరిస్థితుల్లో జెజె చట్టం 2000ను రద్దుచేసి, కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ ప్రక్రియలో కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ, మానవ వనరుల శాఖకు చెందిన పార్లమెంటరీ స్థాయీ సంఘం, ప్రత్యేకంగా ఏర్పాటైన మంత్రుల బృందం పాలు పంచుకున్నాయి. 2012 డిసెంబర్‌లో ఢిల్లీలో నిర్భయ అత్యాచార ఘటన అనంతరం జెజె చట్టాన్ని సవరించాలనే డిమాండ్లు వెల్లువెత్తాయి. హత్యలు, అత్యాచారాల వంటి ఘోరనేరాలకు పాల్పడే 16-18 ఏళ్ళ బాలలను పెద్దవారితో సమానంగా పరిగణించి శిక్షించాలన్న వాదన గట్టిగా వినిపిస్తోంది. కొందరు బాలలు కౌమారంలోకి అడుగుపెట్టే దశలో జల్సాలకు అలవాటుపడి డబ్బులకోసం చోరీలు చేస్తున్నారు. వివిధ ఆకర్షణలకు లోనై మహిళలను వేధిస్తున్నారు. చెడు సావాసాల ప్రభావంతో హింసాత్మక నేరాలకు పాల్పడుతు న్నారు. బాల నేరగాళ్ళలో 41, 45 శాతం ప్రాథమిక విద్యతో ఆపేసిన వారేనని ఓ అధ్యయనం తేల్చింది. కుటుంబ ఆర్థికపరిస్థితులు, విద్యానేపథ్యం, చెడు స్నేహాలు, తల్లిదండ్రుల అజాగ్రత్త వంటివి. ఇలాంటి ఘటనలకు ముఖ్య కారణాలుగా స్పష్టీకరించింది. నేరాల్లో బాలల ప్రమేయం ఏటేటా పెరుగుతూనే ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితి సరికొత్త సామాజిక సమస్యగా పరిణమిస్తోంది. గత ఏడాది బాలలు పాల్పడిన 638 నేరాలు హింసాత్మకమైనవని వెల్లడైంది. తెలుగు రాష్ట్రాల్లో నమోదైన 802 నేరాల్లో 1229 మంది బాలలు నిందితులుగా ఉన్నారు. వారిలో 910 మంది (74.04 శాతం) తల్లిదండ్రుల దగ్గర పెరుగుతున్నారు. మహిళలను వేధించడం, కించపరచడం వంటి నేరాలకు సంబంధించి బాలలపై 49 కేసులు నమోదయ్యాయి. వీటిలో లైంగిక వేధింపులపై ఏడు కేసులున్నాయి. పదో తరగతి లోపు విద్యార్హతలు కలిగిన పిల్లలే ఎక్కువమంది ఉన్నారు. కిందటేడాది బాల నేరస్థులకు సంబంధించి 871 కేసులు నమోదయ్యాయి. 1018 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు పాల్పడిన నేరాల్లో 57.74 శాతం దోపిడీలు, బందిపోట్లు, దొంగతనాలు చోరీల కేసులున్నాయి. మహిళలపై అకృత్యాలకు సంబంధించిన కేసులు 11.36 శాతం ఉన్నాయి. బాల నేరస్తుల్లో 83 శాతం, రూ.50 వేల లోపు వార్షిక ఆదాయం కలిగిన కుటుంబాలకు చెందిన వారేనని గణాంకాలు చెబుతున్నాయి. బాల నేరస్థులకు రక్షణ, పునరావాసం కల్పించడం ఎంత ముఖ్యమో, వాళ్ళచేతిలో అఘాయిత్యాలకు గురికాకుండా మహిళలు, ఇతరులకు రక్షణ కల్పించడమూ అంతే ప్రధానం. బాలనేరస్థుల (జువైనల్ జస్టిస్ జెజె) చట్టం-2000 ప్రకారం బాలలకు జైలు శిక్ష నిషిద్ధం, హత్య, అత్యాచారం, దోపిడీ వంటి ఘోరాలకు పాల్పడే బాలల సంఖ్య పెరిగిపోతున్న దృష్ట్యా జెజె చట్టానికి సవరణలు తేవాలని సర్వోన్నత న్యాయస్థానం 2011 లోనే అటార్నీ జనరల్‌ను కోరింది. నేరస్థుడిది పిన్న వయస్సు కాబట్టి తాను చేసిన పని ఎక్కడికి దారితీస్తుందో తెలియదనుకోవాలా, మనసు ఎదగలేదు కాబట్టి అతడు చేసింది నేరం కాదని నిర్ధారించవచ్చునా, బాలనేరస్థుడి దృష్టిలో హతుడి ప్రాణాలకు విలువే లేదా అని ఓ హత్య కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ప్రశ్నించింది.

● కీర్తి నాగరాజు, 9652404611

శాంతి, సౌభాగ్యాలకు ఆసియాన్ బంధం

ఆసియా- పసిఫిక్ ప్రాంతంలో శాంతి సౌభాగ్యాలు నెలకొనడానికి భారత - ఆసియన్ దేశాల బంధం మరింత బలపడాలని కొత్త ఢిల్లీలో నిర్వహించిన అగ్రనాయక సమావేశం అభిప్రాయ పడటం సముచితమూ, అవసరమూ, అభిలషణీయమూ. భారత 69వ గణతంత్ర దినోత్సవాలకు 10 ఆసియన్ దేశాల అధినేతలను గౌరవ అతిథులుగా ఏకకాలంలో ఆహ్వానించడం ద్వారా ఈ దేశాలతో ఆర్థిక, వాణిజ్య, స్నేహ, సుహృద్భావ సంబంధాలను మరింత దృఢపరచుకునే మోడీ ప్రభుత్వ యత్నాలు అభినందనీయం. ఆగ్నేయాసియా దేశాలతో స్నేహసంబంధాలను పెంపొందించుకోవడానికి భారత్ 25 ఏళ్ళ క్రితమే తూర్పు వైపు చూపును ప్రసరించి ఆ దిశగా అనేక ప్రయత్నాలు సాగిస్తూ ఇప్పుడు ఢిల్లీలో రజతోత్సవ సంబరాలను-గణతంత్ర దినోత్సవ వేడుకలతో మేళవించి తన సైనిక పాటవాన్ని ఆర్థిక వాణిజ్య, వైవిధ్య భరిత సాంస్కృతిక వైభవాన్నీ ప్రదర్శించి అధినేతలను ఆకట్టుకోవడం ముదావహం. నిజానికి ఆగ్నేయాసియా దేశాలతో భారత్ చారిత్రక మైత్రీ వాణిజ్య - సాంస్కృతిక బంధం 2 వేల ఏళ్ళనాటిది. కాంబోడియాలోని అంగ్‌కోర్ (విష్ణు) దేవాలయ సముదాయం, ఇండోనేసియా లోని బోరోబుదార్, ప్రంబనన్ మలేసియాలోని కేడాలో ప్రాచీన ఆలయాలూ, భారత హిందూ, బౌద్ధ సంస్కృతులతో ప్రభావితమై నిర్మించినవే. ఇండోనేసియా, బర్మా (మయన్మార్), థాయ్‌లాండ్ సహా అనేక ఆగ్నేయాసియా దేశాల్లో రామాయణం స్థానిక సంస్కృతులతో మమేకమై వివిధ రూపాల్లో నృత్య నాటికలుగా ప్రదర్శిత మవుతుండటం శతాబ్దాలుగా సాగుతున్న సాంస్కృతిక ఐక్యతకు ప్రతీకే. ప్రస్తుతం ఏసియన్ దేశాల సంఘానికి సింగపూర్ ప్రధాని లీసియేన్ లూంగ్ అధ్యక్షత వహిస్తున్నారు. నగర దేశమైన సింగపూర్ సంస్కృత నామం సింహపురి భారత్ 1992 లో ఆసియన్ దేశాల చర్చల్లో భాగస్వామి అయి. 2005 నుండి తూర్పు ఆసియా దేశాల శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొంటూ, 20వ వార్షికోత్సవం సందర్భంగా 2012 లో వ్యూహాత్మక భాగస్వామిగా ఎదిగింది. భారత - ఏసియన్ స్వేచ్ఛా వాణిజ్య అవగాహనలో భాగంగా 1993లో కేవలం 29 బిలియన్‌లుగా వున్న వాణిజ్యం 2016 నాటికి 78 బిలియన్‌లకు పెరిగింది. సామాజిక -సాంస్కృతిక రంగంలో ఏసియన్ -భారత విద్యార్థుల మార్పిడి, ఢిల్లీలో వార్షిక చర్చల ద్వారా విద్యా, వాణిజ్య వేత్తలు, యువత మధ్య పరస్పర ప్రయోజనకరమైన సత్సంబంధాలు నెలకొన్నాయి. ఏషియన్ దేశాలతో వాణిజ్యం, అనుసంధానత, సాంస్కతిక సంబంధాల పెంపుదలకు భారత ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఏసియన్ సభ్యదేశాలు బర్మా, కాంబోడియా, వియత్నాం, సింగపూర్, లావోస్, ఫిలిప్పీన్స్, మలేసియా, థాయ్‌లాండ్, బ్రునై, ఇండోనేసియా. భారత్ ఏసియన్ దేశాలు 180 కోట్ల జనాభాతో ప్రపంచ జనాభాలో నాలుగో స్థానంలో ఉన్నాయి. ఈ దేశాల ఉమ్మడి జిడిపి 4.5 ట్రిలియన్ లకు పెరుగుతుందని అంచనా.

భారత్ 2025 కి ప్రపంచంలో 5వ పెద్ద వినియోగదార్ల మార్కెట్‌గా అవతరించనుంది. ఆగ్నేయాసియాలో మధ్యతరగతి కుటుంబాలు 16.3 కోట్లకు పెరగనున్నాయి. 2020 నాటికి భారత జనాభాలో సగటు వయస్సు 29 ఏళ్ళ లోపే. వచ్చే మూడేళ్ళలో నవయువ భారతం అవతరించనుండగా, అప్పటికి ఏసియన్ దేశాల జనాభాలో 60 శాతం 35 ఏళ్ళ లోపువారే. ఈ యువ శ్రామిక శక్తితో ఉభయులూ సమిష్టిగా శ్రమిస్తే వివిధ రంగాల్లో పరస్పర ప్రయోజనకరమైన అద్భుత ఫలితాలను సాధించడానికి ఎన్నో అవకాశాలున్నాయి. ఏషియన్ దేశాలతో భారత వాణిజ్యం 2016 నాటికి కేవలం 2.6 శాతమే. అందువల్ల ఆర్థిక - వాణిజ్య సంబంధాలను మరింత పెంపొందించుకోవడానికి, ప్రాంతీయ భాగస్వామ్య ఒప్పందాల ద్వారా ప్రయత్నాలు సాగిస్తే, ప్రపంచ జనాభాలో దాదాపు సగం, ఆసియా సమగ్ర మార్కెట్‌ను అభివృద్ధి చేసుకుని ప్రయోజనం పొందడానికి సమిష్టి ప్రయత్నాలు సాగించాలి. భూతల, గగనతల, సముద్ర రవాణా మార్గాలను ప్రజల రాకపోకలను మరింత పెంచే విధంగా అభివృద్ధి చేయడం అందరికీ ఉపయోగం. భారత్ - బర్మా, థాయ్‌లాండ్ రహదారి మార్గం అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు భారత్ 100 కోట్ల డాలర్ల సాయం అందించడం ప్రయోజనకరమే. రవాణా మార్గాల అభివృద్ధితో భారత్ ఏసియన్ దేశాలు కొత్త మార్కెట్‌లను అన్వేషించుకుని, వాణిజ్యం, పెట్టుబడులు, వినోద పర్యటనలను పెంచుకోవచ్చు. డిజిటల్ అనుసంధానంతో సత్ఫలితాలు పొందవచ్చు. భారత ప్రభుత్వం ఇటీవల 100 ఆకర్షణీయ నగరాల అభివృద్ధికి చర్యలు చేపట్టిన పూర్వరంగంలో సింగపూర్ తదితర దేశాలు సహకారంతో జీవించడానికి అనువైన పర్యావరణ రహిత నగరాలను నిర్మించుకోవచ్చు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి నగర నిర్మాణంలో అత్యాధునిక సౌకర్యాలను, పర్యావరణ ప్రమాదరహిత చర్యలనూ అమలు చేయొచ్చు.

ఆసియన్ దేశాల అనుభవాలను స్వీకరించి ఉగ్రవాద నిర్మూలనకై, యువతలో ఉన్మాద మతభావనలు - ద్వేషాలు రగిలించి వారిని ఉగ్రవాదులుగా మార్చే యత్నాల నిరోధానికి ప్రపంచ సమావేశాన్ని నిర్వహించాలని ప్రధాని నరేంద్రమోడీ తలపెట్టారు. ఉగ్రవాదానికి సరిహద్దులు, మతం లేదని, మానవాళికి తెలిసిందే.

ఆసియన్ దేశాలతో సామాజిక, విద్యాసంబంధాల వృద్ధికి భారత్ ఐఐటి లలో చదివేందుకై 1000 మంది ఆసియన్ విద్యార్థులు పిహెచ్‌డి చేసేందుకు ఫెలోషిప్‌లు ఇవ్వాలని భారత్ సంకల్పించడం హర్షణీయం. ప్రధాని నరేంద్రమోడీ, ఇండోనేసియా అధ్యక్షుడు జోకోవిదోదో, మలేసియా ప్రధాని నజీబ్ రజాక్, లావోస్ ప్రధాని డోంగ్లాన్ సిసోలిక్‌లతో రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు ఇతర ద్వైపాక్షిక అంశాలపై చర్చలు సత్ఫలితాల దిశగా జరిగాయి. పశ్చిమ దేశాల్లో దశాబ్ద కాలంగా ఆర్థిక మాంద్యం ఆవరించిన కారణంగా వస్తువులకు గిరాకీ తగ్గినందున భారత- ఆసియన్ దేశాలు తమ వస్తువుల కోసం కొత్త మార్కెట్‌లకై పరస్పర ప్రయోజనకరంగా వాణిజ్యాన్ని పెంపొందించుకోవడం అవసరమైంది. అదీగాక ఇటీవల అమెరికా- చైనా, అమెరికా-రష్యాల మధ్య ఆర్థిక, రాజకీయ, వాణిజ్య వైరాలు అధికమైనందున, ఆసియా -పసిఫిక్ ప్రాంతంలో ప్రాబల్య విస్తరణకు, ఆర్థిక - సైనిక పాటవాన్ని ప్రదర్శించే చైనా దూకుడును నిలువరించాలంటే, సముద్ర మార్గాల్లో నిరాటంకంగా ముఖ్యంగా దక్షిణ చైనా సముద్రంలో చైనా ప్రాబల్యాన్ని కట్టడి చేయాలంటే భారత్ - ఆసియన్ దేశాలు ఉమ్మడి వాణిని శక్తివంతంగా వినిపించాల్సి ఉంది. చైనా ఒకే బెల్ట్ -రోడ్ సంధాన ప్రతివాదన, పాక్ గదర్ రేవుకు ఆక్రమిత కాశ్మీర్ ద్వారా ఆర్థిక కారిడార్ ద్వారా ప్రాబల్య విస్తరణ - పాక్‌ను భారత్‌కు వ్యతిరేకంగా ఎగదోసే వ్యూహాలు పన్నుతున్నందున ఆగ్నేయాసియా దేశాలతో సహకారాన్ని, మైత్రిని భారత్ మరింత పెంపొందించుకోవలసిన అవసరం ఏర్పడింది.

భారత - ఏసియన్ వాణిజ్యం 2014 - 15 నాటికి కేవలం 76.53 బిలియన్‌లు కాగా ఏసియన్‌తో చైనా వాణిజ్యం విలువ 452 బిలియన్‌లు. ఏసియన్ దేశాల్లో 2016 నాటికి భారత పెట్టుబడులు కేవలం 224 మిలియన్‌లు కాగా చైనా పెట్టుబడులు 3 బిలియన్ డాలర్లు, థాయ్‌లాండ్ రాజధాని బాంకాక్- బర్మా రాజధాని రంగూన్- భారత రాజధాని ఢిల్లీ మధ్య రోడ్డు, రైలు మార్గాల నిర్మాణం పూర్తికావాలంటే అది బంగ్లాదేశ్ మీదుగానే జరగాలి. దక్షిణాసియా దేశాల నేతగా ఎదగాలనుకుంటున్న భారత్ - పాక్‌ను పక్కన బెట్టి బంగ్లా తదితర దేశాలతో సంబంధాలు పెంచుకుంటే అది ఉభయతారకం కాగలదు. ఐటి రంగంలో మేటిగా, ఔషధాలు, తక్కువ ధరకే ప్రాణాధార మందుల ఉత్పత్తిలో ప్రముఖ దేశంగా, క్రమశిక్షణ గల శ్రామిక శక్తి గల భారత్ ఆసియాలో ఇతర దేశాల్లో తన సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోలేక పోతున్నది చైనా - తూర్పు ఆసియా దేశాలకు మలక్కా జలసంధి ద్వారా ఆ 80 శాతం సరకుల రవాణా జరుగుతున్నందున ఇండోనేసియాతో కలసి హిందూ మహాసముద్ర రవాణా నుండి ప్రయోజనం పొందేందుకు భారత్ ప్రయత్నించాలి. భారత్ అమెరికాకు దగ్గరవుతోందనే దుగ్ధతో చైనా పాక్‌ను భారత వ్యతిరేక శక్తులను దువ్వడం కొనసాగిస్తూనే ఉంది. చైనాతో డొక్లాం, ఇతర సుదీర్ఘ సరిహద్దు వివాదాలున్నా పరస్పర ప్రయోజనకర రీతిలో ద్వైపాక్షిక సంబంధాల వృద్ధికి ప్రయత్నాలు సాగించాలి. చైనా తన చౌక ఉత్పత్తులను భారత్ పెద్ద మార్కెట్‌గా పరిగణిస్తున్నందున వాటిని ఏదో రూపంలో చేరవేస్తోంది. బర్మా అధినేత్రి అంగ్‌సాన్ సూకీ సహా 10 ఆసియన్ దేశాల అగ్రనాయకులు శిఖరాగ్ర సమావేశం, భారత గణతంత్ర దినోత్సవాలలో వారికి గౌరవ అతిథులుగా విశిష్ట ఆతిథ్యమిచ్చి సుహృద్భావాన్ని ప్రోది చేశారు. రానున్న కాలంలో ఆర్థిక, వాణిజ్య, సాంస్కృతిక, రాజకీయ సంబంధాలను ధృఢపరచుకునే ప్రయత్నాలను భారత్ - ఏసియన్ దేశాలు కొనసాగిస్తే అది ఉభయతారకం కాగలదు.

❑ పతకమూరు దామోదర్ ప్రసాద్
సీనియర్ జర్నలిస్ట్, 9440990381

అర్హులకే ప్రభుత్వ పథకాలు

● వక్ఫ్‌బోర్డు సమీక్షలో దానకిషోర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీల కోసం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు చేరేందుకు కృషి చేయాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం దానకిషోర్ కోరారు. బుధవారం సచివాలయంలో వక్ఫ్ బోర్డు పనితీరు, ప్రగతిపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకు సహాయం, ఇమాం, మౌజాంలకు అందిస్తున్న గౌరవ వేతనం, వక్ఫ్ భూముల సర్వే, వక్ఫ్ బోర్డు ఏర్పాటు, గ్రాంట్ ఇన్ ఎయిడ్‌పై చర్చించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలియజేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బోర్డు సీఈఓ ఇతర అధికారులు పాల్గొన్నారు.

శివాజీ జయంతినాడు 5కే రన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని ఈనెల 4న పీపుల్స్‌ప్లాజా వద్ద 5కే రన్ నిర్వహిస్తున్నట్లు శ్రీ ఛత్రపతి శివాజీ మరాఠ సాంస్కృతిక ట్రస్టు తెలిపింది. ఆ రన్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ట్రస్టు చైర్మన్ ఎల్ కే షిండే బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కన్వీనర్ దిలీప్‌కుమార్ జంగ్‌తాప్, తెలంగాణ మరాఠ మండల్ అధ్యక్షుడు ప్రకాశ్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా షిండే మాట్లాడుతూ, దేశ సమగ్రత, సమైక్యత, ట్రాఫిక్‌పై యువతకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో 5కే రన్ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాచకొండ పోలీస్ కమిషర్ మహేష్ ఎం.భగవత్ ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే అర్జున్ అవార్డుగ్రహీతలు జేజే శోభ, నీతాడద్వే, అంతర్జాతీయ గోల్ఫ్ క్రీడాకారుడు అజయ్ భారతిలు పాల్గొంటారని తెలిపారు. 5కే రన్‌లో సుమారు 500 మంది యువతీ యువకులు పాల్గొంటారని వివరించారు.

రాజకీయాలపై అవగాహన పెంచుకోండి

● టీడీపీ శిక్షణ శిబిరంలో ఎల్. రమణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తాజా రాజకీయాలను అవగాహన చేసుకుంటూ రాజకీయాల్లో నిరంతర విద్యార్థులుగా పార్టీ శ్రేణులు కార్యోన్ముఖులు కావాలని తెలుగుదేశంపార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ పిలుపునిచ్చారు. పేదలకు ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించి సామాజిక న్యాయాన్ని అందించిందని ఆయన చెప్పారు. తెదేపా ఐదవ బ్యాంచు శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆయన ప్రసంగించారు. ఈ శిక్షణా తరగతుల్లో పదివేల మంది శ్రేణులు శిక్షణ పొంది తమ రాజకీయ భవిష్యత్తును పెంచుకునే అవకాశం కలుగుతుందని ఆయన అన్నారు. జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇ.పెద్దిరెడ్డి, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్ రమావత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లం మల్లయ్య యాదవ్ కూడా మాట్లాడారు.

పోలవరం భూసేకరణపై ప్రతిపాదనలు రాలేదు: గడ్కరీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం జరిపే భూ సేకరణ, పరిహారం, పునరావాసానికి సంబంధించి తమకు ఎటువంటి ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందలేదని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. బుధవారం తనను కలిసిన ఆంధ్రా నేతలతో ఆయన ఈ విషయం చెప్పారు. ఉత్తరాంధ్ర చర్చావేదిక పేరిట మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, అరకు ఎంపీ కొత్తపల్లి గీత సహా ఉత్తరాంధ్రకు చెందిన వివిధ ప్రజా సంఘాల నేతలు ఢిల్లీలో గడ్కరీని ఆయన నివాసంలో కలిశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం అయ్యే పూర్తి ఖర్చును కేంద్రమే భరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తూ పునరావాసం కల్పించాలని కోరారు. నేతల విజ్ఞప్తిపై వెంటనేస్పందిస్తూ, ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ ఏడాది చివరినాటికల్లా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. భూ సేకరణపై స్పందిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ విషయంపై తమకు ఇంతవరకు ఎటువంటి నివేదికగానీ, ప్రతిపాదనగానీ అందలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వచ్చిన తర్వాత తాము కేంద్ర కేబినెట్ ముందుకు ఈ విషయాన్ని తీసుకెళ్తామని, అక్కడ చర్చించిన తర్వాతనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కేంద్ర కేబినెట్ నిర్ణయం సానుకూలంగానే ఉంటుందని గడ్కరీ భరోసా ఇచ్చారు.

శ్రీనివాస్ కేసు సీబీఐకి

● హైకోర్టులో మున్సిపల్ చైర్మన్ లక్ష్మి పిటిషన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసులో మూడు వారాల్లో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు నల్గొండ ఎస్పీని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవి శేష సాయి బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేశారు. తన భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్(45) హత్య కేసు దర్యాప్తును సీబీఐకి లేదా ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) అప్పగించాలని కోరుతూ నల్గొండ మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి హైకోర్టులో లంచ్ మోషన్ రూపంలో అత్యవసర వ్యాజ్యాన్ని బుధవారం దాఖలు చేశారు. తన భర్త హత్య కేసుకు సంబంధించి అరెస్ట్ చేసిన నిందితుల కాల్ డేటాను తనకు ఇప్పించేలా పోలీసులను ఆదేశించాలని ఆమె అభ్యర్థించారు. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది సి.దామోదర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. మృతుడు కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. శ్రీనివాస్‌ను టీఆర్ఎస్‌లో చేరాలంటూ నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం ఒత్తిడి చేసేవారన్నారు. ఈ హత్య వెనుక ఎమ్మెల్యే వీరేశం పాత్ర ఉందని, ఆయన ప్రోద్బలంతోనే హత్య జరిగినట్లు పిటిషనర్‌కు అనుమానం ఉందన్నారు.

వ్యక్తిని హత్య చేసిన రౌడీషీటర్

హైదరాబాద్/గోషామహల్, ఆంధ్రప్రభ: తాగిన మైకంలో ఓ రౌడీషీటర్ తన అనుచరులతో కలిసి ఓ కారు మెకానిక్‌పై కత్తులతో దాడి చేసి హత్య చేసిన సంఘటన హుమాయిన్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఈ దాడిలో మరో వ్యక్తి గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సయ్యద్ నగర్‌లో నివసించే సయ్యద్ షర్ఫుద్దీన్(36) కారు మెకానిక్. బుధవారం మధ్యాహ్నం ఇతని వద్దకు గోల్కొండ రౌడీషీటర్ అర్షద్ అనుచరులతో కలిసి వచ్చి గొడవకు దిగి అతని సోదరుడు రషీద్‌ను గాయపరిచి వెళ్లిపోయాడు. దీనిపై సయ్యద్ షర్ఫుద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అర్షద్ రౌడీ షీటర్ ఫిర్దోస్‌తో కలిసి వచ్చి కత్తులతో సయ్యద్ షర్ఫుద్దీన్, అడ్డుగా వచ్చిన హరూన్‌పై కత్తులతో దాడి చేశాడు. వీరిద్దరిని ఆసుపత్రికి తరలించగా సయ్యద్ షర్ఫుద్దీన్ చనిపోయినట్లు డాక్టర్లు తెలిపారు.

స్రామాట్‌కు షరతులతో బెయిల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సినీ నటుడు స్రామాట్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. భార్య హర్షితారెడ్డి మోపిన దొంగతనం కేసులో అరెస్టయిన స్రామాట్‌రెడ్డిపై మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి విదితమే. ఈ విషయంపై బుధవారం మియాపూర్‌లోని 25వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి వరూధిని కండిషన్ బెయిల్ మంజూరు చేశారు.

అనుమతులిచ్చాం... ఇక మాకు సంబంధం లేదు


● డ్రగ్స్ అధికారుల వింత పోకడ ● కొరవడిన నిఘా ● డానో వాక్సిన్ బాటలో మరిన్ని కంపెనీలు ● స్థానిక అధికారుల అండతో సాగుతున్న తంతు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అనుమతులు ఇచ్చాం..తరువాత ఏం జరిగినా మాకే సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు డ్రగ్ కంట్రోల్ అధికారులు. 30 సంవత్సరాలుగా టెటనస్ (టీటీ వ్యాక్సిన్లను) తయారు చేస్తున్న డానో సంస్థపై నిఘా కొరవడడంతోనే చెత్తలో పారేయాల్సిన వ్యాక్సిన్లకు కొత్త లేబుల్ అంటించి అమ్ముతూ తన వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగించాడు డైరెక్టర్ వేణుగోపాల్ రాజు. ఘట్‌కేసర్‌లో డానో వ్యాక్సిన్ అండ్ బయోలాజికల్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో టెటనస్ వ్యాక్సిన్లను తయారుచేస్తూ అందరిని నమ్మించాడు. నమ్మకంగా వ్యాపారం నిర్వహిస్తూ ఈ నకిలీ దందాకు తెరలేపినట్టు తెలుస్తోంది. దీనికి కొందరు ఉన్నతాధికారుల ప్రోద్బలంతో స్థానిక అధికారులు ఆయనకు సహకరించినట్టు పలువురు ఆరోపిస్తున్నారు. లైసెన్స్ ఇచ్చినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తనిఖీ చేసి దీనికి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. గర్భిణులకు పాటు ధనుర్వాతం రాకుండాను, ఎవరికైనా గాయాలైన సందర్భంలో ఈ వ్యాక్సిన్‌ను వాడుతుంటారు. దీంతోపాటు 10 నుంచి 15 సంవత్సరాల చిన్నారులకు టీటీ వ్యాక్సిన్లను వాడాల్సి ఉంటుంది. పెద్దలయితే ప్రతి మూడు సంవత్సరాలకోసారి ఈ టీకా తీయించుకోవాలి లేదా దెబ్బతగిలినప్పుడు కచ్చితంగా దీనిని తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతి డాక్టర్ కూడా టీటీనే క్షతగ్రాతులకు వేయించుకోవాలని సూచిస్తారు.

పలు షాపులకు సరఫరా.. చాలామందికి రియాక్షన్

చెత్తలో పడేయాల్సిన టెటనస్ వ్యాక్సిన్లను రీసైక్లింగ్ చేస్తూ కొత్తగా తయారు చేసిన వాటితో పాటు పలు షాపులకు వేణుగోపాల్ రాజు సరఫరా చేసినట్టు కొందరు మెడికల్ షాపుల వారు పేర్కొంటున్నారు. ఈ టీకా తీసుకున్న చాలామందికి రియాక్షన్ అయినట్టు కూడా తెలుస్తోంది. కానీ అధికారులు మాత్రం అవన్నీ అభూతకల్పనలంటూ కొట్టిపారేస్తున్నారు. పోలీసులు సమాచారం ఇచ్చేంత వరకు డ్రగ్ కంట్రోలర్ అధికారులకు ఈ విషయం తెలియదని పలువురు ఆరోపిస్తున్నారు. కొందరిచ్చిన సమాచారంతోనే పోలీసులతో కలిసి డ్రగ్ కంట్రోలర్ అధికారులు దాడులు నిర్వహించినట్టు తెలిసింది. వేణుగోపాల్ రాజు ఇక్కడ తయారు చేసిన మందులను బయటకు సరఫరా చేయలేదని మొదటిసారే తాము పట్టుకున్నామని డ్రగ్ కంట్రోలర్ అధికారులు పేర్కొంటుండగా, అధికారులు చెప్పిన దానికి అక్కడ జరిగిన దానికి పొంతన లేకుండా ఉంది. చాలా సంవత్సరాలుగా ఇతను లేబుళ్ల పేరుతో ప్రింటింగ్ ప్రెస్‌ను ప్రారంభించి ఇక్కడే నాసిరకం దందాకు తెరలేపినట్టు తెలుస్తోంది. ఇవన్నీ తెలిసీ కూడా స్థానిక డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కేసును డ్రగ్ కంట్రోలర్‌కు...



మొదటగా తయారీదారుడిని పట్టుకున్నప్పుడు మాత్రమే మా టీం వెళ్లింది. తదనంతరం ఆ కేసును డ్రగ్ కంట్రోలర్ అధికారులకు అప్పగించాం. ప్రస్తుతం వారే ఆ కేసును దర్యాప్తు చేస్తున్నారు. నకిలీ మందుల తయారీ, ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే నకిలీ తయారీదారుల గురించి ఎవరైనా తమకు సమాచారం ఇస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకుంటాం.

హైదరాబాద్ సీపీ శ్రీనివాసరావు

పథకానికి వ్యూహం

డానో వ్యాక్సిన్ అండ్ బయోలాజికల్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో ఘట్‌కేసర్‌లో ఏర్పాటు చేయడానికి 30 సంవత్సరాల క్రితం వేణుగోపాల్ రాజు పర్మిషన్ తీసుకున్నాడు. అతను ఈ కంపెనీ డైరెక్టర్. దీంతోపాటు వేణుగోపాల్ రాజు అంబర్‌పేటలో మరో అద్దె ఇంటిలో ప్రింటింగ్ ప్రెస్‌ను ఏర్పాటు చేశారు. దానికి ఏఆర్ఎస్ ప్యాకేజీ అంటూ ఓ బోర్డు పెట్టారు. ఇక్కడే తన పథకానికి వ్యూహం రచించాడు. ఘట్‌కేసర్‌లోని తన కంపెనీలో తయారయ్యేటప్పుడు కొన్ని సరిగ్గా ప్యాకింగ్ కాకపోవడంతో వాటిని పక్కకు పారేస్తారు. వాటిని కూడా వేస్ట్ చేయవద్దని అతని ఆలోచనతోనే అంబర్‌పేటలో ప్రారంభించిన ప్రింటింగ్ ప్రెస్‌కు తరలించి అక్కడ వాటికి కొత్త లేబుళ్లతో పాటు కొత్త ప్యాకింగ్ చేసి మళ్లీ వాటిని ఘట్‌కేసర్‌లోని డానో వ్యాక్సిన్ అండ్ బయోలాజికల్ ప్రైవేటు లిమిటెడ్‌కు తరలిస్తున్నాడు. ఎవ్వరికి అనుమానం రాకుండా కంపెనీలో అప్పుడే తయారు చేసినట్టు స్టిక్కరింగ్, ప్యాకింగ్ చేసి గోడౌన్‌కు తరలించి అనంతరం కొత్త సరుకుతో కలిపి మార్కెట్లో అమ్ముతున్నాడు. సాధారణంగా టీటీ వ్యాక్సిన్లను 2-8 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉంచాలి. కానీ ప్రింటింగ్ ప్రెస్‌లో సాధారణ ఉష్ణోగ్రత మధ్యనే వాటి మూతలను తెరిచి వేరే బాటిళ్లలోకి మారుస్తున్నారు. ఇక్కడ రీఫ్యాకింగ్ చేసిన మందును ఘట్‌కేసర్‌లోని కంపెనీకి తరలించి అక్కడి నుంచి తిరిగి డీలర్లకు సరఫరా చేస్తున్నాడు. పలువురు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో రూ.10 లక్షల విలువైన (64 వేల విలువైన) వ్యాక్సిన్లను కంపెనీకి చెందిన లేబుళ్లను స్వాధీనం చేసుకున్నారు. డానో కంపెనీ డైరెక్టర్ వేణుగోపాల రాజుపై డ్రగ్ అండ్ కాస్మోటిక్స్ చట్టాల కింద కేసు నమోదు చేశారు.

నాసిరకం టీకా వాడితే అంతే
డాక్టర్ శ్రీనివాస్ కళ్యాణి, నిలోఫర్ ఆస్పత్రి


నాసిరకం టీకాను వాడినప్పుడు రియాక్షన్‌తో పాటు, ఇన్‌ఫెక్షన్‌లు కూడా రావచ్చు. దానిని తయారు చేసేటప్పుడు ఉష్ణోగ్రతలు సమస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. దీనిని 2నుంచి 8 డిగ్రీల్లో ఉంచాలి.

రిజెక్ట్ అయిన సరుకు ఇక్కడ దొరికింది
డ్రగ్ కంట్రోలర్, ఏడీ బాలనాగన్

నార్త్‌జోన్ పోలీసుల సమాచారం మేరకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల టీంను అంబర్‌పేట ప్రింటింగ్ ప్రెస్‌కు వెళ్లారు. ఆ సమయంలో టెటనస్ వ్యాక్సిన్లు అక్కడ బయటపడ్డాయి. వాటిని పరిశీలించినప్పుడు వ్యాక్సిన్ల మూతలు సరిగా లేవు. అలాంటి వాటిని చెత్తలో పారేయాల్సి ఉన్నా వీటిని ఇక్కడకు తరలించడం వలన వారిపై కేసు నమోదు చేశాం. కంపెనీలో రిజెక్టు చేసిన వాటిని ఇక్కడకు తరలించినట్టు ప్రొపయిటర్ ఆ యజమాని పేర్కొన్నారు.

త్వరలోనే వివరాలు వెల్లడిస్తా

కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం కలిపి దీనికి అనుమతి ఇస్తాం. రాష్ట్రవ్యాప్తంగా నాలుగైదు కంపెనీలు ఈ టీటీ వ్యాక్సిన్లను సరఫరా చేస్తాయి. మంగళవారం జరిగిన సంఘటనకు సంబంధించి కోర్టుకు ఆధారాలు సమర్పించాం. అంబర్‌పేట్లో దొరికిన వాటిని సీజ్ చేశాం. బుధవారం ఘట్‌కేసర్‌లోని డానో వ్యాక్సిన్ అండ్ బయోలాజికల్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో కేంద్ర, రాష్ట్ర అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. త్వరలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడిస్తాం. డ్రగ్ కంట్రోలర్ అధికారుల, సిబ్బంది హస్తం ఉందన్న ఆరోపణల్లో నిజం లేదు. గతంలోనూ నాసిరకంవి అమ్మినట్టు మాకు ఎలాంటి ఆధారాలు లభించలేదు.



డ్రగ్ కంట్రోలర్ డీడీ, కైలాసం

24నుంచి టీఆర్‌టీ పరీక్షలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీ కోసం నిర్వహించనున్న ఉపాధ్యాయ నియామక పరీక్షల తేదిలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. ఫిబ్రవరి 24 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. టిఎస్‌పిఎస్సీ టిఆర్‌టి షెడ్యూల్‌ను విడుదల చేయడంతో పరీక్షల నిర్వహణపై ఉన్న నీలి నీడలు తొలగిపోయాయి. పరీక్షల కోసం సిద్ధం అవుతున్న అభ్యర్థుల్లో ఉన్న గందరగోళం తొలగిపోయి ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధం కానున్నారు. పరీక్షలు వాయిదా పడ తాయని, కొన్ని కోచింగ్ సెంటర్లు చేస్తూ వచ్చిన ప్రచారానికి బుధవారం టిఎస్‌పిఎస్సీ జారీ చేసిన షెడ్యూల్‌తో ఫుల్‌స్టాప్ పడింది. టిఆర్‌టి పరీక్షలను ఫిబ్రవరి 24 నుంచి మార్చి 4 వరకు నిర్వహించ నున్నట్టు కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించారు. సెకండరీగ్రేడ్ టీచర్ పరీక్షలను హెచ్ఎండీఏ పరిధిలో నిర్వహి స్తుండగా స్కూల్ అసిస్టెంట్ పరీక్షల్లో ఎక్కువ భాగం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. పరీక్షలను ఉదయం, మధ్యాహ్నం రెండు పూటల నిర్వహించనున్నారు. కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ పరీక్షలను ఎక్కువ శాతం నిర్వహిస్తున్నారు. ఎస్‌జిటి పరీక్షలను మాత్రం ఓఎంఆర్‌తో నిర్వహిస్తున్నారు.

విద్యార్థుల యూనిఫామ్ ధరలు పెంపు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న యూనిఫామ్ బట్టల కోసం ఇచ్చే ధరలను కేంద్రం పెంచనుంది. ఇప్పటి వరకు రూ. 400 చెల్లిస్తున్న కేంద్రం ఇకపై రూ. 600 చెల్లించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి రెండు రోజుల క్రితం జరిగిన ఎస్ఎస్ఏ, ఆర్ఎంఎస్ఏ అధికారుల సమావేశంలో కేంద్రం స్పష్టం చేసింది. వీటితోపాటు సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ), రాష్ట్రీయ్ మాధ్యమిక శిక్షా అభియాన్(ఆర్ఎంఎస్ఏ)ల విలీన ప్రక్రియపై కూడా చర్చ జరిగింది. రెండు సంస్థలను విలీనం చేయడంపై అధికారులు ఏకాభిప్రాయం చెప్పడంతో కేంద్రం కూడా అందుకు అంగీకరించింది. ఈ ప్రక్రియ ముగియడానికి కనీసం ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఇకపై రెండు కూడా సర్వశిక్షఅభియాన్‌లోనే కొనసాగే అవకాశం ఉంది. వచ్చే విద్యాసంవత్సరం మధ్యలో ఈ ప్రక్రియ పూర్తి కానుంది. 2019-20 నుంచి పూర్తిస్థాయిలో రెండు సంస్థల విలీనం ప్రక్రియ అమలులోకి రానుంది.

ప్రస్తుతం 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఎస్ఎస్ఏ, 9, 10 తరగతులకు సంబంధించి ఆర్ఎంఎస్ఏ పరిధిలో ఉన్నాయి. రెండు సంస్థలు విలీనం అయితే మొత్తం ఒకటే సంస్థ కిందకు రానుంది. అప్పుడు మొత్తం పాఠశాల విద్య మొత్తం ఒకటే సంస్థ పరిధిలో ఉండనుంది. ప్రభుత్వ పాఠశాలలకు కేంద్రం ఇచ్చే గ్రాంట్లను కూడా పెంచాలని అధికారులు సూచించగా వాటి పెంపును కూడా కేంద్రం అంగీకరించింది. అయితే ఆయా పాఠశాలలను బట్టి గ్రాంట్లను ఇవ్వాలని కేంద్రం ఆలోచిస్తోంది. అదేవిధంగా కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు ప్రస్తుం 10వ తరగతి వరకు కొనసాగుతున్నాయి. వాటిని ఇంటర్మీడియట్ వరకు కొనసాగించాలని తెలంగాణ రాష్ట్రం కేంద్రాన్ని కోరింది. అయితే దీనిపై వెంటనే నిర్ణయం చెప్పకపోయినా పరిశీలిస్తామని కేంద్రఅధికారులు చెప్పినట్టు సమాచారం.

రేపు ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్కూల్స్‌కు సెలవు

మేడారంలో జరుగుతున్న సమ్మక సారలమ్మ జాతీర నేపథ్యంలో ఫిబ్రవరి 2న ఉమ్మడి వరగంలో జిల్లా పరిధిలోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. మార్చి 10 రెండో శనివారం పనిదినంగా నిర్ణయించినట్టు పాఠశాల విద్యా శాఖ తెలిపింది. ఫిబ్రవరి 2న వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, మహబూబాబాద్, ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి, జనగామ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్టు తెలిపారు.

కంటి చూపుతో రేషన్

● వేలిముద్రల సేకరణకు స్వస్తి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కంటి చూపుతో రేషన్ సరకులు అందించేందుకు పౌరసరఫరాల సంస్థ చర్యలు తీసుకుంటుంది. వేలిముద్రలు సేకరించడంలో ఉత్పన్నమవుతున్న సమస్యను అధిగమించడానికి ఐరిష్ విధానం ఉత్తమం అని భావించింది. ఈ మేరకు చర్యలు చేపట్టింది. ఆధార్‌లో పేరు నమోదు చేసుకొనే సమయంలోనే బయోమెట్రిక్ విధానంలో వేలిముద్రలు, ఐరిష్ పద్దతిలో కంటి రెప్పల గుర్తులను భద్రపరుస్తారు. ఆధార్ ఆధారంగా సంబంధిత వ్యక్తి నిర్ధారణకు ఈ రెండు పద్దతులను పాటిస్తారు. చౌక ధరల దుకాణాల స్థాయిలో ఈ-పోస్ అమలులోకి వచ్చిన తర్వాత పౌరసరఫరాల సంస్థ ఆధార్‌తో అనుసంధానమైంది. లబ్దిదారుల వేలిముద్రలను బయోమెట్రిక్ విధానంలో సేకరించడం ద్వారా సరకులు ఇస్తున్నారు. ఆధార్ కోసం వేలిముద్రలు తీసుకొని చాలా రోజులు కావడం, ఈ మధ్యలో మహిళల వేలిముద్రలు అరిగిపోవడంతో బయోమెట్రిక్‌లో నమోదు కావడం లేదు. ఈ - పోస్ యంత్రం వేలిముద్రలు గుర్తించని లబ్దిదారులకు సరకులను ఇవ్వడం సాధ్యం కాదని రేషన్ డీలర్లు తేల్చి చెప్పడంతో సమస్య తీవ్రతరమైంది. అత్యధికులైన లబ్దిదారులు సరకులు తీసుకోలేని పరిస్దితి గ్రామాల్లో నెలకొంది. పట్టణాలు, నగరాల్లో కూడా ఈ పరిస్దితి ఏర్పడింది. సమస్య తీవ్రతను గుర్తించిన పౌరసరఫరాల కమిషన్ సి.వి. ఆనంద్ ప్రత్యామ్నాయాలపై దృష్టి కేంద్రీకరించారు. వేలిముద్రలు అరిగిపోయిన వారిని ఐరిష్ పద్దతిలో కంటి చూపుతో గుర్తించి రేషన్ సరుకులు ఇవ్వడానికి అవకాశం ఉందని నిపుణులు చేసిన సూచన మేరకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పెద్ద ఎత్తున ఐరిష్ యంత్రాలను కొనుగోలు చేయడానికి సిద్దమయ్యారు.తెలంగాణలో సుమారు 7,200లకు పైగా రేషన్ షాపులు ఉన్నాయి. కోటి మందికి పైగా లబ్దిదారులు ఉన్నారు. వారందరికి సకాలంలో సరుకులు ఇవ్వాలనే ఆలోచనతోనే సత్వర చర్యలు తీసుకుంటున్నారు. రేషన్ అక్రమాలను అరికట్టడానికి ఇప్పటికే పౌరసరఫరాల సంస్థ అనేక చర్యలు తీసుకుంది. డీలర్లపై నిఘాను కట్టుదిట్టం చేసింది.


రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న డీలర్లు

తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకు లబ్దిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేయలేదు. తమకు కేటాయించిన నెంబర్ ఆధారంగానే లబ్దిదారులు రేషన్ తీసుకుంటున్నారు. కార్డులు జారీ చేయడానికి అనేక అవరోధాలు ఎదురవుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ పరిస్దితిని అధిగమించడానికి కొంత మంది రేషన్ డీలర్లు సొంతంగా రేషన్ కార్డులను, రేషన్ పుస్తకాలను ముద్రించి లబ్దిదారులకు అందచేస్తున్నారు. ఒకొక్క కార్డుకు రూ. 25లకు తక్కువ కాకుండా వసూలు చేస్తున్నారు. వినియోగదారుల వివరాలను అందులో పొందుపరుస్తుండటంతో అత్యధికులు డీలర్ వద్ద ముద్రితమైన కార్డులను కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది డీలర్లు బలవంతంగా అంటగడుతున్నారు. హైదరాబాద్‌లోని అనేక రేషన్ షాపుల స్థాయిలో డీలర్ల వద్ద కొనుగోలు చేసిన కార్డులు దర్శనమిస్తున్నాయి. సమగ్ర వివరాలు కార్డులో ఉండటంతో కొనుగోలు చేస్తున్నామని, ప్రతి నెల తాము కొనుగోలు చేసిన సరుకుల వివరాలను కూడా కార్డులో ఎప్పటికప్పుడు పొందుపరుస్తున్నారని లబ్దిదారులు తెలిపారు.

హామీలు ఆకాశంలో...అమలు పాతాళంలో: టీడీపీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గత ఎన్నికల్లో తెరాస ఇచ్చిన హామీలు ఆకాశంలో ఉంటే వాటి అమలు పాతాళంలో ఉందని, పొగడ్తలు, కీర్తనలతో ప్రభుత్వ పెద్దలు కాలయాపన చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి దుయ్యబట్టారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో చిత్తశుద్ధి లేదని, సీఎం ప్రగతి భవన్ వీడి బయటకు రారని, మంత్రులకు అధికారాలు లేవని బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అన్నారు. ఆపరేషన్ ఆకర్షను అమలు చేసేందుకు ఫిరాయింపు పోర్టుపోలియోను మాత్రం మంత్రులు అమలు చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. 24 గంటలపాటు విద్యుత్ ఇస్తున్నామని ప్రకటించుకున్న ప్రభుత్వంలోనే మంత్రులు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. విద్యుత్ సంస్థలకు ఇవ్వాల్సిన రూ.15వేల కోట్ల బకాయిలు చెల్లించి ఆ సంస్థను బతికించాలని, విద్యుత్ పరిస్థితిపై శ్వేతపత్రం ప్రకటించాలని రావుల డిమాండ్ చేశారు.

గల్ఫ్ బాధితులను ఆదుకోండి



హైదరాబాద్,ఆంధ్రప్రభ : గల్ఫ్ బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజ్ శ్రావణ్‌కుమార్ అన్నారు. ఎన్నారై పాలసీని అమలు చేయడంలో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తున్నదో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గల్ఫ్ కార్మికుల సమస్యల కోసం ప్రభుత్వం టోల్ ఫ్రి నెంబర్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కువైట్ దేశంలో తెలంగాణకు చెందిన దాదాపు 50 వేల మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన వివరించారు. ఆ దేశంలోని అంబాసిడర్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారని శ్రావణ్ తెలిపారు. స్వంత దేశం వచ్చేందుకు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారని ఆయన పేర్కన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే కువైట్‌కు ఒక ప్రతినిధి బృందాన్ని పంపించాలని ఆయన డిమాండ్ చేశారు.

అభివృద్ధి కనబడడం లేదా?

● విపక్షాలపై టీఆర్ఎస్ నేత గట్టు ధ్వజం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైతు ఆత్మహత్యలపై కొత్త ఉద్యమం చేస్తానని కోదండరాం చెప్పడం విచిత్రంగా ఉందని, అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణ ప్రభుత్వం దూసుకు వెళుతున్నా విపక్షాలు నెగిటివ్ రాజకీయాలు చేస్తున్నాయని టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గట్టు రామచందర్ రావు విమర్శించారు.

బుధవారం తెలంగాణభవన్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెగిటివ్ రాజకీయాలు చేసిన ఏ పార్టీ ఉనికిలో లేదన్నారు. మౌళికరంగాల్లో అభివృద్ధి సాధించడం ద్వారానే తెలంగాణ ప్రజల తలసరి ఆదాయం పెరిగిందన్నారు.

విమర్శించడమే వారి వృత్తి: టిఆర్ఎస్‌వి నేత గెల్లు

రాష్ట్రంలో ప్రతిపక్షాలు విమర్శించడమే వృత్తిగా పనిచేస్తున్నాయని టిఆర్ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాసయాదవ్ విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో తెలంగాణ వనరులను, పెట్టుబడి పెట్టే పరిస్థితులను విదేశీ ప్రతినిధుల ముందు వినిపించి, పెట్టుబడులు ఆకర్షించిన ఘనత కెటిఆర్‌దన్నారు.

నిధులివ్వడం లేదంటూ దుష్ప్రచారం: బీజేపీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రాభివృద్ధికి కేంద్రం నిధులు ఇవ్వడం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని బిజెపి మండిపడింది. ఇచ్చిన నిధులకు లెక్కలు చెప్పకుండా, కేంద్ర పథకాలకు రాష్ట్రం గ్రాంట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్న టిఆర్ఎస్ ప్రభుత్వం వెంటనే ఆపాలని పార్టీ అధికార ప్రతినిధి ఎ. రాకేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. గడచిన రెండు మూడు రోజులుగా ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్, పార్లమెంటరీ పార్టీ నేత ఎపి జితేందర్‌రెడ్డి తదితరులు కేంద్రం నిధులివ్వడం లేదంటూ మాట్లాడుతూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2017 - 18 సంవత్సరానికి గానూ కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి మొత్తం రూ. 21,631 కోట్లను కేటాయించగా డిసెంబర్ నాటికల్లా రూ. 19,601 కోట్లను విడుదల చేయడం జరిగిందన్నారు. వీటికి అధనంగా కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు సంబంధించి ఇప్పటి వరకు రాష్ట్రానికి రూ. 9 వేల కోట్లను విడుదల చేయడం జరిగిందని గణాంకాలను తెలియజేశారు.

పలువురు ఐఏఎస్‌లకు ఇన్‌చార్జి బాధ్యతలు

● సీఎస్‌కే ఇరిగేషన్ బాధ్యత


హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ పదవీ విరమణ తర్వాత బుధవారం రాష్ట్రప్రభుత్వం పలువురు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలను కట్టబెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు సీఎస్‌వద్ద అదనపు బాధ్యతగా ఉన్న కీలకమైన భూ పరిపాలనా శాఖ ప్రధాన కమిషనర్ విధులను రెవెన్యూ స్పెషల్ సీఎస్ రాజేశ్వర్ తివారికి ఇంచార్జిగా కట్టబెట్టారు. అదేవిధంగా నూతనంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన శైలేంద్రకుమార్ జోషికి అదనంగా ఇరిగేషన్ శాఖ స్పెషల్ సీఎస్‌గా ఇంచార్జి బాధ్యతలను అప్పగించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ది శాఖ కార్యదర్శిగా ముఖ్యమంత్రి సెక్రటరీ స్మితా సబర్వాల్‌కు ఇంచార్జి బాధ్యతలను అదనంగా అప్పగించారు.

స్టార్ ఆస్పత్రిలో అరుదైన గుండె చికిత్స

హైదరాబాద్, ఆంధ్రప్రభ : స్టార్ హాస్పిటల్‌లో కార్డియో తొరాసిక్ టీం టైప్ ఎఆర్టిక్షన్ అనే అరుదైన గుండె స్థితితో బాధపడుతున్న ఖమ్మంకు చెందిన 38ఏళ్ళ రోగికి డాక్టర్ గోపిచంద్ మన్నం, డాక్టర్ కెవిఎస్ సాయికిరణ్, డాక్టర్ పిసి గుప్తా బృందం చికిత్స చేసింది. స్టార్ హాస్పిటల్ బృందం క్లిష్టమైన సర్జరీని ఎంతో శ్రమించి విజయవంతం చేసినట్లు బుధవారం తెలిపారు. ఈ అరుదైన రోగ స్థితి అత్యంత ప్రమాదకరమైనదని, రోగి యొక్క వాల్వ్‌నే బాగుచేసి చికిత్సను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు.

మేడారం జాతరపై మావోయిస్టుల కన్ను

● నిఘా వర్గాల హెచ్చరిక



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ కుంభమేళగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతరపై మావోయిస్టులు కన్నేశారా? అదను చూసి ఉనికిని ప్రదర్శించేందుకు సన్నద్ధమయ్యారా? ప్రస్తుతం పోలీసు శాఖలో ఈ అంశంపై చర్చ జరుగుతోంది. మేడారం జాతరకు కోటి మందికిపైగా భక్తులు తరలి వస్తారన్న ఉద్దేశ్యంతో పోలీసులు అత్యంత పకడ్బంధీ ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవార్ల గద్దెలకు దాదాపు 25 కిలోమీటర్ల నుంచే పోలీసుల పహారా మొదలైంది. జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి భక్తులతో పాటు పలువురు వివిఐపిలు, ప్రముఖులు రానున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేసున్నారు. జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు ఎక్కడా ఎలాంటి పొరపొచ్చాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఏర్పాట్లలో పోలీసులు నిమగ్నమైన నేపథ్యంలో మావోయిస్టులు కూడా తమ ఉనికి కోసం ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారన్న సమాచారంతో అధికారులు ఉలిక్కి పడుతున్నారు. జాతరకు వచ్చిపోయే వారి భద్రతలో పోలీసులు నిమగ్నమైన తరుణంలో తమ టార్గెట్‌లను పూర్తి చేసుకోవాలన్న పథకంతో మావోయిస్టులున్నారని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని నిఘా వర్గాలు రాష్ట్ర పోలీసు శాఖను హెచ్చరించడంతో జిల్లాలలోని పోలీసులతో పాటు రాష్ట్రస్థాయి అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. జాతరకు ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడుతో పాటు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు, ఛత్తీస్‌ఘడ్ సిఎం రమణ్‌సింగ్, పలువురు కేంద్ర మంత్రులు హాజరవుతున్నారు. ఇప్పటికే మేడారంకు వెళ్ళే రహదా రులన్నీ ట్రాఫిక్‌తో కిటకిటలాడుతున్నాయి. అనేక వాహనాలు రహదారులలోనే చిక్కుకు పోవడంతో వాటిని క్లియర్ చేసేందుకు పోలీసులు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ అంశాలన్నింటినీ ఆసరాగా తీసుకుని మావోయిస్టులు ఏదైన దుష్చర్యకు పాల్పడితే పరిస్థితి ఏంటన్న ఆందోళన వ్యక్తమవుతోంది. నిఘావర్గాల సమా చారంపై బుధవారం మేడారం వెళ్ళిన డిజిపి ఎం. మహేందర్ రెడ్డి అక్కడి అధికారులకు కొన్ని సూచనలు చేసినట్లు సమా చారం. అదే విధంగా ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులతో పాటు వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలలో అదనపు గ్రేహౌండ్స్ దళాలను కూడా రంగంలోకి దించారు. అనుమానితులపై నిఘాను పెంచిన అధికారులు జాతరలోనూ నిఘాను తీవ్రం చేశారు. అవసరమైతే మరిన్ని అదనపు బలగాలను రప్పించుకునేందుకు డిజిపి అనుమతించారు. రహదారులలో నిఘాను పెంచడంతో పాటు బాంబు స్క్వాడ్ బృందాలు, పోలీసు జాగిలాల బృందాలను కూడా అప్రమత్తం చేశారు. ఏ ఉపద్రవంఎదురైనా సమర్ధవంతంగా ఎదుర్కునేందుకు సిద్దంగా ఉండాలన్న ఆదేశాలను అధికారులు జారీ చేశారు.

వివాహితను ట్రాప్ చేసిన ఎస్ఐ

హెడ్‌క్వార్టర్స్‌కు ఎటాచ్ చేస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వివాహితను జవహర్‌నగర్ ఎస్ఐ ట్రాప్ చేశారని ఆరోపిస్తూ ఆమె భర్త సతీష్ మల్కాజ్‌గిరి డీసీపీ ఉమామహేశ్వరరావుకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసు శాఖ సీరియస్‌గా స్పందించింది. నర్సింహులును హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేస్తు ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసు శాఖలో పనిచేస్తున్న కొందరు అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఆ శాఖ ప్రతిష్టను మంటగలిపేలా చేస్తోంది. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వివాహితను ట్రాప్ చేసిన ఘటన హైదరాబాద్‌లో కలకలం రేపుతోంది. భార్య, ఇద్దరు పిల్లలున్నప్పటికీ, ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మరో వివాహితను ట్రాప్ చేయడమే కాదు వివాహిత భర్తను బెదిరించాడని బాధితుడు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై బాధితుడు ఓ న్యూస్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎస్ఐ బాగోతం బయట పెట్టాడు. అంతేకాదు, భార్యకు ఎస్ఐ తన క్రెడిట్ కార్డును కూడా ఇచ్చాడని వివాహిత భర్త ఆరోపించారు. ఈ క్రెడిట్ కార్డు సహాయంతో ఆమె షాపింగ్ చేసిందని ఆయన చెప్పారు. మరోవైపు తన కొడుకును తనకు ఇచ్చేసి ఎస్ఐతో ఉంటానని ఆమె తనకు తెగేసి చెప్పిందని సతీష్ చెప్పారు. దీనికి అడ్డు చెప్పినందుకు తనను బెదిరింపులకు గురిచేస్తున్నారని సతీష్ తెలిపాడు. ఆధారాలతో పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.


పాదచారిని కాపాడిన హోంగార్డులు

హైదరాబాద్‌లోని పురానాపూల్ వంతెన వద్ద ఓ వ్యక్తి గుండెపోటు వచ్చి పడిపోయి బాధపడుతున్న తరుణంలో వెంటనే స్పందించిన హోంగార్డులు ఆయనను కాపాడారు. కుప్పకూలిన వ్యక్తి గుండెపై రాపిడి చేసి ఆయన ప్రాణాలను నిలబెట్టారు. అనంతరం వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు. తనను కాపాడిన హోంగార్డులు చందన్‌సింగ్, వినయతుల్లాకు బాధిత వ్యక్తికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోను హైదరాబాద్ పోలీసులు తమ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

Andhraprabha business 2018

బిజినెస్

ఆటో రంగానికి రాయితీలివ్వండి



హైదరాబాద్: దేశంలో ఆటోరంగం పూర్తిస్థాయిలో రూపాంతం చెందు తోందని. దీన్ని దృష్టిలో ఉంచుకొన్ని ప్రభుత్వం ఆటోరంగంలో అనుకూలమైన విధానలను ప్రకటించాలని రెనో ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో సుమిత్ సహానే ప్రభు త్వానికి విజ్ఞప్తి చేశారు. ఆటో రంగం అభివృద్ధి చెంద డానికి ప్రభుత్వం కార్పొరేట్ టాక్స్‌తో పాటు ఆదాయపు ప న్నును మిన హాయింపులు ఇవ్వాలని కోరారు. ఆర్థిక మంత్రి 2015-16 బడ్జెట్‌లో కార్పొరేట్ టాక్స్‌ను తగ్గిస్తామని హామీఇచ్చారు. అలాగే బడ్జెట్లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి పెద్దమొత్తంలో కేటా యింపులు చేయాలన్నారు. గ్రామీణ మౌలి కరంగంపై పెద్దెత్తున వ్యయం చేయాలన్నారు. గ్రామీ ణాభివృద్దితో పాటు రైతుల సంక్షేమం కోసం ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాల, ఎంట్రీ లెవెల్ ప్యాసింజర్‌కార్లపై ఫోకస్ పెట్టాలని కోరారు. ఉద్యో గావకాశాలు కల్పించాలని, గ్రామీణాభివృద్ధితో పాటు ఉద్యోగాలు పెద్ద త్తున కల్పించే రంగాలు తయారీరంగంతో పాటు సేవల రం గంపై దృష్టి పెట్టా లని సహానే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే పాతకార్లను స్క్రాప్ (ధ్వ ంసం) చేసి కొత్త కార్లు కొనుగోలు చేసే వారి కి రాయితీలు ఇవ్వాలని దీంతో ఆటో రంగం బలోపేతం అవు తుందని ఆయన అభిప్రాయపడ్డారు.



ఆర్థిక క్రమశిక్షణా... ప్రజాకర్షక బడ్జెటా?

•నేడే కేంద్ర బడ్జెట్

న్యూఢిల్లీ : ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ 2018-19 బడ్జెట్‌ను పార్లమెంటులో గురువారం ఉదయం ప్రవేశపెట్టడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఐదవ, అతి సంక్లిష్టమైన బడ్జెట్‌గా ఇది చెప్పుకోవచ్చు. ఎందుకంటే ప్రస్తుతం దేశంలో వ్యవయసారంగం కుదేలైంది. దీనిపై దృష్టిపెట్టాల్సి ఉంది. దీంతో పాటు వృద్ధిరేటును పెంచుకుంటూనే ఉద్యోగాలు సృష్టించాల్సి ఉంటుంది. అదే సమయంలో ఆర్థిక క్రమశిక్షణకు పెద్దపీట వేయాల్సి ఉంటుంది. త్వరలోనే దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది పార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని మోడీ సర్కార్ ప్రధానంగా గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి కొత్త పథకాలు ప్రకటించే అవకాశాలున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలు ఎంఎన్‌ఆర్‌ఈజీఏ, గ్రామీణ గృహ పథకాలు, నీటిపారుదల ప్రాజెక్టులతో పాటు, పంట బీమా పథకాలకు పెద్దమొత్తంలో కేటాయింపులు జరపవచ్చు.ఇటీవల జరిగిన గుజరాత్ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ వోటు బ్యాంకు చెల్లాచెదురైంది. దీంతో జైట్లీ బడ్జెట్‌లో రైతాంగానికి పెద్దెత్తున ప్రోత్సాహకాలు ప్రకటించవచ్చు. చిన్న చిన్న వ్యాపారులు సంప్రదాయబద్దంగా చూస్తే బీజేపీకే అనుకూలంగా ఉంటారు. నవంబర్ 8,2016 అర్ధ రాత్రి మోడీ సర్కార్ చడీచప్పుడు లేకుండా పెద్దనోట్ల రద్దు చేయడంతో చిన్న చితకా వ్యాపారులు బాగా దెబ్బతిన్నారు. గతేడాది జులై 1 నుంచి జీఎస్టి అమల్లోకి తేవడంతో కూడా చోటా మోటా వ్యాపారులు దెబ్బతిన్నారు. వీరిని ప్రసన్నం చేసుకోడానికి జైట్లీ కొన్ని రాయితీలు ప్రకటించవచ్చు. ఇదంతా ఒక ఎత్తయితే ప్రభుత్వంపై సామాన్యుడు గుర్రుగా ఉన్నాడు.. వారిని దృష్టిలో ఉంచుకొని ఆదాయపు పన్నులో కాస్తా ఊరట కలిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆదాయపు పన్ను పరిమితిని పెంచే అవకాశాలున్నాయి. అలాగే జైట్లీ మెనులో మౌలికరంగానికి చెందిన ప్రాజెక్టులపై పెద్దెత్తున వ్యయం చేయనున్నారు. ప్రధానగా జాతీయ రహదారులతో పాటు రైల్వేలను ఆధునీకరణ చేయడానికి పెద్దపీట వేస్తారని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఎందుకంటే వృద్ధిరేటు నాలుగు సంవత్సరాల కనిష్ఠానికి పడిపోయింది. ఇదంతా ఒక ఎత్తయితే ద్రవ్యలోటును అదుపు చేసుకోవాల్సిన బాధ్యత మోడీ సర్కార్‌పై ఉంది. లేదంటే గ్లోబల్ ఇన్వెస్టర్ల నుంచి రేటింగ్ ఏజెన్సీల వరకు రేటింగ్ ఏజెన్సీలకు తప్పుడు సంకేతాలు వెళతాయి. ఇప్పుడిప్పుడే గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలు అనుకూలమైన రేటింగ్‌లు ఇవ్వడం ప్రారంభించాయి. అరుణ్‌జైట్లీ ద్రవ్యలోటును ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీలో 3.2 శాతానికి తీసుకురావాలని 2018-19 నాటికి మూడు శాతానికి పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గురువారం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో కొద్ది గంటల్లో తేలిపోతుంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇటీవల కాలంలో వచ్చే బడ్జెట్ ప్రజాకర్షక బడ్జెట్ ఉండదని స్పష్టం చేశారు. సామాన్యుడు ప్రభుత్వం నుంచి రాయతీలు కోరదని పలు మార్లు చెప్పిన విషయం తెలిసే ఉంటుంది. ప్రభుత్వం ఆర్థికసంస్కరణలకు పెద్దపీట వేస్తోంది. స్వాతంత్ర్య తర్వాత అతి పెద్ద సంస్కరణ వస్తు సేవల పన్ను జీఎస్టి.. జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత ఇదే మొదటి బడ్జెట్. వృద్ధిరేటు పెంచుకోడానికి బడ్జెట్‌లో జైట్లీ ఎలాంటి ప్రకటనలు చేస్తారని అందరూ ఆసక్తిగా ఎదరుచూస్తున్నారు. జైట్లీ ఇప్పటికి పలువార్లు స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టిన పెట్టుబడులపై క్యాపిటల్ గెయిన్ టాక్స్‌ను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. దీనిపై ఆయన ఎలా స్పందిస్తారో చూడాల్సిందే. అలాగే 2015లో వచ్చే నాలుగు సంవత్సరాల కాలంలో కార్పొరేట్ టాక్స్‌ను 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గిస్తామని హామీ ఇచ్చారు. జైట్లీకి ఇవన్నీ అమలు చేయాలంటే పరిమిత స్థాయిలో అవకాశాలున్నాయి. ఎందుకంటే జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత దేశంలో ఉత్పత్తి చేసే వస్తవులపై సెంట్రల్ ఎక్సైజ్, సేవల పన్ను పూర్తిగా ఎత్తివేయడం జరిగింది. ప్రస్తుతం జీఎస్టి అమల్లోకి వచ్చింది కాబట్టి ఈ పన్నులను తీసుకురావడానికి వీల్లేదు. ఇటీవల కాలంలో గ్లోబల్ మార్కెట్లో ముడిచమురు ధరలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. దీంతో ద్రవ్యోల్బణం కోరలు చాచే అవకాశాలున్నాయి. కరెంటు ఖాతాలోటు కూడా పెరిగిపోతుంది. కరెంటు ఖాతాలోటు అదుపు చేయడానికి ప్ర భుత్వం ఎగుమతులను ప్రోత్సహించడానికి కొన్ని ప్రోత్సాహకాలు ప్రకటించాల్సి ఉంటుంది. వీటితో పాటు స్టార్టప్‌లకు కూడా ఇవి అమలు చేస్తే మంచిది. అయితే ద్రవ్యలోటు అదుపు గురించి ప్రభుత్వంలోనే మిశ్రమ స్పందనలు వినిపిస్తున్నాయి. ప్రధాన ఆర్థిక సలహాదారులు అరవింద్ సుబ్రహ్మణ్యం ఈ వారం ప్రారంభంలో మాట్లాడుతూ... ఆర్థిక క్రమశిక్షణలో కాస్తా సడలింపు ఉంటుందని అంటే నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ రాజీవ్‌కుమార్ మాత్రం ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యానికి కట్టుబడి ఉందంటున్నారు. ఈ ఆర్థికసంవత్సరం 2017-18 ద్రవ్యలోటు లక్ష్యం నవంబర్‌లో 112 శాతాన్ని మించిపోయింది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వరంగానికి చెందిన కంపెనీల నుంచి డివిడెండ్ తగ్గడమే. దీంతో ప్రభుత్వం ఈ లోటు పూడ్చుకోవడానికి ప్ర భుత్వరంగానికి చెందిన కంపెనీల్లో వాటాలు విక్రయించుకుని ఒడ్డున పడాలనుకుంటోంది. మొత్తానికి జైట్లీ బడ్జెట్ పట్ల ఆమ్ ఆద్మీ నుంచి పెద్ద కొర్పొరేట్లకు వరకు అందరూ ఆత్రుతతో ఎదురచూస్తున్నారు. కొన్ని గంటల్లోనే ఈ సస్పెన్స్‌కు తెరపడనుంది.



ఫోర్డ్ 'ఫ్రీ స్టయిల్'



న్యూఢిల్లీ : ఫోర్డ్ ఇండియా బుధవారం కొత్త కాంపాక్ట్ కారు 'ఫ్రీస్టయిల్'ను ఆవిష్కరించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మార్కెట్లో అందుబాటులోకి వస్తుంది. ఫీచర్ల విషయానికి వస్తే 1.2 లీటర్ 3 సిలిండర్ పెట్రోల్ ఇంజిన్, ఫైవ్ స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో పాటు 96 పీఎస్ పవర్‌ఔట్‌పుట్‌ను విడుదల చేస్తుంది. దీంతో పాటు 6.5 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటెయిన్‌మెంట్ సిస్టమ్‌తో ఆపిల్‌కార్ట్‌ప్లే, ఆండ్రియాడ్ ఆటో కూడా అందుబాటులో ఉంచుతోంది. ఈ మోడల్‌కారు గ్లోబల్ ఆవిష్కరణలో భాగంగా భారత్‌మార్కెట్లో విడుదల చేసింది. కొద్ది గంటల్లోనే దక్షిణాఫ్రికా మార్కెట్లో కూడా ఈ వాహనాన్ని విడుదల చేస్తుందని ఫోర్డ్ ఇండియా ప్రెసిడెంట్, ఎండీ అనురాగ్ మెహరోత్రా చెప్పారు. ఈ వాహనాన్ని గుజరాత్‌లోని సనంద్‌లో ఉత్పత్తి చేస్తున్నారు. ఇక్కడి నుంచి యూరోప్‌తో పాటు మధ్యప్రాచ్యదేశాలకు కూడా ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం ఫోర్డ్ భారత్ నుంచి సుమారు 50 దేశాలకు ఎగుమతులు చేస్తోంది. ఉత్తర అమెరికాకు కూడా కాంపాక్ట్ ఎస్‌యూవీ యూకోస్పోర్ట్‌ను ఎగుమతి చేస్తున్నట్లు మెహరోత్రా తెలియజేశారు.

శాంసంగ్ ఇండియాలో 1000 కొలువులు

•ఆర్ అండ్ డీలో ఇంజినీర్ల నియామకం

ముంబై : దక్షిణ కొరియాకు చెందిన సాంసంగ్ భారత్‌లో మూడు రెసెర్చ్ అండ్ డెవలెప్‌మెంట్ (ఆర్‌అండ్‌డి) సెంటర్‌లలో సుమారు 1,000 మంది ఇంజినీర్లను నియమిస్తున్నట్లు బుధవారం నాడు ప్రకటించింది. దేశంలని టాప్ ఇన్స్టిట్యూట్‌ల నుంచి వీరిని ఎంపిక చేస్తామని వెల్లడించింది. ఐఐటి, ఢిల్లీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, బిట్స్ పిలానీ, మనీపాల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఐఐటిల నుంచి యువ ఇంజనీర్లను ఎంపిక చేస్తుంది. గత 22 సంవత్సరాల నుంచి భారత్ మార్కెట్లో బలంగా ఉన్నామని.. భారత్‌లో మూడు ఆర్‌అండ్‌టి సెంటర్లు ఉన్నాయని, పలు అత్యాధునిక టెక్నాలజీలను ఇక్కడ ఆవిష్కరించడం జరిగిందిన సాంసంగ్ గ్లోబల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ సాంసంగ్ ఆర్‌అండ్‌డి ఇన్స్టిట్‌ట్యూట్ బెంగళూరు దీపేశ్ షా చెప్పారు. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సింగిల్ ప్రాసెసింగ్, కంప్యూటర్ విజన్, మొబైల్ సెక్యూరిటి, బయోమెట్రిక్‌లతో పాటు ఇతర రంగాల కోసం వీరిని నియమించడం జరుగుతుందని ఆయన వివరించారు. గత ఏడాది తమ ఆర్‌అండ్‌డి కోసం 800 మంది యువ ఇంజినీర్లను తీసుకున్నట్లు ఆయన తెలిపారు. సాంసంగ్‌కు ప్రపంచవ్యాప్తంగ 32 ఆర్‌అండ్‌డి సెంటర్‌లున్నాయి. భారత్‌లో బెంగళూరు, నోయిడా, ఢిల్లీలో ఉన్నాయి. భారత్ మార్కెట్లకు వినూత్నమైన ఉత్పత్తులను అందించడం ఈ ఆర్‌అండ్‌డి పని.

ఎస్ఎంఈల కోరికల చిట్టా

•పన్ను రేట్లు తగ్గించండి

•ఎక్కువ ప్రాజెక్టులు ప్రకటించండి

న్యూఢిల్లీ : వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19 బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి కేవలం కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉంది. చిన్న, మధ్య తరహాతో పాటు రవాణా రంగానికి చెందిన వారి కోరికల చిట్టా ఇలా ఉంది. సర్వేలో పాల్గొన్న 87.5 శాతం మంది బడ్జెట్‌లో ఎక్కువ ప్రాజెక్టులు ప్రకటించాలని.. ఉదాహరణకు భారత్‌మాలా రోడ్డ నిర్మాణ ప్రాజెక్టులను చేపట్టాలని కోరితే.. 54 శాతం రిటైల్.. ఈ కామర్స్, ఎస్ఎంఈలు జాతీయ రిటైల్ విధానం ప్రకటించాలని కోరారు. డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ ఎస్ఏపీ ఎస్ఎంఈలు బడ్జెట్‌పై నిర్వహించిన సర్వేలో వివిధ రంగాలకు చెందిన వారిలో 43 శాతం మంది లోహ, గనుల రంగాల వారు లా భాలపై ప్రోత్సాహకాలు ప్రకటించాలని కోరారు. ఈ రంగాల్లో మూలధనంపై కూడా ప్రోత్సహకాలు ప్రకటించాలని కోరాయి. 88 శాతం మంది ఈ రంగంలో ప్ర భు త్వం రక్షణాత్మకధోరణిని ప్రదర్శించాలని.. దేశీయంగా తయారీరంగాన్ని ప్రోత్సహించాలని కోరారు. చిన్న మధ్య తరహారంగానికి చెందిన ఆటో రంగానికి చెందిన వారు మాత్రం ఆటో విడిభాగాలపై జీఎస్టిరేట్లను తగ్గించాలని డిమాండ్ చేయగా.. 88 శాతం మంది భారత్ స్టేజ్ -6 ప్రమాణాలను ప్రోత్సహించాలని కోరారు.ఇండస్ట్రియల్ మెషిన్ విడిభాగాల రంగానికి చెందిన వారిలో ప్రతి ముగ్గురిలో ఒకరు టెక్నాలజీని అప్‌గ్రేడ్ కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే క్యాపిటల్‌గూడ్స్‌పై సున్నా పన్ను విధించాలని కోరారు. అలాగే 50 శాతం మంది రసాయనాలు, ఫార్మారంగానికి చెందిన వారు బడ్జెట్‌లో ఆర్‌అండ్‌లో వెయిటెడ్ డిడక్షన్ ప్రొవిషన్‌ను 200 శాతానికి మార్చాలని సూచించారు. ప్రొఫెషనల్ సర్వీసెస్ విభాగానికిచెందిన వారిలో 48 శాతం మంది పన్ను చెల్లింపుల్లో మిన హాయింపులు ఇవ్వాలని కోరారు. రిటైల్, ఈ కామర్స్ రంగానికి చెందిన వారిలో 52 శాతం మంది యూనిఫైడ్ జాతీయ మార్కెట్ రిటైల్, ఎఫ్ఎంసీ.ఈ రంగానికి కల్పిం చాలని కోరితే.. 88 శాతం రవాణా, లాజిస్టిక్స్ రంగానికి చెందిన వారు లాజిస్టిక్ పార్కులను ఏర్పాలు చేయాలని కోరారు. సర్వేలో పాల్గొన్న వారిలో 91 శాతం మం ది ప్రభుత్వ ప్రోత్సాహాలతో విధానాలతో కొత్త టెక్నాలజీకి మారేందుకు చేయూత నివ్వాలని కోరారు. మెజారిటీ చిన్న, మధ్య తరహా రంగానికి చెందిన వారిలో టెక్నా లజీ ద్వారానే తమ వ్యాపారం అభివృద్ధి చెందు తుందని నమ్ముతున్నారు.



63.59 శాతం మంది కొత్త టెక్నాలజీ ద్వారా మా ర్కెట్లో నిలదొక్కుకునేం దుకు తాము కోరడం లేదని.. తమ వ్యాపారాన్ని మరింత పెంచుకో వచ్చ ననేదే తమ ప్రధాన ఉద్దేశమ న్నారు.ఎస్ఎంఎస్ రం గానికి చెందిన 29 శాతం మంది బడ్జె ట్‌లో తమకు రు ణాలు అందుబాటులో ఉంచాలని కోరారు. 21 శాతం మంది ఎస్ఎంఈ స్టార్ట ప్‌లను ప్రభుత్వం ప్రోత్సా హకాలు అందివ్వాలని కోరారు.

ఇంకా కోలుకోని సిమెంట్ రంగం

•ఈ ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు 2శాతమే •రేటింగ్ ఏజెన్సీ ఇక్రా



న్యూఢిల్లీ : సిమెంట్ రంగం ఈ ఆర్థిక సంవత్సరంకూడా బలహీనంగానే కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం 2017-18లో ఈ రంగంలో వృద్ధిరేటు కేవలం రెండు శాతం కంటే ఎక్కువ కనిపిం చడం లేదని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా పేర్కొంది. ఈ రంగం వృద్ధి చెందకపోవడానికి ప్రధాన కారణం రియల్ ఎస్టేట్ రంగంలో ఊపందుకోకపోవడం, ఇసుక లభ్యత తక్కువ కావడంతో పాటు కొత్తగా ప్రభు త్వం తీసుకొచ్చిన జీఎస్టి తదితర అంశాలు సిమెంట్ రంగం పుంజుకోవడానికి అడ్డంకిగా మారాయి. నెల వారి ప్రాతిపదికన చూస్తే నవంబర్ 2017లో సిమెంట్ కర్మాగారాల నుంచి 0.5 శాతం పెరిగి 24.1 మిలియన్ టన్నులకు చేరింది. ఈ పరిణా మాల నుదృ ష్టిలో ఉం చుకుంటే ఈ ఆర్థికసంవత్సరం సిమెంట్ రంగంలో వృద్ధి రేటు కేవలం రెండు శాతం మించే పరి స్థితి కనిపించడం లేదని ఇక్రా నివేదికలో పేర్కొంది. ఏడాది ప్రాతిపదికన చూస్తే నవంబర్ 2017 వరకు సిమెంట్ డిమాండ్ 17.3 శాతం వరకు ఉంటుంది. దీనికి ప్రధాన కారణం నవంబర్ 2016లో పెద్దనోట్ల రద్దు ప్రకటతన తర్వాత ఉత్పత్తి 20.5 మిలియన్ మె ట్రిక్ టన్నులకు పడిపోయింది. ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు సిమెంట్‌ఉత్పత్తి స్వల్పంగా 0.6 శాతం పెరిగి 190.0 ఎంఎంటికి చేరగా.. అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో 188.8 ఎంఎంటిలని తెలి పింది. జూన్ త్రైమాసికంలో ఉత్పత్తి 3.3 శాతానికి పడిపోగా.. సెప్టెంబర్ త్రైమాసానికి 0.4 శాతానికి చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమా సికంలో స్థానిక అం శాల కారంగా డిమాండ్‌పై ప్ర భావం చూపించింది. ఉత్తరాది రాష్ట్రాల విష యానికి వస్తే ముఖ్యంగా పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లలో ఇసుక కొరతతో పాటు కూలీలు లభించకపోడం ఒక కారణమైతే దేశంలోని పశ్చిమ ప్రాంతంతో రియల్ ఎస్టేట్ రెగ్యూలేషన్ అధారిటీ (రేరా) బిల్లు తీసుకు రావడంతో నిర్మాణం రంగంలో కార్యకలాపాలు మందగించాయి. దక్షిణాది విషయానికి వస్తే, తమి ళనాడు, కేరళలో ఇసుక కొరతతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కరువుకాటకాల వల్ల నిర్మాణరంగం దెబ్బతింది. ప్రభుత్వం చౌకరకం గృహాలతో పాటు గ్రామీణ గృహ నిర్మాణరంగంతో పాటు మౌలి కరం గానికి చెందిన ప్రాజెక్టులు ముఖ్యంగా రోడ్డు, నీటిపా రుదల ప్రాజెక్టులపై దృష్టిపెట్టడంతో సిమెంట్ డి మాండ్ పెరుగుతుందని వచ్చే ఆర్థికసంవత్సరం 2018-19 ఈ రంగంలో 4-5 శాతం వృద్ధి చెందు తుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గ్రూపు హెడ్ సబ్యాసాచి మజుందార్ చెప్పారు.

వాల్‌మార్ట్ చేతికి ఫ్లిప్‌కార్ట్ వాటాలు



న్యూఢిల్లీ : ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌లో వాల్‌మార్ట్ స్టోర్ ఐఎన్‌సీ 15-20 శాతం వాటాలు కొనుగోలు చేయనున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. వాల్‌మార్ట్ గ్లోబల్ సీఈవో డగ్ మెక్ మిల్లన్ ఇటీవల భారత్ పర్యటనకు వచ్చినప్పుడు ఆయన బెంగళూరులోని ఫ్లిప్‌కార్ట్ కార్యాలయంలో కంపెనీకి చెందిన ఇద్దరు ఎగ్జిక్యూటివ్‌లతో కొంత సమయం గడిపినట్లు చెబుతున్నారు. అయితే దీనిపై ఇప్పటి వరకు తుది నిర్ణయం జరగలేదని చెబుతున్నారు. వాల్‌మార్ట్ ఫ్లిప్‌కార్ట్‌లో బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టాలని చూస్తున్నట్లు చెబుతున్నారు. దీనిపై ఫ్లిప్‌కార్ట్ అధికారని సంప్రదించగా ఆయన దీనిపై స్పందించడానికి నిరాకరించారు. వాల్‌మార్ట్ ఇండియా అధికార ప్రతినిధి సమాచారం ప్రకారం తమ గ్లోబల్ సీఈవో ఇటీవల భారత్ మార్కెట్ విచ్చేసినప్పుడు ఆయన మూడు కంపెనీలతో చర్చలు జరిపారని వాటిలో ఇండియా క్యాష్ అండ్ క్యారీ బిజినెస్, గ్లోబోల్ టెక్నాలజీ సెంటర్, గ్లోబల్ సోర్సింగ్‌తో చర్చలు జరిపారు. అయితే మార్కెట్లో వస్తున్న ఊహాగానాలపై స్పందించమని ఆయన చెప్పారు.

కార్ల ఎగుమతులు 8శాతం పెరిగాయి

•భారత్ నుంచి బ్రిటన్‌కు

లండన్: భారత్ నుంచి బ్రిటన్‌కు గతేడాది కార్ల ఎగుమతులు 8.3 శాతం పెరిగాయి. తాజా గణాంకాల ప్రకారం చూస్తే భారత్ నుంచి ఎగుమతులు పెరిగితే, బ్రిటన్ నుంచి భారత్‌కు దిగుమతులు తగ్గాయని బ్రిటన్ ఆటోమెటివ్ ఇండస్ట్రీ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ది సొసైటీ ఆఫ్ మోటార్ మాన్యుఫ్యాక్చరర్స్ అండ్ ట్రేడర్స్ (ఎస్ఎంఎంటి) విడుదల చేసిన ప్రకటనలో ప్రకారం భారత్‌లో తయారైన కార్లకే బ్రిటన్ మంచి డిమాండ్ ఏర్పడిందని.. 2017లో 34,149 కార్లను దిగుమతి చేసుకున్నారు. 2016తో పోల్చుకుంటే ఇది 8.3 శాతం పెరిగినట్లు లెక్క అని పరిశ్రమవర్గాలు తెలియజేశాయి. బ్రిటన్‌లో భారత్ మోడల్స్ డిమాండ్‌ను ఇలా ఉంది. ఫోర్డ్ ఈకో స్పోర్ట్స్, ఫోర్డ్ కెప ఫ్లస్, నిస్సాన్ మైక్రా, సుజుకి బలెనోకు మంచి డిమాండ్ ఉంది. ఇక బ్రిటన్ నుంచి భారత్‌కు దిగుమతుల విషయానికి వస్తే 2016లో 8 ర్యాంకు నుంచి 2017లో 12వ ర్యాంకుకు పడిపోయింది. 2016లో 3,372 యూనిట్లు భారత్ దిగుమతి చేసుకుంటే 2017లో 1,144 యూనిట్లు పరిమితం అయ్యింది. టాటామోటార్స్‌కు చెందిన జాగ్వార్ అండ్ ల్యాండ్ రోవర్ (జెఎల్‌ఆర్)కు భారత్‌లో మంచి డిమాండ్ ఉంది. దీంతో పాటు రేంజిరోవర్, ల్యాండ్‌రోవర్ డిస్కవరా, రేంజిరోవర్ వేలార్; రేంజిరోవర్ ఎస్‌యూవీలకు భారత్‌లో మంచి స్పం దన ఉందని.. ఒక్క మిని వన్ తప్పించి మిగి లిన బ్రాండ్‌లకు మంచి డిమాండ్ ఏర్పడిందని ఎస్ఎంఎంటి చీఫ్ ఎగ్జి క్యూటివ్ మైక్ హావేస్ చెప్పారు. టాటా మోటార్స్ జాగ్వార్ ల్యాండ్ రోవర్ కార్లను బ్రిటన్‌లో ఉత్పత్తి చేసి ప్రపంచంలోని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తోంది.



కోరమాండల్ లాభంలో 34శాతం వృద్ధి

హైదరాబాద్ : కోరమాండల్ ఇంటర్నేషనల్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 34 శాతం వృద్ధితో రూ.172 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.112 కోట్లు నమోదు చేసింది. వ్యవసా య రంగం పుంజు కోవడంతో మంచి ఫలితాలను ఆర్జించింది. రెవెన్యూ రూ.2,707 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే త్రైమా సికంలో రూ.2,283 కోట్లు ఆర్జించిం నట్లు కంపెనీ ఎండి సమీర్ గోయెల్ చెప్పారు. ఇదిలా ఉం డగా రూ. 30వేల కోట్ల మురుగప్ప గ్రూపు ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఎ వెల్లియన్ 65 సంవత్సరాలు పూర్తైనం దుకు ఛైర్మన్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు.

బడ్జెట్‌లో రైల్వేకు ఊరట?



న్యూఢిల్లీ : వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19 బడ్జెట్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. అందరి కళ్లు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రసంగంపై కేంద్రీకృతమయ్యాయి. నిపుణుల అంచనా ప్రకారం ఆర్థికమంత్రి బడ్జెట్‌లో రైల్వేలకు భారీ ఊరట కలిగించే ప్రకటనలు చేయవచ్చునని చెబుతున్నారు. గత ఏడాది మోడీ సర్కార్ సంప్రదాయబద్ధంగా వస్తున్న రైల్వే బడ్జెట్‌కు స్వస్తి చెప్పి.. రైల్వే బడ్జెట్‌ను కేంద్ర బడ్జెట్‌లో విలీనం చేశారు. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో అరుణ్‌జైట్లీ ప్రత్యేకంగా రైల్వేలపై ఎలాంటి ప్రకటనలు చేస్తారో నిపుణుల అంచనా ప్రకారం ఇలా ఉండవచ్చు.

ప్రయాణికుల భద్రతకు పెద్దపీట : గతేడాది కూడా భారతీయ రైల్వేలు ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చాయి. అయినా.. దురదృష్టవశాత్తు రైలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వచ్చే బడ్జెట్‌లో జైట్లీ భద్రతా ఫీచర్లను బలోపేతం చేయడానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెద్దెత్తున ప్రకటనలు గుప్పించవచ్చునని చెబుతున్నారు.ఇప్పటికే పలుమార్లు ట్రాక్స్‌లో పగుళ్లు ఏర్పడి డైవర్లను సిగ్రల్స్ ద్వారా అప్రమత్తం చేసే వ్యవస్థ కొనసాగుతోంది. దీంతో పాటు పొగమంచు కారణంగా రైళ్లు నత్తనడక నడవకుండా చూసేందుకు కొత్త పరికరం ఫాగ్‌పాస్ (ఫాగ్ పైలెట్ అసిస్టెంట్ సిస్టమ్) లేదా ఎఫ్‌స్‌డీ,తో పాటు జీపీఎస్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి తదుపరి సిగ్నల్ ఎక్కడ ఉందో తేలిగ్గా గుర్తుపట్టే వ్యవస్థను తీసుకురావచ్చు. దీంతో పాటు రైళ్లలో శుచి శుభ్రతతో పాటు రైళ్లను వేగాన్ని పెంచడం. ప్రస్తుతం ప్రయాణికుడు అదనపు సౌకర్యాల కోసం అదనంగా డబ్బు చెల్లించానికి వెనుకాడ్డం లేదు. ముఖ్యంగా శుభ్రతతో పాటు త్వరగా గమన్యానికి చేరుకోవడానికి ఎక్కువ చార్జీలు చెల్లించడానికి అభ్యంతరం తెలుపడు.

చార్జీల్లో కోత: వచ్చే ఏడాది ఎన్నికల సందర్భంగా మోడీ సర్కార్ రైల్వే ప్రయాణికులపై వరాల జల్లు కురిపించే అవకాశాలున్నాయి. డిజిటల్ లావాదేవీలకు పెద్దపీట వేయడంతో పాటు ప్రస్తుతం ఈ టిక్కెట్లపై సర్వీసు చార్జీలు ఎత్తివేసిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు.

ప్రీమియం రైళ్ల ప్రకటన: ప్రీమియం రైళ్లు శతాబ్ది, రాజధాని రైళ్ల స్థానంలో ప్రపంచస్థాయి రైళ్లను జైట్లీ బడ్జెట్‌లో ప్రకటించే అవకాశాలున్నాయని మీడియాలో వార్తలు వస్తున్నాయి. ప్రపంచస్థాయి రైళ్లను ట్రెయిన్ 18ని పిలుస్తారు. ఈ ఏడాదిజూన్ నాటికి శతాబ్ది స్థానంలో ఈ రైళ్లను ప్రవేశపెడతారు. 2020 నాటికి ట్రెయిన్20 ని రాజధానిలో స్థానంలో తీసుకువస్తారు. ఈ ప్రత్యేక రైళ్లను రైల్వే ఇంటిగ్రెల్ కోచ్ ఫ్యాక్టరీలో డిజైన్ చేస్తారు. వీటిని హైస్పీడ్ రైళ్లకు వాడుతారు. ఆర్థిక సర్వేలో కూడా రైల్వేలపై ప్రత్యేక దృష్టి పెడతామని, హైస్పీడ్ రైళ్లకు అధిక ప్రాధాన్యం ఇస్తామని, సరకు రవాణాకు ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేస్తామన ప్రకటించింది.

ఖరీదైన వజ్రం అన్నారు


• చౌక్కా బొత్త చేతిలో పెట్టారు • పాత స్నేహితుడిని బురిడి కొట్టించారు • కటకటాలపాలయ్యారు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లో ఖరీదైన వజ్రం అని నమ్మబలికి తమ పాత స్నేహితుడి చేతిలో చౌక్కా బొత్తా చేతిలో పెట్టి బురిడీ కొట్టించారు ఇద్దరు కేటుగాళ్లు. బాధితుడి ఫిర్యాదుతో రంగ ప్రవేశం చేసిన సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ ఘరానా మోసానికి పాల్పడ్డ ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. అరెసయిన నిందితుల వద్ద నుంచి రూ.1,15, 20,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇతరత్రా మెటీరియల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను హైదరాబాద్ సీపీ వి.వి.శ్రీనివాసరావు విలేకరులకు వివరించారు. హైదరాబాద్‌లోని ఆసిఫ్ నగర్‌కు చెందిన మహ్మద్ అక్తర్ సిద్దిఖీ(52), మెదక్ జిల్లాలోని బీహెచ్‌ఈఎల్ ఆర్సీపురానికి చెందిన మహ్మద్ సలాంఖాన్(39)లు వృత్తిరీత్యా స్నేహితులు. ముత్యాలు, రంగురాళ్లు వంటి ఆభరణాలకు వినియోగించే వస్తువులను అమ్ముతూ జీవనం కొనసాగిస్తున్నారు. 2016లో సలాంఖాన్ తన తమ్ముడు జుబేర్ ఖాన్‌ను ఉద్యోగం కోసం ఆస్ట్రేలియా పంపించాడు. అక్కడ అతడికి ఉద్యోగం దొరక్కపోవడంతో ఖర్చుల కోసం అన్న సలాంఖాన్‌ను డబ్బు పంపమని అడిగేవాడు. తమ్ముడి కోసం తెలిసినవాళ్ల దగ్గర అప్పులు చేసి సలాంఖాన్ డబ్బులు పంపాడు. అయితే సలాంఖాన్ వ్యాపారంలో నష్టపోయాడు. ఆ నష్టాల నుంచి బయటపడేందుకు తన స్నేహితుడైన అక్తర్ సిద్దిఖీ(52)తో కలిసి వ్యూహరచన చేశాడు. ఇందులో భాగంగా ఈ నెల 14న చార్మినార్ నుండి మార్కెట్‌కు వెళ్లాడు. రూ.3,500 చెల్లించి నకిలీ డైమండ్‌ను కొన్నాడు. ముందుగా అనుకున్న ప్రకారం సనత్‌నగర్‌కు చెందిన గతంలో తనతో పాటు పనిచేసిన పాతస్నేహితుడు.. బాధితుడు షేక్ హాజీతో తమ వ్యాపారంలో పెట్టుబడి పెట్టమని కోరాడు. ఈ క్రమంలోనే తమ వద్ద విలువైన వజ్రం ఉంది. దాని ఖరీదు బహిరంగ మార్కెట్లో రూ.25 కోట్లకు పైనే ఉంటుందని నమ్మించారు. అయితే ప్రస్తుతం దానిని కొనుగోలు చేసేవారు లేరని, తమకు డబ్బు అవసరం ఉందని, డైమండ్‌ను అమ్మే వరకు దగ్గర ఉంచుకోమని, అమ్మిన తర్వాత మనం వాటాలు తీసుకుందామని, ప్రస్తుతం తమకు రూ.2 కోట్లు ఇమ్మని షేక్ హాజీతో సలాం ఖాన్ నమ్మశక్యంగా తెలిపాడు. ఈ నెల 18న నాంపల్లి రోడ్డులోని స్వదేశీ లాడ్జి వద్ద షేక్ హాజీకి నకిలీ వజ్రాన్ని అప్పగించి అతడి వద్ద నుంచి రూ.1,20,00,000 తీసుకెళ్లారు. అదే సమయంలో వారు ఆ వజ్రం నిజమైనదిగా షేక్ హాజీని చాకచక్యంగా నమ్మించగలిగారు. వారం తర్వాత షేక్ హాజీ తన స్నేహితుడు సలాంఖాన్‌కు ఫోన్ చేశాడు. బయ్యర్లను చూపించమని అడిగాడు. అయితే సలాంఖాన్ మాత్రం ప్రస్తుతం ఎవ రూ లేరని దాటవేత ధోరణిని కనబర్చాడు. కాగా, షేక్ హాజీకీ తనకు డబ్బు లిచ్చిన వాళ్లనుంచి ఒత్తిడి అధికమైంది. దీం తో, సలాంఖాన్ నుంచి స్పందన రాకపో వడంతో తన దగ్గరున్న వజ్రాన్ని అమ్ముదామని నిర్ణయించుకున్నాడు. ఆ క్రమంలో సదరు డైమండ్‌ను తనిఖీ చేసిన వ్యాపారులు చెప్పిన మాటను విని షేక్ హాజీ నిర్ఘాంతపోయాడు. కారణం అది విలువైన వజ్రం కాదని, చౌక్కా బొత్తా అని వ్యాపారులు తేల్చి చెప్పడమే. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన హాజీ ఆబిడ్స్ పోలీసులనాశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదుతో ఆబిడ్స్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.

హస్తినకు రండి..

• తెలుగు రాష్ట్రాల బీజేపీ నేతలకు అమిత్‌షా పిలుపు • రూట్‌మ్యాప్‌తో సిద్ధమైన రాష్ట్ర నేతలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాలలోని బిజెపి నేతలకు ఢిల్లీ పెద్దల నుంచి పిలుపు వచ్చింది. దీంతో ఇరు రాష్ట్రా లకు చెందిన పార్టీ అధ్యక్షులు, శాసనసభ, మండలిలో ఫ్లోర్ లీడర్లు గురువారం ఢిల్లీకి వెళ్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలలో బలపడేందుకు గత కొంత కాలంగా వ్యూహాలను సిద్ధం చేస్తున్న పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా ఏకాఎకిన ఈ ప్రాంతానికి చెందిన నేతలను పిలిపిం చుకోవడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తెలం గాణలో ఒంటరిగా, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపితో కలిసి వెళ్ళేందుకు పార్టీ సన్నద్ధమైంది. అయితే ఇందుకు భిన్నంగా వాస్తవ పరిస్థితులు ఉండటంతో గత కొంత కాలంగా రెండు రాష్ట్రా ల కేడర్‌లో గందరగోళం నెలకొంది. తెలంగాణలో పార్టీ పరిస్థితి రోజు రోజుకూ తీసి కట్టు నామం బొట్టు అన్నట్లుగా తయా రైంది. నేతలు ఎవరికి వారుగా గ్రూపులు కట్టడంతో కేడర్‌లో గందరగోళం ఏర్పడింది. ఎవరి పక్కన తిరిగితే ఎవరికి కోపం వస్తుందో అన్న సందిగ్ధంలో కింది స్థాయి నేతలున్నారు. పార్టీ కేవలం పంచపాండవుల చేతిలో ఉండటంతో కొత్త వారు పార్టీలో చేరేందుకు ఏ మాత్రం సుముఖత వ్యక్తం చేయక పోవడం, కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకు వెళ్ళడంపై నాయకులు కేడర్‌లో ఉత్సాహం నింపక పోవడంతో పార్టీ పరిస్థితి అధ్వాన్నంగా తయా రైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను గ్రామస్థాయి ప్రజలకు తెలియజేయడంలో నేతలు వైఫల్యం చెందారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. పార్టీకి ఉన్నది కేవలం అయిదుగురు ఎంఎల్ఎలే అయినప్పటికీ వారిలోనూ ఐక్యత లోపించడం, కొత్త వారిని పార్టీని తీసుకు రావడంపై శ్రద్ధ చూపించక పోవడంపై కొంత కాలంగా అధిష్టానం ఆగ్రహంతో ఉంది. పార్టీలో చేరిన వారు ఒక్కొక్కరుగా దూరం అవుతుండటంపై కూడా నాయకత్వం గుర్రుగా ఉంది.

గ్రామ స్థాయిలో పార్టీ విస్తరణపై దృష్టి పెట్టాలని, పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీ కార్య వర్గాలను ఏర్పాటు చేయాలన్న అధిష్టానం ఆదేశాలు ఎక్కడా అమలైన దాఖలు లేకపోవడంపై కేంద్ర నేతలు రాష్ట్ర నాయకుల పనితీరుపై పెదవి విరుస్తున్నారు. ఇదే విషయాన్ని నెల రోజుల క్రితం తెలంగాణలో మూడు రోజుల పాటు పర్యటించిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయ్ వర్గీయ రాష్ట్ర నేతలకు తలంటి వెళ్ళారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పార్టీ ఉదాసీన వైఖరిని ఆయన తప్పుపట్టారు. ఈ అంశాలన్నింటిపై అమిత్‌షా పార్టీ నేతలను ప్రశ్నించే అవకాశాలున్నాయని తెలిసింది. అదే విధంగా కేంద్రం తాజాగా తెరపైకి తెచ్చిన అన్ని ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే ఎలా ఉంటుందన్న అంశం, విభజన బిల్లులో పొందు పరచినట్లుగా ఇప్పటికిప్పుడు నియోజకవర్గాలను పెంచితే పార్టీ పరిస్థితి ఎలా ఉండబోతుందన్న అంశాలపై కూడా అమిత్‌షా చర్చించనున్నారని వినికిడి. పార్టీ బలోపేతం కోసం అనుసరించాల్సిన వ్యూహంపై దశ దిశను నిర్దేశించబోతున్నారని అంటున్నారు. మొత్తం మీద ఢిల్లీకి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌తో పాటు బిజెఎల్‌పి నేత జి. కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్య దర్శి పి. మురళీధర్‌రావు, జాతీయ కార్యవర్గ సభ్యు డు పేరాల శేఖర్‌రావులు వెళ్తున్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో అక్కడే ఉన్న ఎంపి దత్తాత్రేయ కూడా ఈ సమావేశంలో పాల్గొంటారని పార్టీ వర్గాలు చెప్పాయి.

ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి, టిడిపిల మధ్య సఖ్యత కొరవడటంతో రెండు పార్టీల మధ్య ఏర్పడ్డ అగాధంపై అమిత్‌షా ఆరా తీయనున్నారు. ఇరు పార్టీలకు ఎక్కడ చెడిందన్న అంశంతో పాటు విభజన హామీల అమలులో తలెత్తిన అనుమానాలను నివృత్తి చేయనున్నారని అంటున్నారు.

అనాధలను విద్యా పరంగా ప్రొత్సహిస్తాం

ఎస్‌బిఐ సీజీఎం స్వామినాథన్

అనాదాశ్రమానికి బస్సు బహూకరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అనాధలు, వీధి పిల్లలను ఆదుకుని వారికి విద్యాబుద్ధులు నేర్పించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని బ్యాంకు సీజీఎం జె.స్వామినాథన్ చెప్పారు. అలాగే ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు తమ బ్యాంకు స్వచ్ భారత్ కార్యక్రమానికి కూడా సహాయం అందిస్తోందని ఆయన చెప్పారు. నగరంలోని మారుతీ వృద్ధ, అనాధాశ్రయ సంస్థకు బ్యాంకు రూ.15 లక్షల విలువైన ఒక బస్‌ను విరాళంగా ఇచ్చింది. ఈ సందర్భంగా స్వామినాథన్ మాట్లాడుతూ, తమ బ్యాంకు పేద విద్యార్థులు, నిరాశ్రయులను విద్యాపరంగా ఆదుకునేందుకు గతంలో కూడా అనేక సంస్థలకు బస్సులు విరాళంగా ఇచ్చామన్నారు. 2016-17లో తమ బ్యాంకు రూ.3.50 కోట్లు వివిధ కార్యక్రమాలకు విరాళాలు ఇచ్చిందని చెప్పారు. ఇటీవలె హైదరాబాద్‌లో అమ్మా నాన్న ఆనంద ఆశ్రమానికి కూడా ఓ బస్సును విరాళంగా ఇచ్చామని స్వామినాథన్ తెలిపారు. స్వచ్ భారత్ కింద జనవరి 16 నుంచి 31వ తేదీవరకు జిహెచ్ఎంసి పరిధిలో రూ.7 లక్షల విలువైన 75 చెత్త వేసేందుకు డబ్బాలు విరాళంగా ఇచ్చామని ఆయన తెలిపారు. హరితహారం పథకం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా విస్తృతంగా చేపడుతున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్లు ప్రభోద్ పారిక్, యుఎన్ఎన్ మైనా, ఎస్.మానిక్ ఆనంద్, కెపి మల్లిక తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యత

• మహిళల భద్రతకు తెలంగాణ పెద్దపీట

• ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్ రజతోత్సవ వేడుకలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మహిళల రక్షణకు తెలంగాణా సర్కార్ పెద్దపీట వేస్తోందని, మహిళా సాధికారత ప్రధాన అజెండాగా సీఎం కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశపెట్టారని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ త్రిపురాంతకం వెంకటరత్నం అన్నారు. బుధవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కేంద్ర శిశు, మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మహిళా కమిషన్ రజతోత్సవ సదస్సులో ఆమె ప్రసంగించారు. రాజకీయాల్లో సైతం మహిళలను ప్రోత్సహిస్తున్న కేసీఆర్ ఢిల్లీలో జరిగిన 'నిర్భయ' వంటి దుర్ఘటనలు హైదరాబాద్‌లో జరగకుండా 'షీటీమ్స్'ను ఏర్పాటు చేశారని 'హాక్ ఐ' అప్లికేషన్ ద్వారా మహిళలకు రక్షణ చర్యలు చేపట్టారని వెంకటరత్నం వివరించారు. తెలంగాణ నుండి జాతీయ సదస్సులో 40 మంది మహిళలు పాల్గొన్నారు. తెలంగాణ రీజినల్ కోఆర్డినేటర్లు మూల విజయారెడ్డి, రేన, మహిళా కార్యకర్త ఉప్పులేటి శైలజ, పలు రాష్ట్రాల మహిళా కమిషన్ల ఛైర్మన్లు, శిశు సంక్షేమ శాఖ రీజినల్ ఆఫీసర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ జెడ్పీ ఛైర్మన్ తుల ఉమ మీడియాతో మాట్లాడుతూ కేంద్రం జాతీయ స్థాయిలో మహిళల రక్షణ కోసం మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల్లో మహిళా కార్యక్రమాలు జరుగుతున్న తీరుతెన్నులను ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పలు సెషన్స్‌లో మహిళా ప్రతినిధులు ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. గృహ హింస నివారణ, కార్యాలయాల్లో ఉద్యోగినులకు లైంగిక వేధింపులు, విదేశాల్లో భారతీయుల పెళ్ళిళ్ల వ్యవహారాలు, మహిళలపై యాసిడ్ దాడులు, అత్యాచారాలు అనే తదితర అంశాలపై కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి మేనకా గాంధీ ప్రసంగించారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ తరపున రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి 55 మంది మహిళా ప్రతినిధులతో కలిసి జాతీయ మహిళా కమిషన్ రజతోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

3న బీసీ విద్యార్థుల బహిరంగ సభ



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వెనుకబడిన తరగతుల విద్యార్థులందరికీ పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 3న భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్టు బీసీ విద్యార్థి సంఘం ప్రకటించింది. రాష్ట్రంలో బీసీల కోసం 500 గురుకు లాలను ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర కార్యవర్గం అధ్యక్షులు జి అంజి అధ్యక్షతన బీసీ భవన్‌లో జరిగింది. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సమా వేశంలో గుజ్జ కృష్ణ, డాక్టర్ ర్యాగ అరుణ్, వేముల రామకృష్ణ, సతీష్, నీల వెంకటేష్, రామలింగం తదితరులు పాల్గొన్నారు. ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ చదివే బీసీ విద్యార్థులందరికీ ర్యాంకులతో సంబంధం లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను మంజూరు చేయాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రారంభించిన సమయంలో ఇదే విధానాన్ని అమలు చేశారని కానీ గత మూడు సంవత్సరాలుగా బీసీల్లో 10వేల ర్యాంకులు పొందిన వారికి మాత్రమే పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇస్తున్నారని మిగిలిన వారికి పూర్తి రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదని విమర్శించారు.

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం కోసం కొద్ది రోజుల క్రితం బీసీ ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించారని, అందులో 190 తీర్మానాలను చేసినట్టు తెలిపారు. వాటిపై ఇప్పటి వరకు డిక్లరేషన్ రూపంలో ప్రకటించలేదని విమర్శించారు.

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడం కోసం రెండు తెలుగు రాష్ట్రా ల ముఖ్యమంత్రులు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టేలా చూడాలని డిమాండ్ చేశారు.

సదరన్ ట్రావెల్స్ హాలిడే బజార్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పర్యాటక రంగంలో పేరుగాంచిన సదరన్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ దేశీయ, అంతర్జాతీయ పర్యా టకుల కోసం ప్రత్యేక హాలిడే బజార్‌ను నిర్వ హిస్తోంది. ఈనెల 3, 4 తేదీల్లో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం నగరాల్లో ట్రావెల్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎం.రామారావు తెలిపారు. అప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఈవెంట్‌ను పూర్తి చేశా మని, త్వరలో అన్ని రాష్ట్రాల్లో నిర్వహిం చనున్నట్లు బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. ఈ హాలిడే బజార్‌లో దేశీయ, అంతర్జాతీయ పర్యాటనకు ప్యాకేజీ టూర్స్‌కు అడ్వాన్స్‌గా రిజర్వు చేసుకోవచ్చునని, ఈ రెండు రోజులు రిజర్వు చేసుకున్న వారికి ప్రత్యేక డిస్కౌంట్‌లు, క్యాష్ బ్యాక్, జిఎస్‌టి మినహాయింపు ఉంటుందని రామారావు తెలిపారు. ప్యాకేజీ బడ్జెట్‌ను బట్టి రాయితీ శాతం ఉంటుందని, ఈ ప్యాకేజీ కింద టూర్ ఖరారు చేసుకున్న వారు డిసెంబర్ 31 వరకు వినియోగించుకోవచ్చునని తెలిపారు. తమ సంస్థ గత 47 ఏళ్ళుగా దేశవ్యాప్తంగా పర్యాటకులకు సేవలు అందిస్తూ కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ నుంచి ఎనిమిదిసార్లు ఉత్తమ టూర్ ఆపరేటర్‌గా అవార్డు పొందిందని రామారావు తెలిపారు. ఎక్కువ మంది పర్యాటకులకు సేవలు అందించడం, టర్నోవర్, ఉత్తమ సేవలకుగానూ ఈ అవార్డు దక్కిందని ఆయన చెప్పారు.

బీసీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: వెనుకబడిన తరగతుల ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. బీసీలకు అమలు చేస్తున్న రిజర్వేషన్లను 25 శాతం నుంచి 52 శాతానికి పెంచాలని తీర్మానించినట్టు సంఘం తెలిపింది. బీసీ ఉద్యోగుల సంఘం సమావేశం బుధవారం బీసీ భవన్‌లో జరిగింది. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈ నిరంజన్ అధ్యక్షత వహించగా తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి పి లక్ష్మినారాయణ పాల్గొన్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించకపోవడంతో ఉన్నతస్థానాల్లో బీసీలు లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లోని డైరక్టర్ పదవుల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించి బీసీలనే నియమించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు పొందుతున్న వారిలో ఎవరికి లేని విధంగా క్రిమీలేయర్‌ను బీసీలకు మాత్రమే అమలు చేస్తున్నారని విమర్శించారు. దీనిని వెంటనే ఎత్తేయాలని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ కమిషన్ బిల్లుకు చట్టబద్దత కల్పించే బిల్లుకు పార్లమెంటులో ఆమోదం లభించేలా అన్ని పార్టీలు సహకరించాలని తీర్మానించారు. చట్టసభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించేలా పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టేలా చూడాలని డిమాండ్ చేశారు.

ఎర్రమట్టి తవ్వకాలపై నివేదికివ్వండి

అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు ప్రాంతంలోని పాండవులగుట్ట అటవీప్రాంతంలో జరుగుతున్న ఎర్రమట్టి అక్రమ తవ్వకాల వ్యవహారంలో పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని హైకోర్టు అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్, కలెక్టర్‌ను ఆదేశించింది. పాండవులగుట్ట వద్ద జరుగుతున్న ఎర్రమట్టి తవ్వకాలపై హైకోర్టు స్టే విధించింది. అక్రమ మైనింగ్ కార్యకలాపాల వల్ల సహజ సిద్ధమైన వనరులకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని, పర్యావరణ సమతుల్యానికి విఘాతం కలుగుతుందని హైకోర్టు అభిప్రాయపడింది. పాండవులగుట్ట ప్రాంతంలో పర్యావరణ సమతుల్యం దెబ్బతినకుండా చూస్తామని హైకోర్టు హామీ ఇచ్చింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎమ్మెస్కె జైస్వాల్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. అక్రమ తవ్వకాలను సవాలు చేస్తూ ఎండీ.యాకూబ్ పాషా హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. మైనింగ్ కార్యకలాపాల వల్ల సహజవనరులను నాశనం చేయడం వల్ల పూడ్చు కోలేని విధంగా పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేవలం 4.8 ఎకరాల విస్తీర్ణంలో తవ్వకాల కోసం మాత్రమే ప్రతివాదులకు అనుమతి లభించింది. జయశంకర్ జిల్లా కలెక్టర్‌ను ఈ వ్యాజ్యంలో చేర్చిన ధర్మాసనం ఆ భూములను సర్వే చేయించాలని ఆదేశించింది. అలాగే ఈ వ్యవహారంలో పూర్తి వివరాలను సమర్పించాలని అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్‌ను ఆదేశించింది.

నూతన సాంకేతికతతో విస్తృతంగా ఐటి ఉద్యోగాలు

యువత కెరీర్ ప్రత్యామ్నాయం ఎంచుకోవాలి

హైసియ సీవోవో శ్రీనివాసరావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఐటి రంగంలో వస్తున్న నూతన సాంకేతికతలను అందిపుచ్చుకుంటే ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా ఉంటాయని హైసియ సీవోవో ఆర్.శ్రీనివాసరావు చెప్పారు. అంతర్జాతీయ సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా యువ టెక్ నిపుణులు తెలివిగా తమ కెరీర్ ప్రత్యామ్నాయాలు ఎంచుకోవాలని ఆయన సూచించారు. హైసియ, టాలెంట్ స్ప్రింట్ భాగస్వామ్యంతో వాట్ ఇండస్ట్రీ వాంట్స్ అనే అంశంపై ముఖాముఖి సదస్సు బుధవారం నిర్వహించింది. ఐటి పరిశ్రమలో జరుగుతున్న పరిణామాలు, వస్తున్న మార్పులపై ఔత్సాహికులు కొత్త అవకాశాల కోసం ఎలా సన్నద్ధం కావాలన్న దానిపై ఈ అవగాహన కార్యక్రమాలను ఈ రెండు సంస్థలు కలిసి నిర్వహించాయి. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఐటి ఉద్యోగం అంటే విదేశాలకు వెళ్ళేందుకు ఒక టికెట్‌గా భావించేవారని, ఇప్పుడు గ్లోబల్ స్వీయ రక్షణ సవాళ్ళను ఎదుర్కోవడంలో అనేక నూతన అవకాశాలు తెరపైకి వచ్చాయన్నారు.

ఈ సాంకేతికతలు ఎంతో కొత్తదని, ఈ నూతన సాంకేతికతలను అందిపుచ్చుకోవడం ద్వారా పట్టభద్రుడైన అభ్యర్థికి కూడా బాగా అనుభవజ్ఞుడైన నిపుణులతో సమానంగా అవకాశాలు ఏర్పడుతుందని ఆయన చెప్పారు. నేటి యువతకు విజ్ఞానం, అపారమైన సమాచారం కలిగి ఉన్నారని, వీటిని తమ దృక్పథాన్ని విస్తృతం చేసుకునేందుకు ఉపయోగించుకోవాలని శ్రీనివాసరావు సూచించారు. 170 బిలియన్ డాలర్ల భారతీయ ఐటి పరిశ్రమ ఇటీవల నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుని నైపుణ్యం కలిగిన వారికి విస్తృత అవకాశాలు అందిస్తోందని ఆయన చెప్పారు. కంపెనీలు సరైన ప్రతిభ కోసం సాంప్రదాయంగా ఉండే క్యాంపస్ నమూనాతో పాటు హ్యాకథాన్స్, కోడింగ్ వేదికలకు సంబంధించి ప్రత్యామ్నాయ ప్రతిభవైపు చూస్తున్నాయని ఆయన చెప్పారు.

టీఆర్‌టీ దరఖాస్తు స్వీకరించండి

టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్ టీ) రాసేందుకు పిటిషనర్ దరఖాస్తును స్వీకరించాలని,హాల్ టికెట్ ను కూడా జారీ చేయాలని, స్థానిక అభ్యర్థిగా పరిగణించి రిజర్వేషన్ వర్తింప జేయాలని హైకోర్టు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీఎస్ పీఎస్సీ)ను ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావు బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. తన పాఠశాల విద్యను 5 నుంచి పదో తరగతి వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో పూర్తి చేసినందువల్ల ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్ టీ) విషయంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థిగా పరిగణించి, రిజర్వేషన్ వర్తింపజేయాలని అభ్యర్థిస్తూ కర్నూలు మండలం రెమట గ్రామానికి చెందిన ఎం.రంగస్వామి హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది బి.రమేశ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు స్థానికత లేదనే కారణంతో దరఖాస్తును స్వీకరించలేదని విన్నవించారు. ఉద్యోగ ప్రకటన ప్రకటన మేరకు నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు వరుసగా నాలుగేళ్లు ఒకే జిల్లాలో విద్యను అభ్యసించి ఉంటే స్థానిక అభ్యర్థిగా పరిగణిస్తామని పేర్కొన్నట్లు తెలిపారు. ఆ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి పిటిషనర్ దరఖాస్తును స్వీకరించాలని, హాల్‌టికెట్‌ను జారీ చేయాలని ఆదేశించారు.

రిజర్వేషన్ల అమలులో వ్యవసాయ వర్సిటీలు భేష్

బీసీ లెజిస్లేచర్ కమిటీ ప్రశంస

బీసీసెల్ ఏర్పాటుకు సూచన



హైదరాబాద్,ఆంధ్రప్రభ: వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లను అమలు చేయడంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆదర్శంగా నిలిచిందని బీసీ సంక్షేమంపై ఏర్పాటు చేసిన శాసనసభా కమిటీ అభినందించింది. బుధవారం కమిటీ సభ్యులు చైర్మన్ వి గంగాధర్‌గౌడ్ అధ్యక్షతన యూనివర్సిటీలో పర్యటించారు. యూనివర్సిటీలో జరుగుతున్న ప్రవేశాలు, ఉద్యోగాల నియామకం తదితర అంశాలను పరిశీలించారు. చైర్మన్‌తోపాటు సభ్యులు ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల నియామకంతోపాటు, విద్యార్థుల ప్రవేశాల్లో యూనివర్సిటీ పురోగతిని సమీక్షించారు. యూనివర్సిటీలో 361 మంది బోధన సిబ్బంది ఉండగా వారిలో 132 మంది బీసీలు ఉన్నారని ఇది మొత్తంలో 36.5 శాతంగా ఉన్నట్టు కమిటీ సభ్యులు గుర్తించారు. బోధనేతర సిబ్బంది 1437 మంది ఉండగా వారిలో 918 మంది బీసీలు ఉన్నారని వీరు 43.4 శాతంగా ఉన్నారని కమిటీ గుర్తించింది. యుజీ కోర్సుల్లో 44.35 శాతం మంది విద్యార్థులు, డిప్లమా కోర్సుల్లో 62 శాతం మంది విద్యార్థులు చేరారని వీసీ డాక్టర్ వి ప్రవీణ్‌రావు, రిజిస్ట్రార్ సుధాకర్ కమిటీ దృష్టికి తీసుకొచ్చారు.

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి


దేశంలో 56 శాతంగా ఉన్న బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు బీసీ శాసనసభా కమిటీకి విజ్ఞప్తి చేశారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేలా కమిటీ ప్రతిపాదనలను ఢిల్లీకి పంపాలని, ముఖ్యమంత్రి అధ్యక్షతన అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ వేముల రామకృష్ణ కమిటీకి విజ్ఞప్తి చేశారు.

చందమామ త్రిపాత్రాభినయం

(మొదటిపేజీ తరువాయి)

తనంతటతానుగా త్రిపాత్రాభినయం చేసింది. మొదటగా భూమికి అత్యంత సమీపానికి చేరుకుంది. పరిమాణంలో భారీగా, అత్యంత ప్రకాశవంతంగా కనిపించింది. అదే సూపర్ మూన్. దశాబ్దాల తర్వాత మానవాళికి వీక్షించే మహత్తరమైన అవకాశాన్ని అందించింది. అలా మొదటి పాత్ర ముగిసింది. ఆ తర్వాత వచ్చింది బ్లూ మూన్. అదే ఒక క్యాలెండర్ మాసంలో సంభవించే రెండవ బ్లూ మూన్. రెండవ పాత్ర పోషణ పూర్తయిపోయింది. ఇక త్రిపాత్రాభినయంలో చివరిది బ్లడ్ మూన్. గ్రహణానికి ఎరుపు వర్ణాన్ని ఆపాదించేది. ఈ పాత్ర పోషణలో చందమామ గగనంలో పుట్టుకొచ్చిన కందగడ్డను తలపించింది. ఇలాంటి అవకాశం జీవితంలో ఒకసారే వస్తుంది సుమా అన్నట్టుగా ప్రపంచంలో అనేక చోట్ల ప్రజలకు మూడు రూపాల్లో చందమామ కనిపించింది. ఢిల్లీ, పూనె,కోల్‌కతా, తదితర నగరాల్లో ప్లానిటోరియమ్‌లకు ప్రజలు క్యూ కట్టారు. ఖగోళ శాస్త్రవేత్తల మార్గదర్శనంలో అద్భుతాన్ని వీక్షించారు.

తెలిపారు. ఢిల్లీలో ఇండియా గేట్ ప్రాంతంలో చందమామను చూడటానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కానీ ఆరంభంలో వారిని నిరాశపరుస్తున్నట్టుగా చందమామ మేఘావృతమై కనిపించింది. కానీ కాసేపటికి మబ్బులు తొలగిపోవడంతో ఎరుపు రంగులో చందమామ వారికి కనువిందు చేసింది. అరుదైన చంద్రగ్రహణాన్ని అందరూ వీక్షించేలా చేయడం కోసం దేశవ్యాప్తంగా అనేక సంస్థలు రంగంలోకి దిగాయి. స్పేస్ ఇండియా అనే స్టార్టప్ ఢిల్లీలో ఇండియా గేట్ సహా చెన్నయ్, బెంగళూరు, సూరత్, డెహ్రాడూన్, మీరట్ నగరాల్లో చంద్ర గ్రహణ వీక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేసింది. ఇండియాగేట్ దగ్గర డొబ్‌సోనియన్ టెలిస్కోప్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచింది. ఈ టెలిస్కోప్‌తో సూపర్ మూన్‌ను అత్యంత స్పష్టంగా, ఎంతో దగ్గరగా చూడవచ్చు.



డొబ్‌సోనియన్ టెలిస్కోప్ పుణ్యమాని ప్రజలు మామూలుగా చూసిన దాని కన్నా 20 రెట్లు పెద్దదిగా చందమామను వీక్షించారు. వందలాదిగా ఆబాలగోపాలం ఇండియా గేట్ చేరుకొని మూడు పాత్రల్లో చందమామను కనులారా చూశారు. భారతదేశంలో చంద్ర గ్రహణం సాయంత్రం 4.21 గంటలకు ప్రారంభమైంది. 6.25 గంటలకు సంపూర్ణ చంద్రగహణం దర్శనమిచ్చింది. సాయంత్రం7.25 గంటల నుంచి చంద్రుడి పరిమాణం తగ్గుతూ వచ్చింది. ఈ ఏటి తొలి సంపూర్ణ చంద్ర గ్రహణం భారతదేశంలో పాక్షికంగా కనిపించింది. జులై 28న అలాంటి రెండవ గ్రహణం భారతదేశంలో సంపూర్ణంగా కనిపిస్తుందని ముంబాయిలో నెహ్రూ ప్లానిటోరియమ్ డైరెక్టర్ అరవింద్ పరంజపే తెలిపారు. అరుదైన చంద్రగహణాన్ని చూడ్డానికి నెహ్రూ ప్లానిటోరియమ్‌కు మూడు వేల మంది ప్రజలు వచ్చారని పరంజపే చెప్పారు. గ్రహణాల పట్ల మూఢ నమ్మకాలను తోసిరాజని గ్రహణ వీక్షణకు వేల మంది రావడం సంతోషకరమని తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో చంద్ర గ్రహణం సాయంత్రం 5.18 గంటలకే ప్రారంభమైనప్పటికీ పొగమంచు కారణంగా కొన్ని చోట్ల సరిగ్గా కనిపించలేదు. అయితే సంపూర్ణ చంద్ర గ్రహణం సాయంత్రం 6.21 గంటలకు మొదలైందని ప్రతి ఒక్కరూ చూడవచ్చని ఎంపీ బిర్లా ప్లానిటోరియం డైరెక్టర్ దేబిప్రసాద్ దవురి తెలిపారు. బెంగళూరులో వేలాది మంది ప్రజలు నెహ్రూ ప్లానిటోరియంలో చంద్ర గ్రహణాన్ని వీక్షించారు. చందమామను మూడు రూపాల్లో వీక్షించే అవకాశం ఉత్తర అమెరికా, తూర్పు ఆసియా వాసులకు కూడా దక్కింది. 1992, డిసెంబరు 10వ తేదీన సంభవించిన సంపూర్ణ చంద్ర గ్రహణానికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన అంశాన్ని అరవింద్ పరంజపే వెల్లడించారు. అది ఎంత తీవ్రంగా ఉందంటే ఆకాశంలో చందమామ కొద్దిసేపు పూర్తిగా అదృశ్యమైపోయినట్టు అనిపించింది. అమావాస్య చీకటిని తలపించిందని తెలిపారు.

గూఢచర్యం కేసులో వైమానిక అధికారి!

- పాకిస్తాన్‌కు కీలక పత్రాలు చేరవేసినట్లు సందేహం

న్యూఢిల్లీ: భారత వైమానిక దళం(ఐఎఎఫ్) ప్రధాన కార్యాలయంలో గ్రూప్ కెప్టెన్‌గా పనిచేస్తున్న ఒక అధికారిని గూఢచర్యం అభియోగంపై ఐఎఎఫ్ కస్టడీలోకి తీసుకున్నారు. కీలకమైన పత్రాలను చేజిక్కించుకోవడానికి సైతం ఆయన ప్రయత్నించి ఉండవచ్చని అధికార వర్గాలు బుధవారం వెల్లడించాయి. అత్యంత గోప్యంగా ఉంచాల్సిన పత్రాల తాలూకు ఛాయా చిత్రాలను సదరు అధికారి వాట్సప్ ద్వారా ఒక మహిళకు పంపించినట్టుగా భావిస్తున్నారు. కీలక సమాచారం కోసం మగువను ఎరవేసే ప్రక్రియలో భాగంగా ఆ అధికారి హనీట్రాప్ బాధితుడా అనే కోణంలో సైతం దర్యాప్తు అధికారులు విచారిస్తున్నారు. పాకిస్తాన్ నడుపుతున్న అతిపెద్ద గూఢచర్య ముఠాలో ఆయన కూడా భాగమా అనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. సదరు అధికారి అనధీకృత ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా అవాంఛనీయ కార్యకలాపాలకు పాల్పడినట్టు సమాచారం. ఐఎఎఫ్‌కు చెందిన కేంద్రీయ భద్రత, దర్యాప్తు విభాగానికి చెందిన బృందం అధికారిని కస్టడీలోకి తీసుకుంది. ప్రస్తుతం ఆయనన్ను విచారిస్తున్నారని తెలిపారు. రివాజుగా జరిపే కౌంటర్ ఇంటెలిజెన్స్ నిఘాలో అధికారి అవాంఛనీయ కార్యకలాపాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. అయితే ఈ విషయమై ఐఎఎఫ్ అధికారికంగా వ్యాఖ్యానించలేదు.

రైలు ప్రయాణీకులకు హైలెట్స్ యాప్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ జంటనగరాల్లో తిరిగే రైళ్ల రాకపోకలను కచ్చితంగా తెలుసుకొనేందుకు రైల్వే రూపొందించిన హైలైట్స్ యాప్‌ను మరింతగా ఆధునీకరించారు. హైదరాబాద్ లైవ్ ట్రెయిన్ ఎంక్వయిరీ సిస్టమ్ పేరుతో అందుబాటులోకి వచ్చిన ఆండ్రాయిడ్ యాప్‌తో రైళ్ల రాకపోకలపైన కచ్చితమైన సమయం తెలుసుకోవడం మరింత సులభతరమైంది. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో తిరిగే రైళ్ల వివరాలను ఈ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవడం కోసం యాప్‌ను 2014లో రైలు ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చారు. ఎంఎంటిఎస్ రైళ్ల రాకపోకలపై హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్ల వారిగా కచ్చితంగా తెలుసుకోవడంతో పాటుగా సాధారణ రైలు ప్రయాణ సమాచారం కూడా తెలియచేయడం జరుగుతుంది.

అండర్‌పాస్‌లు నిర్మించండి

జాతీయ రహదారుల సంస్థకు ఎంపీ బూర నర్సయ్య వినతి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : నాలుగు వరుసల జాతీయ రహదారిపై అండర్‌పాస్‌లు నిర్మించి ప్రమాదాలను నివారించాలని కోరుతూ భువనగిరి ఎంపీ బూర నర్సయ్య గౌడ్ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ దీపక్ కుమార్‌ను కలిశారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఢిల్లీలో ఉన్న ఆయన, వరుసగా కేంద్ర మంత్రులు, అధికారులను కలుస్తూ తన నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నారు. బుధవారం దీపక్ కుమార్‌తో భేటీ అయిన బూర, ఆలేరు బైపాస్ ఎంట్రీ, జీడికల్లు రోడ్డుతో పాటు వంగపల్లి వద్ద జాతీయ రహదారి 163పై అండర్‌పాస్‌లు నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇదే రహదారిపై జనగాం వద్ద కూడా బైపాస్ రోడ్డు ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు నిర్మించాలని దీపక్ కుమార్‌ను కోరారు. భువనగిరి టీచర్స్ కాలనీ వద్ద అండర్‌పాస్ లేకపోవడం కారణంగా జరిగిన ప్రమాదాల్లో 50 కంటే ఎక్కువ మంది చనిపోయారని ఎంపీ గుర్తు చేశారు. ఇది కచ్చితంగా రోడ్డు నిర్మాణం సమయంలో జరిగిన డిజైన్ లోపమేనని, భద్రతా ప్రమాణాలను పట్టించుకోనందునే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. తన చొరవతో కొన్ని చోట్ల అండర్‌పాస్‌లు మంజూరై పనులు కూడా మొదలయ్యాయని, అండర్‌పాస్‌లు లేని చోట్ల ఈ తరహాలోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. అంతకంటే ముందు రోజు కేంద్ర వైద్యారోగ్య శాఖ అధికారులను కలిసిన బూర, తన నియోజకవర్గం పరిధిలో ఏర్పాటు చేయదల్చిన ఎయిమ్స్ గురించి ప్రస్తావించారు.

సీఎం లక్ష్యం మేరకు పనిచేస్తా

- కేసీఆర్ పాలన గొప్పగా ఉంది
- సీఎస్‌గా ఎస్‌కే జోషి బాధ్యతల స్వీకారం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు దిశ, నిర్దేశం ,లక్ష్యం మేరకు తాను పని చేస్తానని, ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వంద శాతం సక్సెస్ చేస్తామని నూతనంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన శైలేంద్ర కుమార్ జోషీ వ్యాఖ్యానించారు. తనకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం సచివాలయంలోని సీఎస్ ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. నీటిపారుదల శాఖను గూర్చి ఇంకా తెలుసుకోవాలని ఉందని వ్యాఖ్యానించి అందరినీ నవ్వించారు. ప్రభుత్వ పాలన ఎలా ఉందని ప్రశ్నించగా సీఎం చంద్రశేఖరరావు పాలన గొప్పగా ఉందని ప్రశంసించారు. విభజన సమస్యల పరిష్కారానికై దృష్టిసారిస్తామని, ఇప్పటికే ప్రాజెక్టులు, విద్యుత్, ఉద్యోగుల సమస్యలు చాలా వరకు పరిష్కారమయ్యాయని జోషీ పేర్కొన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత తలెత్తిన సమస్యలు ఎక్కువ శాతం పరిష్కారమయ్యాయని, మిగిలిన సమస్యలపై దృష్టిసారిస్తానని సీఎస్ అన్నారు. సీఎస్‌గా ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించగా.., విల్ పవర్‌తో అధిగమిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కొత్త పీఆర్‌సీ విషయం అడగ్గా...ఇప్పుడే బాధ్యతలు స్వీకరించాను...ఫైల్ చూడాలి....ప్రభుత్వానికి పంపాలి..., ఇంకా దానిపై దృష్టిసారించలేదని, పాత సీఎస్ ఎస్పీ సింగ్‌కు ఈ విషయం తెలుసునని అక్కడే ఉన్న సింగ్‌ను ఉద్దేశించి జోషీ అన్నారు. ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందన ఎలా ఉందనుకుంటున్నారన్న ప్రశ్నకు ప్రభుత్వం ప్రజల మనోభావాలకు అనుగుణంగా వెళుతోందని, అందుకే ప్రజల స్పందన బాగుందని చెప్పారు. ప్రభుత్వ పథకాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు కార్యాచరణను వేగవంతం చేయడంపైనే తన దృష్టి అని అన్నారు. ప్రభుత్వ శాఖలు, అధికారులు, సిబ్బంది ఒక టీంగా కలిసి పని చేసి ప్రభుత్వ పథకాలను అమలు చేసేందుకు కృషి చేస్తామని సీఎస్ జోషీ వివరించారు.



సీఎస్ జోషికి ప్రముఖులు, సీనియర్ అధికారుల ప్రశంసలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా శైలేంద్ర కుమార్ జోషీ (ఎస్‌కే జోషీ) బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ పదవీ కాలం 31న ముగియడంతో ఎస్‌కే జోషీని సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సచివాలయంలోని సీఎస్ కార్యాలయంలో ఆయన చీఫ్ సెక్రెటరీగా ఎస్పీ సింగ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. 2019 డిసెంబర్ ఆఖరు వరకు జోషీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉంటారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉంటూనే నీటిపారుదల శాఖ అదనపు బాధ్యతలను కూడా ప్రభుత్వం ఆయనకు అప్పగించింది. 1984 బ్యాచ్‌కు చెందిన ఎస్‌కె జోషీ ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో 1959 డిసెంబర్ 20 న జన్మించారు. పాఠశాల విద్యలో తెలుగును మూడవ మాధ్యమంగా చదవడం విశేషం. కేంద్ర సర్వీసులో 1991నుంచి 1994 , 2001 నుంచి 2006 వరకు రెండు దఫాలుగా తొమ్మిదేళ్ల పాటు డిప్యూటి డైరెక్టర్, డైరెక్టర్, జాయింట్ సెక్రెటరీ హోదాల్లో పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖలో పని చేశారు. ఐక్యరాజ్యసమితి 1992 లో నిర్వహించిన పర్యావరణ మార్పులు, 2002 లో సుస్థిరాభివృద్ధిపై రియోడిజెనీరో, జోహెన్స్ బర్గ్ లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌కె జోషీకి పెద్ద సంఖ్యలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ ఇతర అధికారులు, సాగునీటి శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో అభినందనలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించేందుకు సీఎంఓకు వచ్చిన జోషీకి జీఏడీ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శి అథర్ సిన్హా, ప్రోటోకాల్ జాయింట్ సెక్రెటరీ అరవిందర్ సింగ్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అక్కడి నుంచి సీఎస్ ఛాంబర్‌కు చేరుకుని ఎస్పీ సింగ్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె రామకృష్ణారావు సిబ్బంది ప్రత్యేకంగా వీడ్కోలు సమావేశం నిర్వహించి అభినందనలు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు పూర్తయితే రాష్ట్రం దశ, దిశ మారుతుందని చీఫ్ సెక్రెటరీగా పదవీ విరమణ చేసిన ఎస్పీ సింగ్ అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌కే జోషీకి కూడా సహకారం అందించి నవ తెలంగాణ రూపకల్పనకు సహకరించాలని కోరారు.

డిప్యూటీ సీఎంతో కొత్త సీఎస్ భేటీ

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన శైలేంద్రకుమార్ జోషీని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలోని సీఎస్ ఛాంబర్‌లో బుధవారం జోషీని కలిసి పుష్పగుచ్ఛం అందించి గుడ్ లక్ చెప్పారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు కూడా సీఎస్ ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

సీఎస్‌కు టిఎస్-ఐఐసి ఎండి శుభాకాంక్షలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలను స్వీకరించిన ఎస్‌కే జోషిని టిఎస్-ఐఐసి ఎండి ఇ.వెంకట నర్సింహారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి కోసం అమలు చేస్తున్న కార్యాచరణ ప్రణాళికలను సీఎస్‌కు వివరించారు.

సినిమా టిక్కెట్టు ధరలపై త్వరలో నిర్ణయం

ఏపీ మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయం

అమరావతి, ఆంధ్రప్రభ: సామాన్యులకు సినిమా టిక్కెట్ల ధరలు అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రివర్గ ఉప సంఘం అభిప్రాయ పడింది. బుధవారం సచివాలయంలో రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు, రాష్ట్ర హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, రోడ్లు, భవనాల శాఖా మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు, సాంఘిక సంక్షేమ మంత్రి నక్కా ఆనందబాబు సినిమా టిక్కెట్ల ధరలపై అధికారులతో సమీక్షించారు. టిక్కెట్ ధరలపై నిర్ణయానికి వచ్చే ముందు ఫిబ్రవరి 14న నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, పంపిణీదారుల సంఘాల ప్రతినిధులతో భేటీ కావాలని నిర్ణయించారు. ఆన్‌లైన్ టిక్కెట్టు అమ్మకాలపై కూడా మంత్రివర్గ ఉపసంఘం చర్చించింది. పన్ను వసూలు మరింత పారదర్శకంగా ఉండేందుకు రాష్ట్ర చలన చిత్రాభివృద్ధి సంస్థ నోడల్ ఏజెన్సీగా ఆన్‌లైన్ టిక్కెట్టు విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకున్నట్లు సమావేశంలో పేర్కొన్నారు. సమావేశంలో రెవిన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డి.సాంబశివరావు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఎ.ఆర్.అనురాధ, రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటక అభివృద్ధి సంస్థ ఎండీ ఎస్.వెంకటేశ్వర్ అధికారులు పాల్గొన్నారు.

వనజాతరలో



జనజాతర

దారులన్నీ మేడారంవైపే

- అంగరంగ వైభవంగా మహాజాతర ప్రధాన ఘట్టం
- గద్దెలకు తరలివచ్చిన వనదేవత సారలమ్మ
- జాతరంతా దారులవెంట వెల్లువలా జన ప్రవాహం
- తల్లిని దర్శించుకునేందుకు పోటెత్తిన భక్తజనం
- పూనుగొండ్ల నుండి తరలివచ్చిన పగిడిద్ద రాజు
- కొండాయి నుంచి గద్దెలకు చేరిన గోవిందరాజు

భూపాలపల్లి ప్రతినిధి, ప్రభన్యూస్ : మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ప్రధాన ఘట్టం బుధవారం రాత్రి ఆవిష్కృతమైంది. కన్నెపల్లి నుంచి జాబిలమ్మ సారలమ్మ మేడారానికి కదిలివచ్చారు. ప్రధాన ఘట్టం ప్రారంభానికి ముందు సువారుగా 40 లక్షలకు పైచిలుకు భక్తులు తరలివచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి అన్ని దారులు వనం గుండా మేడారం వైపే చేరుకున్నాయి. తల్లులను దర్శించుకోవడానికి ఆసక్తితో భక్తులు రెండు రోజుల ముందు నుంచే ఎదురుచూస్తున్నారు. మేడారానికి చుట్టుపక్కల ఎటూ పది కిలోమీటర్లు జాతరకు వచ్చిన భక్తులు గుడారాలు వేసుకుని తల్లుల రాకకోసం ఎదురుచూస్తున్నారు. బుధవారం సారలమ్మ గద్దెలకు చేరడంతో రోజూలాగానే భక్తులు తల్లులకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. పూనుగొండ్ల నుంచి బయలుదేరిన పగిడిద్ద రాజు రాత్రి గద్దెలకు చేరుకున్నారు. కొండాయి నుంచి బయలు దేరిన గోవిందరాజు గద్దెలకు చేరుకున్నారు. సారలమ్మ తల్లి గద్దెలకు చేరుకోని పగిడిదద్ద రాజు, గోవిందరాజులతో కలిసి సమ్మక్కతల్లి అనుమతితో గద్దెల పై కోలువుదీరారు.

సారలమ్మ గద్దెలకు చేరింది ఇలా...

కన్నెపల్లిలో బుధవారం ఒంటి గంట సమయంలో సారక్క ఆలయంలో పూజారులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు మేడారంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయం నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏపీఓ చక్రధర్ రావు అధికారుల లాంఛనాలతో కన్నెపెల్లిలోని సారలమ్మ ఆలయం వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు. గిరిజన సంప్రదాయాల ప్రకారం పూజారులు ఆరుగురు కాక సారయ్య, కిరణ్, కనుకమ్మ, భుజంగరావు, వెంకటేశ్వర్లు, లక్ష్మీభాయమ్మ వీరు దీప ,దూప నైవేద్యాలతో సారలమ్మను పూజించారు. ప్రభుత్వ అధికారులతో కలిసి 3 గంటల తర్వాత సారలమ్మను తీసుకుని మేడారం బయదేరారు. అప్పటికే మేడారం చేరుకుని ఎంతో ఆతృతగా ఎదిరిచూస్తు న్న భక్తులు తల్లి తరలిరావడాన్ని స్వాగతిస్తూ తన్మయత్వం తో పులకించి పోయారు. ప్రధాన ఘట్టం ఆరంభం కావడంతో జాతరంతా ఒక్కసారిగా దారివెంట జనప్రవా హంలా మారింది.

సారలమ్మ తీసుకువచ్చే పూజారి కాకసార య్యను తాకేందుకు భక్తులు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేశారు. తొక్కిసలాటకు జరుగుతున్న ప్రతిసారి పోలీసులు అప్రమత్తమై వలయంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. సారలమ్మ జంపన్న వాగు దాటే క్రమంలో భక్తులు పుణ్యస్నానాలు చేస్తూ పులకించి పోయారు. శివసత్తులు పూనకాలతో జంపన్న వాగు మార్మోగింది. మేడారంలో గద్దెల ప్రాంగ ణంలో సారలమ్మ గద్దె పై అమ్మవారిని, గోవిందరాజు, పగిడిద్ద రాజులను రాత్రి 9 గంటల సమయంలో ప్రతిష్టించారు. వన దేవతను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు.

భక్తులకు సకల సౌకర్యాలు

మేడారం మహాజాతరకు తరలివచ్చే భక్తులకు సకల సౌకర్యాలు అందదుబాటులో ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని శ్రీ సమ్మక్క - సారలమ్మ వన దేవతలను దర్శించుకున్నారు. అనంతరం ఐటీడీఏ భవనంలో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ అజ్మీరా సీతారాంనా యక్‌తో పాటు కలిసి అంతర్జాతీయ, జాతీయ, స్థానిక ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. మేడారం సమ్మక్క- సారల మ్మ మహా జాతర కుంభ మేళను తలపిస్తుందని గిరిజనులే పూజారులగా వందల సంవత్సారాల నుండి ఈ జాతర కొనసాగుతున్నదని వారన్నారు. దేశంలోని ముఖ్యంగా పది రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల్లో స్థిరపడ్డ భారతీయులు సమ్మక్క - సారలమ్మ తల్లుల దర్శనానికి తరలి వస్తారని వారన్నారు. గత జాతరలో కోటి మంది భక్తులు జాతరను సందర్శించి తల్లుల కృపకు పాత్రు లయ్యారని, ఈసారి నెల రోజుల నుంచి ఇప్పటికే సువారు 60 లక్షలకు పైగానే భక్తులు తల్లులను దర్శించుకున్నారని మరో రెండు మూడు రోజుల్లో 60 లక్షలకు పైగానే భక్తులు సందర్శి స్తారని అంచనా వేస్తున్నామన్నారు. భక్తులు జాతరను సందర్శించడానికి రాష్ట్రంలోని 23 కేంద్రాల నుంచి ఆర్టీసీ ఆధ్వర్యంలో 4,200 బస్సులు నడిపిస్తున్నామని అన్నారు. 10 నుంచి 12వేల పోలీసు సిబ్బందిని జాతర బందోబస్తు కోసం నియమించడం జరిగిం దన్నారు. నెల రోజుల నుండి జరుగుతున్న పరిస రాల పరిశుభ్రం కోసం 3వేల మంది పారిశుధ్య కార్మికులను పక్క జిల్లాల నుంచి రప్పించడం జరిగిందన్నారు. కంట్రోల్ టవర్ ఏరియాలో ఉన్న మీడియా మిత్రులతో మేడారం జాతర ఏర్పాట్ల పై వారితో



మాట్లాడు తుం డగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్ జాతరలో తప్పిపోయిన బాలుడిని తీసుకుని రాగా, అది గమనించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఆ బాలుడిని దగ్గరగా తీసుకుని వివరాలు సేకరించి, స్వయంగా మంత్రి వర్యులు మైక్ ద్వారా బాలుడి తల్లిదండ్రులకు వివరాలు తెఇపారు. ఈ బాలుడి పేరు కమ్సాలి సంతోస్ , టాటానగర్‌కు చెందినవాడని మైక్ ద్వారా మంత్రి తెలిపారు.



నేడు గద్దెలకుచేరనున్న సమ్మక్క

మేడారంలో గురువారం సమ్మక్కతల్లి చిలుకల గుట్ట నుంచి సమ్మక్క గద్దెలకు చేరనుంది. స్పెషల్ అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఇంచార్జి కలెక్టర్ కర్ణన్, ఎస్పీ భాస్కరన్ గిరిజన సంప్రదాయాల ప్రకారం, ప్రభుత్వ లాంచనాలతో, పూజారులతో కలిసి సమ్మక్క తల్లిని లక్షలాది మంది భక్తులు వెంట రాగా చిలుకల గుట్ట నుంచి మేడారంలో గద్దెల ప్రాంగణానికి తీసుకు రానున్నారు. పూజారులు పూజలు ఆచరించి గద్దెల పై చేరుస్తారు. ఉదయం చిలుకటగుట్ట నుం చి తీసుకు వచ్చిన కంకవనాన్ని గద్దెల పై ప్రతిష్ట చేస్తారు.





జాతీయ హోదా తెస్తాం

- జాతర అభివృద్ధికి రూ.80 కోట్లు కేటాయింపు
- భక్తులకు మౌళిక సదుపాయాల కల్పన
- వనదేవతలకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మొక్కులు



ప్రభన్యూస్ ప్రతినిధి, ప్రభన్యూస్ : మేడారం సమ్మక్క సారలమ్మ వన దేవతలను రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కుటుంబ సమేతంగా బుధవారం సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవాదాయశాఖ అధికారులు, జాతర ట్రస్టు బోర్డు సభ్యులు మంత్రిని గిరిజన సంప్రదాయ ప్రకారం ఆహ్వానించి పట్టువస్త్రాలతో ఘనంగా సన్మానించారు. సమ్మక్క - సారలమ్మ వన దేవతలకు మంత్రి కుటుంబ సభ్యులతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ జాతరలో ఎలాంటి అసౌకర్యాలు భక్తులకు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరితో కలిసి మూడు రోజులపాటు జాతరలోనే మకాం వేసి ఏర్పాట్లను పరిశీలిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం కాలంలో రెండు జాతరలు జరిగాయని గత జాతరకు రూ.160 కోట్లు, ఈ జాతరకు రూ.80 కోట్లు కేటాయించిన చరిత్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని వారన్నారు. మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించడమే కాకుండా జాతీయ స్థాయిలో గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో తీర్మానం చేసి సంబంధిత పత్రాలు కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖకు అందజేయడం జరిగిందన్నారు. భారత ఉప రాష్ట్రపతి కలిసి జాతరకు గుర్తింపు ఇవ్వాలని పలువురు ఎంపీలతో కలవడం జరిగిందన్నారు. జాతరకు కూడా రావాలని ఆహ్వానించడం జరిగిందన్నారు. ఫిబ్రవరి 2న భారత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో పాటు సీఎంకేసీఆర్, గవర్నర్ నరసింహన్, కేంద్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి జూయల్ ఓరంలు హాజరుకానున్నారన్నారు.

మేడారానికి 5,800 బస్సులు

ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మేడారం జాతరకు ఆర్టీసీ ఈ నెల 28 నుండి ప్రత్యేక బస్సులు నడిపిస్తుంది. బుధవారం సాయంత్రం 6 గంటల వరకు 5,800ల బస్ ట్రిప్‌లను మేడారంకు తిప్పడం జరిగిందని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు తెలిపారు. గత నాలుగు రోజుల్లోనే 2.60 లక్షల మంది భక్తులు ఆర్టీసీలో మేడారంకు రాకపోకలు జరిపారని పేర్కొన్నారు. ఫిబ్రవరి 3వ తేదీ వరకు వివిధ ప్రాంతాల నుండి ఆర్టీసీ బస్సులను తిప్పడానికి విస్తృత ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. దాదాపు 4 వేలకు పైగా బస్సులను మేడారం జాతరకు తిపఌడానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. మేడారంతో పాటుగా వివిధ ప్రధాన కేంద్రాల్లో ప్రత్యేక అధికారులను నియమించామని పేర్కొన్నారు. భక్తులకు అసౌకర్యం కలగని విధంగా మేడారంలో ఏర్పాట్లు జరిగాయన్నారు. తెలంగాణలోని అన్న ప్రధాన కేంద్రాల నుండి బస్సులు నడిపిస్తున్నామని పేర్కొన్నారు.

మార్గమధ్యంలో గర్భిణి మృతి

భూపాలపల్లి, ప్రభన్యూస్ : నిర్మల్ జిల్లా బాసర మండలం గాంధీనగర్‌కు చెందిన సాగరి సారాబాయి (35) గర్భిణీ శ్రీ సమ్మక్క - సారలమ్మ మేడారం జాతరకు వస్తున్న క్రమంలో మార్గమధ్యలో లేబర్ పేయిన్స్ (ప్రసవ నొప్పులు) రావడంతో ఈ నెల 31వ తేదీన ఉదయం 7 గంటలకు ఏటూర్‌నాగారంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో అడ్మిట్ చేయగా, అదే రోజు ఉదయం 7 గంటల 40 నిమిషాలకు నార్మల్ డెలివరి జరిగి ఆడశిశువుకు జన్మనిచ్చింది. ప్రసవానంతరం అధిక రక్తస్రావం జరుగుతుండడంతో ఆమెను వెంటనే సంబంధిత ఆసుపత్రి డాక్టర్లు ములుగు ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేయగా, అదే రోజు ఉదయం 10 గంటల 40 నిమిషాలకు ములుగు ఏరియా ఆసుపత్రిలో డాక్టర్లు పరీక్షించే సమయానికి అప్పటికే ఆమె చనిపోయినట్లు, జన్మించిన ఆడ శిశువు క్షేమంగా ఉన్నట్లు సంబంధిత డాక్టర్లు తెలిపారని జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య తెలిపారు.

జాతరలో కట్టుదిట్టమైన భద్రత

డీజీపీ మహేందర్ రెడ్డి



భూపాలపల్లి,ప్రభన్యూస్ ప్రతినిధి : మేడారం సమ్మక్క -సార లమ్మ మహాజాతరకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుం డా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టినట్లు డీజీపీ మహేందర్ రెడ్డి అన్నారు. బుధవా రం జయశంకర్ భూపాల పల్లి జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం మహాజాతరను సందర్భించి భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుండి హెలీకాప్టర్‌లో వచ్చిన డీజీపీ మహేందర్ రెడ్డి పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతరలో శాంతి భద్రతల పరిరక్షణకు, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సజావుగా భక్తులు తల్లులను దర్శించుకునేందుకు పదివేలకు పైగా పోలీసులను విధుల్లో నియమించినట్లు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులు సంపూర్ణ సహకారం అందించాలని వారు కోరారు. జాతర ప్రధాన ఘట్టం సందర్భంగా కొంత ఇబ్బందులు జరిగినా మరో మూడు రోజుల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట ఐజీ నాగిరెడ్డి, ఎస్పీ ఆర్ భాస్కరన్,ఓఎస్డీ రాజమహేంద్రా నాయక్, ఏఎస్పీ రాహుల్ హెగ్డే తదితరులు ఉన్నారు.

బడ్జెట్ వేళ..ఎర్ర పెట్టె

కేంద్ర బడ్జెట్ ప్రక్రియలోని వివిధ సంప్రదాయాలు, ఆసక్తికర వాస్తవాలు ఎన్నో ఉన్నాయి. హల్వా వేడుక మొదలు ముదురు ఎరుపు రంగు సూట్‌కేస్ దాకా బడ్జెట్ సంప్రదాయంలో భాగంగా ఉన్నాయి. బడ్జెట్ రోజు పార్లమెంటుకు బయలుదేరే ముందు ఆర్థిక మంత్రి ముదురు ఎరుపు రంగు లెదర్ సూట్‌కేసును చూపించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సంప్రదాయం 18వ శతాబ్దంలో బ్రిటీషు సామ్రాజ్యం నాటిది. దీని పట్ల భారత్ కూడా మక్కువ చూపిస్తూ వస్తోంది. నేటికీ మనదేశంలో ఈ సంప్రదాయం బడ్జెట్ రోజు ప్రస్ఫుటమవుతున్నది.

సూట్‌కేసు చరిత్ర

ప్రప్రథమంగా 1960లో ఈ తరహా బడ్జెట్ పెట్టెను నాటి బ్రిటన్ చాన్స్‌లర్ కోసం రూపొందించారు. ఆ తర్వాత విలియం ఇవార్ట్ గ్లాడ్‌స్టోన్ హయాంలో, లెదర్ కవర్ అతికించిన చెక్క పెట్టెలో బడ్జెట్ ప్రతులను తీసుకొచ్చారు. పెట్టెపై భాగంలో మూడు వరుసల్లో నల్లని గీతలతో డిజైన్ ఉండేది. దీనికంటే ముందు, చాన్స్‌లర్లు ఆర్థిక పాలసీ ప్రకటను లెదర్ బ్యాగుల్లో సాధారణ సభకు తీసుకొచ్చేవారు. సుదీర్ఘ ప్రసంగానికి అనుగుణంగా డాక్యుమెంట్లను భద్రపరిచేందుకు పెట్టెను అందుబాటులో ఉంచాలని గ్లాడ్‌స్టోన్ ఆదేశించినట్లు చరిత్ర



చెబుతున్నది.బడ్జెట్ అనే పదం బౌగెట్టె అనే ఫ్రెంచి పదం నుంచి వచ్చింది. బౌగెట్ అంటే చిన్న సంచి అని అర్థం. కాలక్రమంలో దీనిని బ్రిటన్‌లో బడ్జెట్ పెట్టెగా

వేర్వేరు ఆర్థిక మంత్రులు, వేర్వేరు నమూనాలు...

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో బడ్జెట్ రోజు సూట్‌కేసు పట్టుకునే సంప్రదాయానికి భారత్‌లో తొలి ఆర్థికమంత్రి ఆర్.కె.షన్ముఖం శెట్టి శ్రీకారం చుట్టారు. 1947 నవంబర్ 26న ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. మన్మోహన్ హయాంలో గ్లాడ్‌స్టోన్ తరహా బాక్సును ఉపయోగించేవారు. కాకుంటే నలుపు రంగులో ఉండేది. చిదంబరం కూడా బ్రిటీషు నమూనా సూట్‌కేసునే చేపట్టారు.1998-99 కాలంలో యశ్వంత్ సిన్హా నల్లరంగు లెదర్ బ్యాగును వాడారు. దానికి బకెల్స్, తొడుగులు ఉండేవి. యూపీఏ వ్యవహరించారు. ఇప్పటికీ భారత్ ఈ పెట్టెలో బడ్జెట్ ప్రతులను ఉంచే సంప్రదాయాన్ని పాటిస్తున్నది.

♦ బ్రిటన్‌లో ఓ సంప్రదాయం ఉండేది. అధికారంలో నుంచితప్పుకుంటున్న చాన్స్‌లర్ తదుపరి చాన్స్‌లర్‌కు ఎర్రపెట్టెను ఇవ్వడం ఆనవాయితీ. అయితే 2011లో జార్జ్ ఒస్బోర్న్ హయాంలో ఈ బాక్సును మార్చివేశారు. కొత్త బాక్సును ప్రవేశపెట్టారు. నాటి బాక్సు మరీ పాతదై, చిరుగులు పట్టడంతో కొత్తదాన్ని సిద్ధంచేశారు. అయితే, బ్రిటన్‌లో మాదిరిగా తదుపరి ఆర్థికమంత్రికి ఎర్రపెట్టెను ఇచ్చే ఆనవాయితీ లేకున్నా, బడ్జెట్‌నాడు మాత్రం ఎర్రపెట్టెను ఆర్థికమంత్రి చేబూనడం కొనసాగుతున్నది.

బడ్జెట్ వేళ్లలో మార్పులు..

♦ 21వ శతాబ్దంలో బడ్జెట్ ప్రవేశపెట్టడంలో చిన్నచిన్న మార్పులు చోటుచేసుకున్నాయి. 2001లో యశ్వంత్ సిన్హా ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రవేశపెట్టారు. అంతకు ముందు వరకు సాయంత్రం 5గంటలకు ప్రవేశపెట్టే సంప్రదాయం ఉండేది. బ్రిటీషు కాలం నుంచి వస్తున్న ఆచారాన్ని యశ్వంత్‌సిన్హా బ్రేక్ చేశారు. అప్పట్లో లండన్‌లోనూ, ఢిల్లీలోనూ ఒకే సమయంలో బడ్జెట్ పార్లమెంటుకు వచ్చేది.

♦ 1982లో సుమారు 1.35 గంటలపాటు ప్రణబ్ బడ్జెట్ ప్రసంగం వినిపించారు. అప్పట్లో పొట్టి ఆర్థికమంత్రి సుదీర్ఘ ప్రంసంగంగా నాటి ప్రధాని ఇందిరా గాంధీ కొనియాడారు. ఆ తర్వాత 1991లో సంస్కరణల పర్వంలో వచ్చిన బడ్జెట్ ప్రసంగాన్ని మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టారు. దాదాపు రెండు గంటలు ఏకబిగిన ప్రసంగ పాఠం వినిపించారు. ఈ రికార్డులను 2003లో జశ్వంత్ సింగ్ తిరగరాశారు. రెండు గంటలకు పైగా ప్రసంగం చేశారు.



హయాంలో ఆర్థికమంత్రిగాఉన్న ప్రణబ్ ముఖర్జీ తిరిగి ఎరుపు రంగు సూట్‌కేసును వెలుగులోకి తెచ్చారు. ప్రస్తుత ఆర్థికమంత్రి జైట్లీ 2015నుంచి ట్యాన్ సూట్‌కేసునే వాడుతున్నారు.





పద్దుకు వేళాయె..

- నేడు పార్లమెంటులో కేంద్ర బడ్జెట్ ● ఉదయం 11 గం॥కు ప్రవేశపెట్టనున్న అరుణ్ జైట్లీ ● ఎన్నికల బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి ● వ్యవసాయానికి పెద్దపీట!

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : లోక్‌సభ ఎన్నికలకు ముందు నరేంద్రమోడీ ప్రభుత్వం పూర్తి స్థాయి ఆఖరి సాధారణ బడ్జెట్ నేడు ప్రవేశపెట్టనుంది. గురువారం ఉదయం 11గంటలకు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ముహుర్తం ఖరారైంది. మహారాష్ట్ర ఎంపీ చింతమాన్ వనగా (67) బుధవారం ఆకస్మికంగా చనిపోయిన నేపథ్యంలో సభ ఆయనకు నివాళి అర్పించిన అనంతరం బడ్జెట్ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. గత ఏడాది కూడా బడ్జెట్ సమయంలోనే ఓ ఎంపీ చనిపోవడంతో సంతాపం ప్రకటించిన అనంతరం బడ్జెట్‌ను కొనసాగించారు.

వరుసగా అయిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన అయిదో ఆర్థిక మంత్రిగా అరుణ్‌జైట్లీ రికార్డులకెక్కున్నారు. ఇప్పటిదాకా మొరార్జీదేశాయ్, మన్మోహన్‌సింగ్, యశ్వంత్ సిన్హా, చిదంబరం మాత్రమే వరుసగా అయిదుకు మించి బడ్జెట్లు ప్రవేశపెట్టారు. ఎన్నికల ఏడాది 2018-19 సంవత్సరానికి గాను ప్రవేశపెడుతున్న ఈ బడ్జెట్‌లో ప్రజాకర్షక పథకాలకు, గ్రామీణ, వ్యవసాయరంగాలకు, ఆదాయపుపన్ను మినహాయింపు తదితర అంశాల్లో సామాన్యుడికి ఊరట కల్పిస్తారనే అంచనాలు వినిపిస్తున్నాయి. జీఎస్టీ అమలు తర్వాత ప్రవేశపెడుతున్న బడ్జెట్ స్వరూపం ఎలా ఉంటుందనేది అందరిలోనూ ఆసక్తి నెలకొంది. అయితే మధ్య తరగతి ప్రజలకు మేలు చేసే విధంగా వ్యక్తిగత ఆదాయపు పన్ను పరిమితిని పెంచుతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఎన్నికల బడ్జెట్ కావడంతో మోడీ తన స్వభావానికి విరుద్ధంగా సామాన్యులపై వరాల వాన కురిపిస్తారేమోనని ఆశిస్తున్నారు. అన్ని రంగాల నుంచి ఈ బడ్జెట్‌పై భారీగా ఆశలు నెలకొన్నాయి. జిడిపి వృద్ధి రేటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో 77.5శాతంగాఉంటుందని అంచనాలు వేసిన నేపథ్యంలో సామాన్యులకు ఊరట కల్పిస్తారని ఆశిస్తున్నారు. బడ్జెట్ తయారీ వెనుక పెద్ద కసరత్తు దాగి ఉంటుంది. బడ్జెట్ పత్రాల రూపకల్పనకు రెండు నెలల ముందు నుంచే ఈ ప్రక్రియ కొనసాగుతున్న నార్త్‌బ్లాక్ ఆర్థిక శాఖ కార్యాలయంలో నిషేధాజ్ఞలు అమలవుతాయి. ఇందులో భాగస్వాములయ్యే వారిని కూడా చివరి దిశలో కార్యాలయంలోనే ఉండేలా ఏర్పాట్లు చేసస్తారు. పూర్తి నిఘా మధ్యలో అత్యంత రహస్యంగా ఈ బడ్జెట్ పత్రాలు తయారవుతాయి.

రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసేందుకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్రపతి ప్రసంగంలో వెల్లడించడంతో ఆ రంగానికి ఈ బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయిస్తారని అంచనా వేస్తున్నారు. వ్యవసాయరంగాన్ని చేయూతనిచ్చేందుకు పలు చర్యలు ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గుజరాత్ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి బాగా దెబ్బతిన్న నేపథ్యంలో రైతులపై వరాల జల్లు కురిపించే అవకాశాలున్నాయి. అలాగే ఉపాధికల్పన కోసం భారీగా పెట్టుబడులు ఆకర్షించేందుకు అవసరమైన ఆర్థికచర్యలు ప్రకటిస్తారని ఆర్థికరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

రైల్వే భద్రతపై దృష్టి

రైల్వే రంగానికి సంబంధించినంత వరకు భద్రతకు పెద్దపీట వేస్తారని అంచనా వేస్తున్నారు. ఇటీవల కాలంలో భారీ రైలు ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో దిద్దుబాటు చర్యల కోసం భద్రతకు నిధులు కేటాయిస్తారని తెలిసింది. అలాగే అన్ని రైళ్లలో సిసిటీవీలు అమర్చేందుకు భారీగా నిధులు వెచ్చించనున్నట్లు సమాచారం. రైల్వేల కోసం సాధారణ బడ్జెట్ నిధులపై ఆధారపడకుండా అంతర్గతంగా సమకూర్చుకోవాలని రైల్వేశాఖ నిర్దేశించుకుంది. రైల్వే మౌలిక సదుపాయాలను భారీస్థాయిలో అభివృద్ధి చేసే దిశగా చర్యలు ప్రకటించే అవకాశముంది.

తొలిసారి హిందీలో..

న్యూఢిల్లీ: ఇప్పటి వరకు బడ్జెట్‌ను ఇంగ్లీష్ భాషలో ప్రవేశపెట్టేవారు. గ్రామీణులు, వ్యవసాయదారులకు దీన్ని అర్థం చేసుకోవడం కొంత ఇబ్బందిగా ఉండేది. దీన్ని అధిగమించడానికి బీజేపీ ప్రభుత్వం ఓ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టబోతోంది. రేపు ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ హిందీలో చదవనున్నారు. దీంతో హిందీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తొలి ఆర్థిక మంత్రిగా అరుణ్ జైట్లీ నిలవనున్నారు. రేపు ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌కి మరికొన్ని ప్రత్యేకతలు కూడా ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ ప్రభుత్వ చివరి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే. అలాగే వస్తు, సేవల పన్ను అమల్లోకి వచ్చాక ప్రవేశపెట్టనున్న తొలి బడ్జెట్‌గా కూడా ఇది నిలవనుంది.

రూ. 5 వేల కోట్లతో ద.మ. రైల్వే ప్రతిపాదనలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దక్షిణ మధ్య రైల్వే 2018 - 19 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ. 5 వేల కోట్లకు పైగా ప్రతిపాదనలను కేంద్రానికి అందచేసింది. 2017 -18లో రూ. 3,034 కోట్ల పనులకు ఆమోదం పొందింది. అంతుకు ముందు సంవత్సరం రూ. 2,134 కోట్లతో వివిధ పనులు చేపట్టడానికి కేంద్రం అంగీకరించింది. ఉభయ తెలుగు రాష్ట్రాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున కొత్త రైలు మార్గాలు, ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపర్చడం పైన ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ జోన్ పరిధిలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహరాష్ట్ర, కర్ణాటక పార్లమెంటు సభ్యులతో సమావేశమై నియోజక వర్గాల వారిగా ప్రతిపాదనలు స్వీకరించారు. వాటినన్నింటిని క్రోడీకరించి వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రాధాన్యతలతో ప్రదిపాదనలు కేంద్రానికి నివేదించారు. బడ్జెట్‌లో అత్యధిక ప్రతిపాదనలకు నిధులు కేటాయించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. కొత్త రైల్వే లైన్లు, ట్రాక్‌లు, ఇప్పటికే తిరుగుతున్న కొన్ని రైళ్ల పొడిగింపు, అదనపు స్టేజీలు, అదనపు స్లీపర్ కోచ్‌లు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, రోడ్ అండర్ బ్రిడ్జీలు, విద్యుదీకరణకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్రానికి నివేదించారు.

రైతుకు దన్ను... తక్కువ పన్ను

- వైద్యం, విద్యకు అధిక కేటాయింపులు ● జైట్లీ పద్దుపై ప్రజల ఆకాంక్ష

న్యూఢిల్లీ: కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్ ఎలా ఉండాలి? ఏయే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి? సామాన్య మధ్యతరగతి ప్రజానీకం మొదలు సంపన్నులు, ఉద్యోగులు, మహిళలు, పారిశ్రామికవేత్తలు జైట్లీ పద్దునుంచి ఏం కోరుకుంటున్నారనే అంశాలపై జాతీయ స్థాయిలో నిర్వహించిన ఓ సర్వేలో ప్రజలు తమ మనోభావాలను వెల్లడించారు. మెజార్టీ ప్రజలు తక్కువ పన్నులు.. పారదర్శక ఇంధన పాలసీ.. వ్యవసాయానికి ప్రోత్సాహం అవసరమని అభిప్రాయపడ్డారు. సర్వేలో యువ ఉద్యోగులు (35శాతం), విద్యార్థులు (5శాతం), వృద్ధులు (33శాతం), రిటైర్డ్ ఉద్యోగులు (10శాతం), ఇతరులు (9శాతం), వ్యాపార, వాణిజ్య (8శాతం) రంగాలకు చెందిన వారి తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు.

- ఎవరికి ఎక్కువ మేలు జరిగే అవకాసం ఉందన్న ప్రశ్నకు 65 శాతం మంది 'వేతన జీవులు, మధ్యతరగతికి' లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. కాగా, 28 శాతం మంది మాత్రం రైతులు, వ్యవసాయ కార్మికులకు లబ్ధి చేకూరుతుందని అంచనా వేశారు.
- ఇంధనంపై పన్ను పాలసీ విధానాన్ని పూర్తిగా ఎత్తివేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రస్తుత విధానం నుంచి దీన్ని తొలగించి, పన్ను వ్యవస్థలో మార్పులు తేవడం ద్వారా మరింత పారదర్శకతకు దారులు వేయాలని కోరుతున్నారు. అసలు దీన్ని జీఎస్టీ పరిధిలో తేవడమే అసలైన పరిష్కారమని 63 శాతం మంది స్పష్టం చేశారు.
- ఇక కీలకమైన ఆదాయపన్ను పరిమితిని పెంచాలన్నదే అత్యధికుల వాదన. ప్రస్తుతం ఉన్న గరిష్టపరిమితి లోని 10-15 లక్షల శ్లాబ్‌ను పెంచాలని 40శాతం మంది సూచిస్తున్నారు. అదేసమయంలో 2.5-5 లక్షల శ్లాబ్‌ను మరింత పెంచాలని 36శాతం మంది అభిలషిస్తున్నారు. సెక్షన్ 80 సి కింద పన్ను రాయితీని 1.5 లక్షలకు విస్తరించాలని 46 శాతం మంది డిమాండ్ చేస్తున్నారు. ఆదాయపన్ను వడ్డింపులు తక్కువగా ఉండాలని దాదాపు 80 శాతం మంది ప్రజలు కోరుతున్నారు. ఇదిలావుండే దేశం కోసం మరిన్ని పన్నులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని 4 శాతం మంది పేర్కొనగా, 13 శాతం మంది మాత్రం ప్రస్తుత పన్ను శ్లాబుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.
- తక్కువ పన్నులపై భారీ ఆశలున్నాయి. 37 శాతం మంది గరిష్ట పన్ను 25శాతానికి దిగొస్తుందని అంచనా వేస్తుండగా, ప్రస్తుత ఆదాయపన్నుతోపాటు కార్పొరేట్ పన్నులు దిగొస్తాయని 25శాతం మంది పేర్కొన్నారు.



- చైనా, ఇతర పొరుగు దేశాలతో పోల్చుకుంటే పన్ను రేటు పోటీని ఎదుర్కొంటుందని 19శాతం మంది తెలిపారు. 14శాతం మంది మాత్రం ఎలాంటి మార్పులు అవసరం లేదన్నారు. 5శాతం మంది పన్నులు పెరగాలని ఆకాంక్షిస్తున్నారు.
- మొత్తం సర్వేలో మరో ప్రాధాన్యతాంశం ఏమంటే వృద్ధులకు ఆరోగ్య రక్షణ. సర్వేలో ఈ అంశానికి సంపూర్ణ మద్దతు లభించింది. దీంతోపాటు వైద్య ఆరోగ్యానికి పెద్దమొత్తంలో కేటాయింపులు ఉండాలన్న డిమాండ్లు వినిపించారు. వ్యవసాయం, ఆరోగ్య రంగాలకు ఆర్థికమంత్రి పెద్దపీట వేయాలని కోరారు.
- సీనియర్ సిటిజన్లకు దన్నుగా నిలిచేలా సులభతర ఆరోగ్య పాలసీ ఉండాలని 44శాతం సూచిస్తున్నారు. వారి ఆదాయంలో గరిష్టభాగానికి పన్ను లేకుండా చూడాలని 36శాతం మంది పేర్కొన్నారు. ప్రయాణాల్లో రాయితీలు ఉండాలని సూచిస్తున్నారు.
- క్రిప్టోకరెన్సీపై ప్రభుత్వం స్పష్టత ఇస్తుందని ఎక్కువ మంది భావిస్తున్నారు. బిట్‌కాయిన్, ఇతర క్రిప్టోకరెన్సీపై స్పష్టత వస్తుందని 40 శాతం మంది ఆశిస్తుండగా, దీన్ని చట్టబద్ధం చేయాలని 24 శాతం కోరుతున్నారు.
- వైద్యం, విద్య, విద్యుత్, విద్యుదీకరణ, రక్షణ, రైల్వే రంగాలకు అదనంగా నిధుల కేటాయింపు ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వైద్యానికి జైట్లీ పెద్దపీట వేస్తారని 42శాతం, విద్యకు ప్రాధాన్యత ఉంటుందని 35శాతం మంది చెప్పారు. రక్షణరంగ కేటాయింపులకు 8శాతం మంది మద్దతు పలికారు.
- జీఎస్టీ శ్లాబుల కుదింపు అంశానికి అనుకూలంగా జైట్లీ నిర్ణయం ఉంటుందని 45 శాతం మంది పేర్కొనగా, ఈ నిర్ణయాన్ని కౌన్సెల్‌కే వదిలేస్తారని 42శాతం మంది అభిప్రాయపడ్డారు. ఇటీవల కాలంలో చేపట్టిన మార్పులు సరిపోతాయని 7శాతం మంది చెప్పారు.
- రానున్న బడ్జెట్ అంచనాల్లో తయారీ రంగం జీడీపీకి ఊతమిస్తుందని 39 శాతం మంది, దేశీయ వినిమయం ప్రభావితం చేస్తుందని 29శాతం మంది, సేవారంగవృద్ధి కీలకం అవుతుందని 12శాతం మంది చెప్పుకొచ్చారు.

తెర వెనుక సూత్రధారులు

- బడ్జెట్ రూపకల్పనలో హేమాహేమీలు

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వచ్చే నెల ఒకటవతేదీన ప్రస్తుత ప్రభుత్వపు ఆఖరి సాధారణ బడ్జెట్ సమర్పించడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బడ్జెట్‌పై అంచనాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. బృహత్తరమైన బడ్జెట్ రూపకల్పనను ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి హస్‌ముఖ్ అధియా నేతృత్వంలో కొత్త జట్టు చేపట్టింది. ఆర్థిక వ్యవహారాలు, బ్యాంకింగ్, వ్యయ విభాగాలకు కొత్త కార్యదర్శులు నియమితులయ్యారు. ద్రవ్యసంబంధిత అప్రమత్తతతో కూడుకున్న పంథాలో కొనసాగుతూనే ఆర్థిక వ్యవస్థను ఉద్దీపనపరచడంలో జైట్లీ అంచనాలను కొత్త బృందం చేరుకుంటుందా అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఈ నేపథ్యంలో బడ్జెట్ రూపకల్పనలో కీలక వ్యక్తుల సంక్షిప్త పరిచయం



హస్‌ముఖ్ అధియా
(కేంద్ర ఆర్థిక శాఖ, రెవెన్యూ విభాగ కార్యదర్శి)

ఆర్థిక మంత్రిత్వ శాఖలో అత్యంత అనుభవశాలి. గతం లో అనేక బడెట్లను చూసినప్పటికీ బడ్జెట్ రూపకల్పన బృందానికి నేతృత్వం వహించడం ఇదే తొలిసారి. 1981 గుజరాత్ క్యాడర్‌కు చెందిన ఐఎఎస్ అధికారి. వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) వెనుక కీలకమైన చోదక శక్తుల్లో ఒకరిగా సుపరిచితులు. నోట్ల రద్దు అనంతరం ప్రభుత్వం నల్లధనం వ్యతిరేక ఎజెండా చేపట్టడం లోనూ, పన్నుల చెల్లింపును సులభతరం చేయడం లోనూ కీలక పాత్ర పోషించారు. ప్రపంచ బ్యాంక్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగుల్లో భారత్ మెరుగుదలకు అది ఉపకరించింది. కలగాపు లగమై పోయినవాటన్నింటిని నిర్ణాయకమైన బడ్జెట్‌లో చేర్చడం ఆయన ముందున్న పెనుసవాలు.



అరవింద్ సుబ్రమణియన్
చీఫ్ ఎకనమిక్ అడ్వయిజర్

బడ్జెట్ ప్రకటన సందర్భంగా అరవింద్ సుబ్రమణియన్ ఆధ్వర్యంలో ఆర్థిక సర్వే విడుదల వుతుంది. అందులో అంశాలు చర్చకు దారితీయడం సర్వసాధారణమైపోయింది. చిట్టచివరిదిగా పేదరిక నిర్మూలనకు ఉపకరించే ఒక పనిముట్టుగా సార్వజనీన కనీస ఆదాయం ఉంది. దీనికి బడ్జెట్‌లో చోటు దొరుకుతుందా? ప్రస్తుతం ఆయన ఒక సంవత్సర కాలం కొనసాగింపుతో పదవీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు ఈసారిదే చివరి ఆర్థికసర్వే కావొచ్చు. కునారిల్లుతున్న వ్యవసాయ రంగానికి కొన్ని పరిష్కారాలు సూచించవచ్చు. ఆర్థిక వ్యవస్థకు ఊతంగా ద్రవ్య సంబంధిత ఉపకరణాలను గొప్పగా వినియోగించడానికి అరవింద్ కృషి చేస్తున్నారు.



సుభాష్‌చంద్ర గార్గ్
ఆర్థిక వ్యవహారాల విభాగం కార్యదర్శి

ఈ పదవిని చేపట్టడానికి ముందు వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంక్ కార్యనిర్వాహక డైరెక్టర్ గా పనిచేశారు. వృద్ధి పునరుద్ధరణ, ప్రైవేట్ పెట్టుబడులకు పున: ఉద్దీపణ, ఉద్యోగాల కల్పన గార్గ్ ముందున్న లక్ష్యాలు. అయితే ద్రవ్య సరళతపై రాజీలేకుండా వీటన్నింటిని సాధించాల్సి ఉంటుంది.



అజయ్ నారాయణ్ ఝా
వ్యయ విభాగం కార్యదర్శి

మణిపూర్ క్యాడర్ 1982 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. వ్యయ నియంత్రణలో ఘనాపాఠి. గతంలో ఇదే విభాగంలో, ఫైనాన్స్ కమిషన్‌లో పనిచేసి నందున కుదురదు అని చెప్పడంలో నేర్పరి. అయితే ఈసారి ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒకటి ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. కనుక వ్యయంపైనే దృష్టి ఉంటుంది.



నీరజ్‌కుమార్ గుప్తా

పెట్టుబడి, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం కార్యదర్శిఈ 1981 బ్యాచ్ ఐఏఎస్ అధికారి పన్నిన పెట్టుబడుల ఉపసం హరణ వ్యూహం ప్రభుత్వానికి ఫలాల ను అందించింది.

ప్రభుత్వం తొలిసారిగా పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని పెంచింది. వ్యూహాత్మక విక్రయాలు, ఇతర ప్రభుత్వ తాయిలాల కోసం బహుముఖ అనుమతులతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి గమనాన్ని సిద్ధం చేశారు. ప్రభుత్వం వనరుల సేకరణ కోసం భారీ లక్ష్యాన్ని నిర్దేశించవచ్చు.



రాజీవ్‌కుమార్
ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి

దివాలా చట్టం అమల్లోకి రావడానికి తోడు రూ.2.11 లక్షల కోట్ల ఔషధ ప్రణాళికను ప్రకటించడంతో ప్రభుత్వం తదుపరి విడత బ్యాంకుల సంస్కరణలకు సమాయత్తం కావాల్సి ఉంటుంది. సత్ఫలితాలను ఇస్తున్న బ్యాంకులకు మూలధనాన్ని పెంచుతూనే బ్యాంకుల్లో పటిష్టతకు ఊతం, మానవవనరుల పెంపుదలపై దృష్టిని కొనసాగించాలి. విస్తరణ స్థాయులను పైకి తెచ్చే క్రమంలో ఈ 1984 బ్యాచ్ ఐఏఎస్ అధికారి బీమా, పింఛను రంగాలపై కూడా దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు పరిశ్రమలకు మరీ ముఖ్యంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రుణాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

కేంద్ర బడ్జెట్ ఎలా రూపొందిస్తారంటే..!!

మరికొద్ది గంటల్లో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంటులో 2018-19 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్ట బోతున్నారు. నరేంద్ర మోడీ సార్థ్యంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఇది ఐదవ బడ్జెట్. మోడీ సర్కార్ పూర్తిస్థాయి చివరి పద్దు కూడా ఇదే. దానికితోడు పెద్దనోట్ల రద్దు, జీఎస్టీప్రతికూల ప్రభావాల తర్వాత వస్తున్న బడ్జెట్. ఈ నేపథ్యంలో రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల సమతుల్య మేళవింపు జైట్లీ బృందానికి సవాల్‌గా నిలవనుంది. 2018లో ఎనిమిది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు మాత్రమే కాకుండా, 2019లో జరగనున్న 17వ సార్వత్రిక పోలింగ్‌కు ఎన్డీయే ప్రభుత్వం సన్నద్ధం కావాల్సి ఉంది. అందువల్ల ఈ బడ్జెట్‌ను కేవలం ఆదాయ, వ్యయాల గణింపు, కేటాయింపుల ప్రకటనగా గాక, ఎన్డీయే ప్రభుత్వ ఆర్థిక విధానాలను ప్రతిబింబిందే పద్దుగా నిలుస్తుంది. ఇంతటి బృహత్తర ఘట్టాన్ని సుదీర్ఘ సంక్లిష్ట ప్రక్రియగా పేర్కొనవచ్చు. బడ్జెట్ రూపకల్పనలో వివిధ దశలతోపాటు ప్రత్యేకతలను పరిశీలిద్దాం.

1) కొత్త సంప్రదాయం అమల్లోకి వచ్చిన తర్వాత ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం వరుసగా ఇది రెండో ఏడాది. గతంలో ఫిబ్రవరి 28న కేంద్ర వార్షిక పద్దును ప్రవేశపెట్టేవారు. అనాదిగా వస్తున్న ఈ సంప్రదాయానికి మోడీ ప్రభుత్వం స్వస్తి చెప్పింది. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా రైల్వే, సాధారణ సంయుక్త బడ్జెట్‌ను ఆర్థికమంత్రి జైట్లీ ప్రవేశపెడతారు.

2) ఏయే రంగాలకు ప్రాధాన్యమివ్వాలి? వేటికి ఎంతెంత కెటాయింపులు ఉండాలి? తదితర అంశాలపై సుదీర్ఘ కసరత్తును ఆర్థిక శాఖ నిర్వహిస్తుంది. ఆర్థికవేత్తలు, నిపుణులతోపాటుగా, మంత్రి మండలి సభ్యులతో చర్చిస్తుంది. సంబంధిత మంత్రిత్వశాఖల ప్రతిపాదనలపై అవగాహనకు వచ్చిన పిదప, రాబడులు, కేటాయింపులపై ఆర్థిక మంత్రిత్వశాఖ బడ్జెట్‌ను రూపొందిస్తుంది.

3) రెండు నెలల ముందుగానే, అంటే డిసెంబర్ మాసంలోనే ప్రభుత్వం బడ్జెట్ ముందు కసరత్తు ప్రారంభిస్తుంది. వివిధ వర్గాలతో, మంత్రులతో సంప్రదింపులు జరుపుతుంది. వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, బ్యాంకులు, వ్యవసాయవేత్తలు, ఆర్థికవేత్తలు, పారిశ్రామిక గ్రూపులతో వేర్వేరుగా సమావేశం అవుతుంది. వారి వారి డిమాండ్లను ప్రతిపాదనలుగా స్వీకరిస్తుంది. సలహాలు, సూచనలను తీసుకొంటుంది.

4) ప్రభుత్వ ప్రాధమ్యాలను ప్రతిబింబించేలా రూపొందిన ముసాయిదా ప్రతిని ఆర్థికమంత్రి నేరుగా ప్రధానమంత్రికి నివేదిస్తారు. కీలక ప్రతిపాదనలపై చర్చించి ఒక నిర్ణయానికి వస్తారు. ప్రధాని సలహాల మేరకు తుదిదశలో మార్పులు చేర్పులు చేస్తారు.

5) ఇక బడ్జెట్ తయారీ ప్రక్రియ అంతా అత్యంత రహస్యంగా జరుగుతుంది. ఇందుకు కేంద్ర బిందువైన ఆర్థికశాఖ విభాగం ఉండే నార్త్‌బ్లాక్ వద్ద ఆంక్షలు విధిస్తారు. ప్రసారమాధ్యమాల ప్రతినిధులను సైతం ఇటువైపు అనుమతించరు. డిసెంబర్ మొదటి వారం నుంచే ఇక్కడ నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.

6) బడ్జెట్ పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి వారం ముందు, ఈ ప్రక్రియలో భాగస్వాములైన ముఖ్య అధికారులు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోతారు. అంటే ఇంటికి కూడా వెళ్లకుండా, ఫోన్లకు దూరంగా నార్త్‌బ్లాక్‌కే పరిమితం అవుతారు. ఇక్కడి మొదటి అంతస్తులో బడ్జెట్ ప్రతుల ముద్రణ చేపడతారు.

7) కేంద్ర ప్రసార, సమాచార విభాగం పత్రికా ప్రకటన ప్రతుల రూపకల్పనలో నిమగ్నం అవుతుంది. హిందీ, ఆంగ్లం, ఉర్దూలో వీటిని ముద్రించడంపై దృష్టిసారిస్తుంది. బడ్జెట్ రోజు పార్లమెంటు సమావేశాలకు ముందు బడ్జెట్ సారాంశాన్ని కేంద్ర కేబినెట్‌కు వివరిస్తారు.

బడ్జెట్ వ్యవహారిక పదాలు

మూలధన వ్యయం (కేపిటల్ అండ్ రెవెన్యూ ఎక్స్‌పెండిచర్): ఇందులో రెండు రకాల వ్యయాలు ఉంటాయి. ఒకటి ఆస్తులను సమీకరించని వ్యయాలు. ఇందులో సబ్సిడీలు, వడ్డీ చెల్లింపులు వంటివి ఉంటాయి. రెండవది అస్సెట్ సహిత వ్యయాలు. ఇందులో రహదారులు, భవనాలు, ప్రాజెక్టులు, రాష్ట్రాలకు ఇచ్చే రుణాలు ఉంటాయి.

రాయితీలు (సబ్సిడీలు) : నగదు ప్రోత్సాహకాలు. పేదరికం అనుభవిస్తున్న వ్యక్తులు లేదా కుటుంబాలకు కేంద్రం సబ్సిడీల రూపంలో సాయం అందిస్తుంది. పరిశ్రమలు కూడా రాయితీలు పొందుతుంటాయి. పన్ను తగ్గింపు చర్యలతో ప్రభుత్వం ఈ రంగాన్ని ప్రోత్సహిస్తుంది. పారిశ్రామికీకరణ, ఉద్యోగ కల్పన లక్ష్యంగా పరిశ్రమలకు రాయితీలు ఇస్తుంది.

జీడీపీ (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్): దీనిని స్థూల దేశీయ ఉత్పత్తిగా పేర్కొంటారు. దేశ ఆర్థికవ్యవస్థలోని అన్ని ఉత్పాదక రంగాల నుంచి వచ్చిన రాబడులను కేంద్ర గణాంకాల కార్యాలయం లెక్కిస్తుంది. దీనిని జీడీపీగా వ్యవహరిస్తారు.


పన్ను రాబడులు(ట్యాక్స్ రెవెన్యూ): ప్రభుత్వానికి ప్రాథమిక ఆదాయ వనరు పన్నులు. వ్యక్తులు, లేదా సంస్థల ఆదాయాలపై పన్నులు (ప్రత్యక్ష పన్నులు), జీఎస్టీ (పరోక్ష పన్నులు) రూపంలో ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకుంటుంది.

ద్రవ్యలోటు (ఫిస్కల్ డెఫిసిట్): ఆదాయ - వ్యయాల మధ్య అంతరాన్ని భర్తీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేసిన అప్పులు.

పన్నేతర రాబడి (నాన్ ట్యాక్స్ రెవెన్యూ): పన్నుల రూపంలో కాకుండా ఇతర మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గం. వడ్డీలు, స్పెక్ట్రం వేలం, ప్రభుత్వ సంస్థల్లో వాటాల విక్రయం వంటి ప్రక్రియలు పన్నేతర రాబడుల కిందకు వస్తాయి.

రుణసేవలు (డెబిట్ సర్వీసెస్): రుణాలు పొందిన వ్యక్తులు వాటిని తిరిగి చెల్లించని పక్షంలో, కొన్నిసార్లు ప్రభుత్వమే రుణదాతలకు వాటిని చెల్లిస్తుంది. ఇందుకోసం విదేశాల్లో అయితే లాభరహిత సంస్థలు, దేశీయంగా అయితే బాండ్ల విక్రయం ద్వారా ప్రభుత్వం ఈ చెల్లింపులు చేస్తుంది.

మార్కెట్ రుణాలు: వ్యయభారాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం కొన్నిసార్లు మార్కెట్ నుంచి రుణాలు పొందుతుంది. ఇందుకోసం సావరీన్ బాండ్లను ప్రవేశపెడుతుంది.



కార్తీ ఎల్‌ఓసీపై మీరే నిర్ణయం తీసుకోండి

న్యూఢిల్లీ: మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం కుమారుడు కార్తీ అవినీతి కేసుకు సంబంధించిన లుక్ అవుట్‌పై దాఖలైన పిటిషన్లపై మద్రాస్ హైకోర్టే నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. లుక్ అవుడ్ పిటిషన్లపై 2నెలల్లోగా మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కోర్టు నిర్ణయం వెలువరించే వరకు గతేడాది జూన్ 16, జూలై 18న సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలు అమలులో ఉంటాయని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎయిర్ సెల్-మాక్సిస్ మనిలాండరింగ్ కేసులో కార్తీ చిదంబరం అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు రాగా ఆయన ఇళ్లలో సీబీఐ, ఈడీ సోదాలు చేసి కేసులు నమోదు చేశాయి. చిదంబరం కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు కార్తీ తన తండ్రిని అడ్డుపెట్టుకుని అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. దేశం విడిచివెళ్లరాదంటూ దర్యాప్తు సంస్థలు కార్తీకి లుక్ అవుట్ నోటీసులు ఇచ్చాయి. దీంతో కార్తీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా ఏకసభ్య ధర్మాసనం సీబీఐ లుక్ అవుట్ నోటీస్ పై స్టే ఇచ్చింది.దీంతో కార్తీ విదేశాలకు వెళ్లి దర్యాప్తు సంస్థల విచారణకు కూడా హాజరుకావడం లేదు.

జాకెట్ జగడం

✦ రాహుల్ ఖరీదైన జాకెట్‌పై దుమారం ✦ మేఘాలయ నల్లధనంతో రాహుల్‌కు రూ. 63 వేల జాకెట్: బీజేపీ

✦ బీజేపీకి కాంగ్రెస్ కౌంటర్ ✦ రూ.700 జాకెట్‌ను రూ.63 వేలుగా చూపుతున్నారని విమర్శలు

షిల్లాంగ్/ న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఖరీదైన జాకెట్ రాజకీయ వర్గాల్లో పెనుదుమారాన్ని రేపుతోంది. రాహుల్ జాకెట్ పై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తున్నది. రాహుల్ ధరించిన ఖరీదైన జాకెట్‌పై మేఘాలయ బీజేపీ నేతలు వ్యంగ్యాస్త్రాలు సంధించడంతో కమలం, హస్తం పార్టీల మధ్య విమర్శలు,ప్రతివిమర్శలు సాగుతున్నాయి. ప్రధానమంత్రి గతంలో సూటు బూటు వేసుకోవడంపై గతంలో వ్యంగ్యాస్త్రాలు విసిరిన రాహుల్ గాంధీ మేఘాలయ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ప్రచారం ప్రారంభించారు.

పేదలతో ఆలింగనానికి మోడీ దూరం:రాహుల్

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ రూ. 63 వేల విలువైన జాకెట్‌ను ధరించి ఓ మ్యూజిక్ ఈవెంట్‌లో పాల్గొని ప్రధానిపై విమర్శలు గుప్పించారు. మోడీ ఎల్లప్పుడు సూట్లు వేసుకుని పేదలకు దూరంగా ఉంటారని మండిపడ్డారు. సూట్ బూట్ సర్కార్ అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. మోడీ పేద ప్రజలను ఆలింగని చేసుకోవడం మీ రెప్పుడూ చూడరు. పేదలతో మాట్లాడటం, పేదవారితో కలిసి నడవడం వంటివి చేయరు. కానీ వేరే వాళ్లతో కలిసి ఉండటం చూస్తారు. పేదలకు ఆయన దూరంగా ఉంటారు. కానీ అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా లాంటివారిని ఆత్మీయంగా ఆలిగనం చేసుకుంటారు. అని



విమర్శలు గుప్పించారు.షిల్లాంగ్‌లోని యువ ఓటర్లను ఆకట్టుకునేందుకు రాహుల్ గాంధీ మంగళవారం సూటూ బూట్‌తో వెళ్లారు. నీలి రంగు ప్యాంట్, నల్లరంగు జాజెట్ ధరించి అందర్నీ ఆకట్టుకున్నారు. దేశాన్ని మరింతగా బలోపేతం చేసేందుకు యువత పరస్పరం గౌరవ భావాలతో మెలగాలని పిలుపునిచ్చారు. గతంలో అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా గుజరాత్ లోని సూరత్ వచ్చినప్పుడు మోడీ వేసుకున్న సూట్‌పై రాహుల్ విమర్శలు సంధించారు.

సూరత్ బిజినెస్ మెన్ కొనిచ్చిన రూ.4.3 కోట్ల సూట్‌ను మోడీ వేసుకోవడంతో రాహుల్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

మేఘాలయ నల్లధనంతో రాహుల్‌కు కాస్లీ జాకెట్: బీజేపీ

మేఘాలయలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న బీజేపీ నాయకులకు రాహుల్ కాస్లీ జాకెట్ అంశాన్ని రాజకీయం చేస్తూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి మునిగితేలుతోందని.. అవినీతి సొమ్ముతోనే రాహుల్‌కు ఖరీదైన జాకెట్ ను అందించిందని ఆరోపించారు. రాహుల్ మ్యూజిక్ కార్యక్రమానికి హాజరయ్యే బదులు ఆ రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై రిపోర్టు కార్డు ఇస్తే బాగుండేది ట్విట్టర్ వేదికగా విమర్శలు చేశారు. మేఘాలయలో ఉన్న సమస్యలను దృష్టిమళ్లించేందుకు కాంగ్రెస్ రాహుల్ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.బీజేపీ విమర్శలపై స్పందించిన కాంగ్రెస్ నాయకురాలు రేణుకా చౌదరి .. కేంద్రంలో సూట్ బూట్ సర్కార్ ను నడుపుతున్న బీజేపీకి రాహుల్ ను విమర్శించే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. రాహుల్ గాంధీకి వస్తున్న జనాదరణను చూసి బీజేపీ ఓర్వలేకపోతోందని అన్నారు. రాహుల్ ధరించి జాకెట్ ధర మీకెలా తెలుసు.. ఆ జాకెట్ ను నేను రూ. 700లకు కొనుక్కొస్తా..అప్పుడు మీరేం చేస్తారు. అని మండిపడ్డారు. మోడీ ప్రభుత్వం కాశ్మీర్ లాంటి సమస్యలను పరిష్కరించకుండా సోమరితనంగా వ్యవహరిస్తోందని రేణుక ఆరోపించారు. పెరుగుతున్న నిత్యావసరాలను నియంత్రించలేకపోతున్నారని మండిపడ్డారు.

మోహన్ భగవత్ చుట్టూ మగాళ్ళే

✦ ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ వ్యాఖ్యలు

షిల్లాంగ్: సంస్థాగత నాయకత్వ అంశాల్లో మహిళలకు సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆర్ఎస్ఎస్‌ను బుధవారం విమర్శించారు. నాయకత్వ పాత్రలో మహిళల ఉనికి శూన్యమని ఆయన అన్నారు. ఆర్ఎస్‌స్‌లో మహిళల చేతుల్లో ఎన్ని నాయకత్వ హోదాలు ఉన్నాయెూ ఎవరికైనా తెలుసా? సున్నా అని బుధవారం ఇక్కడి సెయింట్ ఎడ్మండ్ కాలేజీ ప్రాంగణంలో ప్రసంగిస్తూ రాహుల్ అన్నారు.

మీరు కావాలంటే మహాత్మా గాంధీ ఛాయా చిత్రం చూడండి. ఎప్పుడూ కూడా ఆయనకు ఇటు వైపు, అటు వైపు, వెనుకవైపు మహిళలు కనిపిస్తారు. అదే మోహన్ భగవత్ ఛాయా చిత్రం చూస్తే అయితే ఆయన ఒంటరిగా అన్నా ఉంటారు లేకుంటే చుట్టూ పురుషులు ఉంటారు. ఆయన చుట్టూ మహిళలు అసలే ఉండరు అని కాంగ్రెస్ అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. మోడీ ప్రభుత్వం దేశంపై ఒక భావజాలాన్ని రుద్దుతున్నది. వేర్వేరు ప్రజలకు వారి సొంత భావజాలాలు, భాషను అనుమతించడంలేదు అని విమర్శించారు.

కేన్సర్ వ్యాధిగ్రస్తురాలికి భరోసా

జీఎస్టీ అమలు కారణంగా చికిత్సకు అవసరమైన ఔషధాల ధరలు పెరగడంతో కడగండ్ల పాలవుతున్నానంటూ కంటతడి పెట్టుకున్న ఒక కేన్సర్ వ్యాధిగ్రస్థురాలికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బుధవారం అభయం ఇచ్చారు. వచ్చే నెల 27న జరిగే అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నిమిత్తం మేఘాలయలో రెండు రోజుల పర్యటనకు రాహుల్ ఇక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సెయింట్ ఎడ్మండ్స్ కాలేజీకి వచ్చిన కాంగ్రెస్ అధ్యక్షుని నగరానికి చెందిన ఎఫ్.వర్లపి అనే కేన్సర్‌వ్యాధిగ్రస్థురాలు కలుసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అంపరీన్ లింగ్డో సహకారంతో తన కష్టాలు చెప్పుకున్నారు. కన్నీటిపర్యంతమైన ఆమెను ఆదుకుంటానని రాహుల్ హామీ ఇచ్చారు. ఆమెకు చేసే సాయం గురించి తనకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ముఖ్యమంత్రి ముకుల్ లింగ్డోను రాహుల్ గాంధీ కోరారని ఎమ్మెల్యే తెలిపారు.

జమిలి ఎన్నికలు మంచిదే

✦ డబ్బు, సమయం ఆదా, అభివృద్ధికి ఆస్కారం ✦ ఇప్పటికిప్పుడు సాధ్యం కాకపోవచ్చు ✦ అందరినీ ఒప్పించాల్సి ఉంది

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : జమిలి ఎన్నికలకు సహకరించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఇచ్చిన పిలుపుకు బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మద్దతు ప్రకటించారు. ఇది మంచి ఆలోచన అని, దీని వల్ల ప్రభుత్వానికి ఖర్చు, వ్యయం తగ్గి అభివృద్ధికి ఆస్కారం కలుగుతుందన్నారు. బుధవారం ఆయన కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఏక కాలంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన సానుకూల వాతావరణం కల్పించాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి కోరారు. ఆయా రాజకీయ పార్టీలు సైతం దీనిపై ఆలోచించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాల సమావేశంలోనూ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ జమిలి ఎన్నికలకు మద్దతు ప్రకటించారు. దేశంలో నిరంతరం ఎన్నికలు జరుగుతుండడం వల్ల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రజా ధనం ఖర్చు, సమయం ఆదా అవుతుందని చెప్పారు. అయితే వీటిని ఇప్పటికిప్పుడు నిర్వహించడం సాధ్యం కాదని అన్నారు. ఈ దిశగా చర్యలు తీసుకుంటువెళితే తప్పనిసరిగా జమిలి ఎన్నికలు నిర్వహించవచ్చని అన్నారు. ఇందుకోసం ఆయా రాష్ట్రాలను ఒప్పించాల్పి ఉంటుందన్నారు.

ఆశావహులకు అభయ హస్తం

✦ ప్రతిభావంతులకే పట్టం
✦ వీసా లాటరీ, గొలుసు వలసకు స్వస్తి
✦ అమెరికన్లను ఉద్దేశించి ట్రంప్ తొలి ప్రసంగం



వాషింగ్టన్: చైనా, రష్యా లాంటి ప్రత్యర్థి దేశాలు అమెరికా ప్రయోజనాలు, ఆర్థిక వ్యవస్థ, విలువలను సవాల్ చేస్తున్నాయని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అలా హెచ్చరించడం ద్వారా తొలిసారిగా 80 నిముషాల పాటు జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో అమెరికా ఫస్ట్ ఎజెండా, వలస విధానంలో కీలకమైన సంస్కరణలపై అమెరికన్లకు నచ్చచెప్పడానికి ట్రంప్ బుధవారం ప్రయత్నించారు. నాలుగు స్తంభాల వలస ప్రణాళికను ఆయన ఆవిష్కరించారు. భారత్ లాంటి దేశాలకు చెందిన సాంకేతిక నిపుణులకు లబ్ధి చేకూరుస్తూ నైపుణ్యంతో కూడిన ప్రజలను అనుమతించే ఒక ప్రతిభ ఆధారిత వలస విధానానికి కాంగ్రెస్ మద్దతు కోరారు. దేశంలో ఎలాంటి పత్రాలు లేకుండా ఉంటున్న దాదాపు 18 లక్షల మంది వలసదారులను అనుమతించే ఒక ప్రణాళికను ట్రంప్ ప్రస్తావించారు. తద్వారా మెక్సికోతో ఒక సరిహద్దు గోడ నిర్మాణానికి వారి నుంచి నిధులు సేకరణ, వీసా లాటరీ విధానానికి స్వస్తి, కుటుంబ వలస నిబంధనల్లో సంస్కరణలను ఆశించారు. అమెరికా చరిత్రలో అధ్యక్షులు జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగాల్లో అతి సుదీర్ఘమైన ప్రసంగం చేశారు. మనం ఒకవైపు అంతర్గతంగా అమెరికా బలం, విశ్వాసాన్ని పునర్‌నిర్మిస్తూనే మరోవైపు విదేశాల్లో మన బలం, ఉనికిని పునరుద్ధరించుకోవాలి. ప్రపంచమంతటా మనం మోసపూరిత ప్రభుత్వాలు, ఉగ్రవాద మూకలు, చైనా, రష్యా లాంటి ప్రత్యర్థులను ఎదుర్కొంటున్నాము. అవి మన ప్రయోజనాలు, మన ఆర్థిక వ్యవస్థ మన విలువలను సవాల్ చేస్తున్నాయి అని ఆయన అన్నారు. అమెరికా తన అణ్వాయుధ గారాన్ని అధునీకరించుకోవాలి. పునర్ నిర్మించుకోవాలి అని తెలిపారు. అయితే తానెప్పటికీ దానిని వినియోగించుకోనని ఆశిస్తున్నట్టు ఆయన తెలిపారు. కానీ అమెరికా రక్షణ వ్యవస్థ దురాక్రమణకు సంబంధించి ఎలాంటి చర్యలనైనా తిప్పికొట్టేంత పటిష్టంగా, శక్తిమంతంగా తయారు కావాలని ట్రంప్ అన్నారు. కేవలం కష్టకాలంలోనే మాత్రమే కాక సర్వకాల, సర్వావస్థల్లోనూ ఏకతాటిపై ఉండాలని ట్రంప్ అన్నారు.

మనలను ఎన్నుకున్న ప్రజల కోసం మన మధ్య విభేదాలను పక్కనపెట్టి, ఒకటే వేదికపై నిలిచి ఐక్యతను చాటుకోవాలని నేటి రాత్రి అందరికి పిలుపునిస్తున్నానని , విభిన్న నేపథ్యం, వర్ణం, మతం, సంప్రదాయాలకు చెందిన మన పౌరులను కాపాడుకోవడానికి డెమోక్రట్, రిపబ్లికన్ సభ్యులతో పనిచేయడానికి చేయి చాపుతున్నాను అని అమెరికా ప్రథమ మహిళ మెలనియా ట్రంప్, ఇతర ప్రముఖులు వీక్షిస్తుండగా ట్రంప్ అన్నారు. ఏడాది క్రితం చేసిన ఆరంభ ఉపన్యాసానికి భిన్నంగా తన ప్రభుత్వం సురక్షితమైన, పటిష్టమైన, గర్వకారణమైన అమెరికాను నిర్మిస్తుందని ఆయన తెలిపారు. ఇది మనం చేపట్టిన సరికొత్త అమెరికా ఉద్యమం. అమెరికన్ల స్వప్నంలో జీవనం ప్రారంభంచడానికి ఇంతకు మించిన మంచి సమయం లేదు అని ట్రంప్ చెప్పారు.

ప్రజల ముందుకు మెలానియా ట్రంప్

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భార్య మెలానియా మొదటిసారిగా ప్రజల ముందుకు వచ్చారు. యూనియన్ సమావేశానికి ట్రంప్‌తో కలిసి ఆమె కూడా హాజరయ్యారు. ఇద్దరి మధ్య సఖ్యత లేదని విమర్శిస్తున్న వారికి ఆమె హాజరే సమాధానమని వైట్ హౌస్ అధికారులు చెబుతున్నారు. కానీ ఇద్దరు వేర్వేరుగా రావడం కొసమెరుపు. ట్రంప్ ఇటీవల దావోస్, స్విట్జర్లాండ్‌ను పర్యటించారు. ఆ సమయంలో ఆమె తన పర్యటనను రద్దు చేసుకున్నారు. దీంతో ఇరువురి మధ్య మనస్పర్థలు వచ్చాయని వాషింగ్టన్‌లో పుకార్లు షికార్లు చేశాయి. దావోస్ సదస్సుకు కొన్ని నెలల ముందు



మెలానియా ఓ బాబుకు జన్మనిచ్చింది. పోర్న్ స్టార్ స్ట్రోమీ డెనియల్‌తో ట్రంప్‌కు వివాహేతర సంబంధం ఉందని, ఎవరికీ చెప్పొద్దని, పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లిస్తానని ట్రంప్ అన్నట్టు వార్తలు వెలువడ్డాయి. కాంగ్రెస్ యూనియన్ సమావేశానికి మెలానియా నవ్వుతూ వచ్చినట్టు కనిపించింది. అనంతరం ట్రంప్‌తో వేదిక కూడా పంచుకున్నది. ముందుగా వచ్చిన అతిథులతో ముచ్చటించాలనే ఉద్దేశంతోనే మెలానియా ముందుగా వచ్చారని, ఆ తరువాత ట్రంప్ వచ్చారని, వేర్వేరుగా రావడానికి ఇదే కారణమని మరేం లేదని వైట్‌హౌస్ వర్గాలు చెబుతున్నాయి.

ట్రంప్ వార్షిక ప్రసంగ కార్యక్రమంలో సునయన

వాషింగ్టన్: అమెరికా జాత్యాంహంకార దాడిలో ప్రాణాలు కోల్పోయిన భారత ఇంజనీర్ కూచిబొట్ల శ్రీనివాస్ భార్యకు ఆదేశంలో అరుదైన గౌరవం దక్కింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వార్షిక ప్రసంగ కార్యక్రమానికి కూచిబొట్ల భార్య సునయన హాజరయ్యారు. కాంగ్రెస్ నేత యాండర్ ఆహ్వానం మేరకు ట్రంప్ వార్షిక ప్రసంగ కార్యక్రమానికి హాజరైన సునయన.. అమెరికన్ కాంగ్రెస్ నాయకులు, హౌస్ స్పీకర్ పాల్ ర్యాన్ లను సునయన కలిశారు. ఈ సందర్భంగా ర్యాన్ మాట్లాడుతూ సునయన గాథ తాను విన్నానని గుర్తుచేసుకున్నారు. ప్రతీ సంవత్సరం ఎవరో ఒకర్ని అతిథులుగా ఆహ్వానిస్తామని.. ఈ ఏడాది కూచిబొట్ల భార్య సునయనను ఆహ్వానించామని యాండర్ తెలిపారు. కాన్సస్ సిటీ భారత అసోసియేషన్ అధ్యక్షుడు బ్రిజ్‌పాల్ సింగ్ మాట్లాడుతూ.. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం భారత వలసదారుల్లో ఆత్మస్థైర్యం నింపిందని.. ఇలాంటి కార్యక్రమానికి సునయన ఆహ్వానించడం ద్వారా అమెరికన్లు భారతీయులకు పలుకుతున్న మద్దతు ఏ మేరకు ఉందో అర్థమౌతోందని చెప్పారు. ఈ పరిణామం అమెరికాలో భారతీయులకు పెరుగుతున్న గౌరవానికి ప్రతీక అని తెలిపారు. మరికా ప్రజలనుద్దేశించి ట్రంప్ చేసే తొలి ప్రసంగ కార్యక్రమంలో భారతీయ మహిళకు ఆహ్వానం అందడం విశేషం. కూచిబొట్ల మరణంతో అమెరికా పౌరసత్వం కోల్పోయిన సునయన అక్కడే నివసించేందుకు అనుమతి తీసుకున్నారు.



ప్రజాస్వామ్య దేశాల సూచిలో 10 స్థానాలు దిగజారిన భారత్

న్యూఢిల్లీ: భారత్ మరోసారి ప్రపంచ సూచిలో వెనకబడింది. ప్రపంచ ప్రజాస్వామ్య సూచి లో ఈ ఏడాది భారత్ స్థానం గతంలో కంటే దిగజారి 42కు చేరింది. గతేడాది 32వ స్థానంలో ఉన్న భారత్ ఈసారి పది స్థానాలు దిగజారింది. ఇందుకు మత సిద్ధాంతాలు,మైనార్టీలపై హింస వంటివి కారణాలుగా ఎకనామిక్ ఇంటెలిజెన్స్ యూనిట్ తన పరిశోధన ద్వారా వెల్లడించింది.165 స్వతంత్ర దేశాలకు ప్రపంచ ప్రజాస్వామ్య సూచిలో ర్యాంకులు ప్రకటించగా.. నార్వే మొదటి స్థానంలో..ఐస్లాండ్,స్వీడన్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

ఎన్నికల ప్రక్రియ అండ్ ప్లూరలిజమ్ , పౌర స్వేచ్ఛ, ప్రభుత్వ పనితీరు, రాజకీయ భాగస్వామ్యం, రాజకీయ సంస్కృతి అనే ఐదు కేటగిరీల వారీగా ర్యాంకులు ప్రకటించారు. ఈ సూచిలో భారత్ 42, అమెరికా 21వ స్థానంలో నిలిచినప్పటికీ.. జపాన్, ఇటలీ, ఫ్రాన్స్, ఇజ్రాయెల్,సింగపూర్, హాంకాంగ్ వంటి దేశాలతో బలహీన ప్రజాస్వామ్య దేశాల సరసన చేరాయి.



గ్రహణం రోజు భూకంపం.. కాకతాళీయమా? నమ్మకమా?

న్యూఢిల్లీ: గ్రహణం అంటే అరిష్టమనే అభిప్రాయం జనంలో నాటుకుని పోయింది. ఖగోళ శాస్త్రజ్ఞులు మాత్రం ఈ అభిప్రాయంతో ఏకీభవించరు. రోదశిలో చోటు చేసుకునే అద్భుతంగా వారు అభివర్ణిస్తుంటారు.బుధవారం సంభవించిన సంపూర్ణచంద్ర గ్రహణం 150 సంవత్సరాల తర్వాత సంభవించిన అద్భుతంగా వారు పేర్కొంటున్నారు. గ్రహణంరోజున ప్రకృతి వైపరీత్యాలు కాకతాళీయంగా సంభవించినా, గ్రహణం వల్ల అరిష్ఠాలు సంభవిస్తాయన్న నమ్మకాలను ఈ ఘటనలు బలపర్చే రీతిలో ఉన్నాయి.ఆఫ్ఘనిస్థాన్‌లోని హిందూకుష్ ప్రాంతంలో బుధవారం భూకంపం సంభవించడానికి సూపర్ బ్లూ బ్లడ్ మూన్ వల్లే సంభవించిందని స్థానికులు భావిస్తున్నారు। ఇలాంటి నమ్మకాలు అన్ని మతాల్లో వారికీ ఉన్నాయి. ఢిల్లీ, శ్రీనగర్‌లలో బుధవారం భూ ప్రకంపనాలు సంభవించడంతో జనం ఇళ్ళలో నుంచి బయటికి వచ్చారు..పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో భూ ప్రకంపనాలకు ఆస్తి నష్టం సంభవించింది.ఒకరు మరణించారు. నమ్మకాల మాట అటుంచితే , ఖగోళ శాస్త్రజ్ఞులు మాత్రం రోదశిలో జరిగే మార్పులుగానే వీటిని పరిగణిస్తారు.150 ఏళ్ళ తర్వాత ఇదే మొదటి సూపర్ బ్లూ బ్లడ్ మూన్ అని పేర్కొంటున్నారు. భ్రమణ సమయంలో భూమికి దగ్గరగావచ్చినప్పుడు పౌర్ణమినాటి చంద్రుణ్ణి సూపర్ మూన్‌గా పిలుస్తారు. గ్రహణం రోజున అరిష్ఠాలు సంభవిస్తాయన్న నమ్మకాలు భారతీయుల్లో ఎక్కువ ఉన్నప్పటికీ, విదేశాల్లో కూడా ఉన్నాయి. జపాన్‌లో 2011సునామీ తీవ్ర విధ్వంసాన్ని సృష్టించింది. ఫుకుషిమా అణువిద్యుత్ కేంద్రం పూర్తిగా దెబ్బతింది. సూపర్ మూన్ ప్రభాం వల్లే ఇది సంభవించిందన్నది జపనీయుల నమ్మకం. అలాగే,మన దేశంలో 2001 జనవరి 26వ తేదీన గుజరాత్‌లోని భుజ్ ప్రాంతాన్ని కుదిపేసిన భూకంపం అదే నెలలో సంభవించిన చంద్రగ్రహణమే కారణమన్న అభిప్రాయం జనంలో నాటుకుని పోయింది. భూ ప్రకంపనాలు సహజమైనవే అయినా, ఇలాంటి సందర్భాల్లో సంభవించినందువల్ల గ్రహణ ప్రభావంగానే అవి సంభవిస్తున్నాయన్న అనుమానాలు ఏర్పడుతున్నా అయితే, అమెరికాలోని భూభౌతిక శాస్త్రజ్ఞులు నిర్వహించిన సర్వే ప్రకారం చంద్ర కాంతి కిరణాల ను బట్టి భూ ప్రకంపనాలు సంభవిస్తుంటాయని తేలినట్టు శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు.పౌర్ణమి నాడు సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగిసి పటుతుంటాయి.దీనినే మనం పోటు అంటూంటాం. గతంలో మిచ్ బాటర్స్ జరిపిన అధ్యయనం ప్రకారం చంద్రగ్రహణంరోజున భూ ప్రకంపనాలు 21 వరకూఉంటాయి. వీటిలో 14 ప్రకంపనాలు గ్రహణం నాల్గవ వంతుదశలోనూ, ఐదు ప్రకంపనాలు గ్రహణం సంపూర్ణమైనప్పుడు, రెండు ప్రకంపనాలు గ్రహణం తర్వాత సంభవిస్తాయి.చంద్రగ్రహణం నాడు భూ వాతావరణం గుండా సూర్యుని కిరణాలు చంద్రునిపై పడతాయనీ, దీంతో చంద్రుడు గోధుమ వర్ణంలో కనిపిస్తాడని శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు.

ఆఫ్ఘన్‌లో భూకంపం

✦ రిక్టర్‌స్కేల్‌పై 6.1గా తీవ్రత నమోదు

ఇస్లామాబాద్, కాబూల్: తరచూ భూకంపాలను చవిచూసే ఆఫ్ఘనిస్థాన్‌లో మరోసారి భూకంపం సంభవించింది. పొరుగునే ఉన్న పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాలతో పాటు భారత సరిహద్దు ప్రాంతంపై కూడా దీని ప్రభావం పడింది. రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 6.1గా నమోదైంది. ఆఫ్ఘనిస్థాన్ ఉత్తర ప్రాంతం జుర్మ్ జిల్లాలోని హిందూకుష్ పర్వత ప్రాంతంలోని భూమిలోపల 191 కిలోమీటర్ల లోతులో ఇది సంభవించినట్లు అమెరికా భూగర్భ సర్వే సంస్థ తెలిపింది. భారత కాలమాన ప్రకారం మధ్యాహ్నం 12:37 నిముషాలకు భూకంపం సంభవించగా తాజా సమాచారం మేరకు 1 బాలిక మృతి చెందగా, మరో 22 మంది గాయపడినట్లు తెలుస్తోంది. 2015లో ఇదే ప్రాంతంలో సంభవించిన భూకంపంలో 380 మంది ప్రజలు మరణించిన సంగతి తెలిసిందే. భూకంప తీవ్రత పాకిస్థాన్ సరిహద్దును సైతం తాకడంతో ఆ దేశంలోని ఇస్లామాబాద్, పెషావర్, లాహోర్‌లలోని ఆఫీసులు, పాఠశాలలు, వ్యాపార సంస్థలను మూసివేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

శ్రీనగర్‌లో క్రేన్‌పై పడిన ఫ్లైఓవర్ గిడ్డర్

ఆఫ్ఘనిస్థాన్‌లో సంభవించిన భూకంపం సరిహద్దులోని కాశ్మీర్‌లోయలో కూడా ప్రభావం కనిపించింది. లోయలో తీవ్రత 6.2గా నమోదు అయింది. ఈ భూకంపం కారణంగా శ్రీనగర్‌లో నిర్మాణంలో ఉన్న జహంగీర్‌చౌక్-రాంబాగ్ ఫ్లైఓవర్ పనుల్లో అంతరాయం ఏర్పడింది.

సరిహద్దు భద్రతకు రూ.370 కోట్లు

న్యూఢిల్లీ : ఇటీవల కాలంలో సరిహద్దు దేశాలతో ఏర్పడుతున్న వివాదాలు, ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ భద్రతకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూ కేంద్రం నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా కేంద్ర హోంమంత్రిత్వశాఖ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్), ఇండో-టిబెట్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ)లకు 369.84 కోట్ల రూపాయలను విడుదల చేసింది. ఈ నిధులతో భారత్-పాక్ సరిహద్దు, భారత్-చైనా సరిహద్దుల్లో అధునాతన బంకర్ల నిర్మాణం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉష్ణోగ్రతలను మార్చుకునే సాంకేతికతో కూడిన గుడారాలను, ఇతర మౌలిక వసతులను చేపట్టనున్నారు. 237.2 కిలోమీటర్ల లైన్ ఆఫ్ కంట్రోల్‌తో కూడిన పాకిస్థాన్‌తో ఉన్న 2,526.86 కిలోమీటర్ల సరిహద్దులో బీఎస్ఎఫ్ పహారా కాస్తోంది. అలాగే చైనాతో గల 4096.7 కిలోమీటర్ల సరిహద్దును ఇండో-టిబెట్ బోర్డర్ పోలీస్ రక్షిస్తోంది. జమ్మూ-కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, మరియు అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు చైనాతో సరిహద్దును కలిగి ఉన్నాయి. అత్యంత క్లిష్టమైన ఈ సరిహద్దులో చాలా పహారా కేంద్రాలు భూమట్టానికి 18,750 అడుగులో ఉంటాయి. ఇక్కడ ఉష్ణోగ్రత మైనస్ 40 డిగ్రీలకు పడిపోతుంది. ఇటీవల కాలంలో అటు పాకిస్థాన్, ఇటు చైనా భారత భూభాగంలోకి చొచ్చుకుని వచ్చే ప్రయత్నాలను ముమ్మరం చేయడం, ఆకస్మిక కాల్పులకు, అక్రమ చొరబాట్లకు పాల్పడుతుండడంతో సరిహద్దు భద్రపై కేంద్రం నిశిత దృష్టిసారించింది.

అట్టహాసంగా ముగిసిన భారత్ పర్వ్ వేడుకలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తున్న భారత్ పర్వ్ కార్యక్రమం బుధవారంతో ముగిసింది.

దేశవ్యాప్తంగా ఉన్న విభిన్న కళలు, సంస్కృతులు, సంప్రదాయాలను ఒక్క చోటుకి చేర్చే లక్ష్యంతో కేంద్ర పర్యాటక శాఖ జనవరి 26 నుంచి 31 వరకు భారత్ పర్వ్-2018 కార్యక్రమాన్ని ఎర్రకోట వద్ద ఘనంగా నిర్వహిస్తోంది. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు భారత్ పర్వ్‌లో ఏర్పాటు చేశాయి. చివరి రోజైన బుధవారం తూర్పుగోదావరి జిల్లా అమలాపురానికి చెందిన విజయదుర్గ నాట్య బృందం చేసిన గరగల జానపద నృత్యం ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది.

ఎఫ్‌బీలో క్రిప్టో యాడ్‌లకు చెక్

న్యూఢిల్లీ : క్రిప్టో కరెన్సీ ఆధారిత వస్తువులు, సర్వీసులకు సంబంధించిన యాడ్‌లను నిషేధిస్తున్నట్టు ఫేస్‌బుక్ ప్రకటించింది. లావాదేవీలు సరిగా లేకపోవడం కారణంగానే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు వివరించారు. శాస్త్ర సాంకేతికంగా అభివృద్ధి మాత్రం ఆగదని, క్రిప్టో కరెన్సీ ఆధారిత యాడ్‌లపై మాత్రమే నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించింది. బిట్‌కాయిన్ విలువ భారీగా పెరగడం కూడా దీనికి ఓ ప్రధాన కారణమని చెప్పుకొచ్చింది. ఫేస్‌బుక్ వినియోగదారుల పర్సనల్ డాటాకు మాత్రం ఎలాంటి ఢోకా లేదని వివరించింది. కొత్త విషయాలు వినియోగదారులకు తెలియజేయడానికి ఫేస్‌బుక్ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని, ఎలాంటి స్కాంలకు తావివ్వకుండా యాడ్స్ వేస్తున్నట్టు ఫేస్‌బుక్ ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ రోబ్ లీథర్న్ చెప్పారు.

'కరంజ్' జలప్రవేశం

✦ ప్రారంభించిన నావికాదళ అధికారులు



ముంబై : స్కార్పిన్ శ్రేణి సబ్‌మెరైన్లలో మూడో సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ కరంజ్ బుధవారం జలప్రవేశం చేసింది. ముంబైలోని మజ్‌గావ్ డాక్ యార్డులో కరంజ్‌ను నేవీ అధికారులు అధికారిక లాంఛనాలతో నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నేవీ చీఫ్ సునీల్ లాంబా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫ్రాన్స్ సాంకేతిక సహకారంతో మజ్‌గావ్ డాక్‌లో స్కార్పిన్ తరగతికి చెందిన ఆరు సబ్ మెరైన్లను భారత్ రూపొందిస్తున్నది. నీటి లోపల శత్రువుల సోనార్‌కు తన ఉనికిని తెలియనివ్వకుండా దాడులు చేయగల సామర్థ్యం దీనికి ఉంది. ధ్వని, రేడియేషన్ చాలా తక్కువగా ఉంటుంది. ఇతర సబ్‌మెరైన్‌లతో పోల్చుకుంటే కరంజ్‌ను నీటిలో గుర్తించడం కష్టం. సముద్రంలో కలిసిపోవడమే దీని ప్రత్యేకత అని అధికారులు చెబుతున్నారు. 2017, డిసెంబర్‌లో ఐఎన్ఎస్ కల్వరి నేవీలోకి రంగ ప్రవేశం చేసింది. జనవరి, 2017లో ఖండేరీ సబ్‌మెరైన్‌ను సీ ట్రయల్స్ కోసం లాంచ్ చేశారు. ప్రస్తుతం దీని ట్రయల్స్ ఇంకా కొనసాగుతున్నాయి. త్వరలోనే ఖండేరి కూడా భారత నేవీలోకి అధికారికంగా చేరనుంది. దేశ రక్షణ రంగంలో ఇదో పెద్ద మైలురాయి అని ప్రధాని నరేంద్రమోడీ ప్రశంసించారు. ఇతర దేశాలతో పోటీ పడి దేశ రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.

క్రీడాప్రభ

సిరీస్ గెలిస్తే.. వన్డేల్లో మనమే నెం.1

ఇక వన్డే వార్!

ఇంతవరకు దక్షిణాఫ్రికాలో ఆదేశంతో ఆడిన వన్డే సిరీస్‌లో భారత్ ఒక్కసారికూడా సిరీస్‌ను గెలుచు కోలేదు. మరోవైపు భారత్ 2016 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు దేశంలో కాని బయటకాని ఒక్క వన్డే సిరీస్‌ను కూడా కోల్పోలేదు. ప్రస్తుత పర్యటనలో సఫారీలతో జరిగిన చివరి టెస్ట్‌తో పుంజుకున్న కోహ్లీ సేన సఫారీల గడ్డపై తొలిసారిగా వన్డే సిరీస్ గెలిచి తన ప్రస్తుత రికార్డును నిలుపుకుం టూ.. వన్డే ప్రపంచ ర్యాంకింగ్‌లో భారత్‌ను అగ్ర స్థానంలో నిలబెడుతుందని ఆశిద్దాం



డర్బన్: వన్డేల్లో ప్రపంచ ర్యాంకింగ్‌లో రెండో స్థానంలో ఉన్న భారత్, దక్షిణాఫ్రికాతో నేడు ప్రారంభం కానున్న ఆరు వన్డేల సిరీస్‌ను గెలిస్తే భారత్‌కు అగ్రస్థానం దక్కుతుంది. దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టు స్థానిక కింగ్స్‌మీడ్ మైదానంలో నేడు ఆతిథ్య జట్టుతో తొలి వన్డే ఆడనుంది. భారత్ మూడు టెస్టుల సిరీస్‌ను 1-2తేడాతో సఫారీలకు కోల్పోయింది. సఫారీలతో వరుసగా రెండు టెస్టుల్లో చెతులెత్తేసిన భారత్ చివరి టెస్టులో ఓదార్పు విజయాన్ని పొంది వన్డేలకు ఆత్మ విశ్వాస్వాన్ని సాధించింది. ముఖ్యంగా బౌలర్లు మంచి ఉత్సాహంమీద ఉన్నారు. దక్షిణాఫ్రికా పిచ్‌లు బౌలర్లకు అనుకూలిస్తున్న నేపథ్యంలో మన పేస్ బౌలర్ల త్రయం భువనేశ్వర్ కుమార్, బుమ్రా, మహ్మద్ షమి తీవ్ర కసరత్తుతో తమ దూకుడును ప్రదర్శించనున్నారు. మరో 14 నెలల్లో వన్డే ప్రపంచకప్-2019 ప్రారంభంకానున్న నేపథ్యంలో ఈ సిరీస్‌నుంచే భారత్ సమాయత్తం కావడానికి నిర్ణయించుకుంది.

దక్షిణాఫ్రికాలో భారత్‌కు వైఫల్యాలే ఎక్కువ

కాగా, ఇప్పటివరకు దక్షిణాఫ్రికాలో భారత్ ఆడిన వన్డే సిరీస్‌ల్లో ఏ ఒక్క సిరీస్‌ను గెలుచుకోలేదు. 1992-93లో జరిగిన ఓడీఐ సిరీస్‌ను సఫారీలు 5-2 తేడాతో గెలుచుకోగా, 2006-07 ఆడిన సిరీస్‌ను దక్షిణాఫ్రికా 4-0 తేడాతో చేజిక్కించుకుంది. 2010-11 జరిగిన సిరీస్‌ను కూడా ఆతిథ్య జట్టే 3-2 తేడాతో గెలుచుకుంది. 2013-14లో జరిగిన సిరీస్‌ను కూడా 2-0తేడాతో సఫారీలు గెలుచుకున్నారు. ఈ ఏడాది జరుగుతున్న ఈ తాజా సిరీస్‌లో కోహ్లీ నేతృత్వంలోని భారత జట్టు సిరీస్‌ను గెలుచు కుంటారని అభిమానులు ఆశిస్తున్నారు. కాగా 1996-97 దక్షిణాఫ్రికా పర్యటనలో భారత్, జింబాబ్వే కలిసి ముక్కోణపు సిరీస్‌ను ఆడింది. 2001-02 కూడా దక్షిణాఫ్రికా పర్యటనలో భారత్, కెన్యాతో కలిసి ముక్కోణపు సిరీస్‌లో పాల్గొంది. ఈ రెండు సందర్భాల్లో కూడా సఫారీలే విజయాన్ని నమోదు చేశారు. 1992-93 నుంచి చూస్తే దక్షిణాఫ్రికాలో ఆదేశంతో భారత్ ఆడిన వన్డేల్లో 21 మ్యాచ్‌లు దక్షిణాఫ్రికా గెలుపొందగా, భారత్ కేవలం ఐదు మ్యాచ్‌లను సొంతం చేసుకోగలిగింది. సఫారీ గడ్డపై ఇంత బలహీనమైన రికార్డును కలిగిన భారత్‌కు అన్ని విధాలా ఆలోచించి ఆదేశ గడ్డపై విజయం సాధించే జట్టునే ఎంపికచేశామని జాతీయ సెలక్టర్లు అంటున్నారు. ఇక తొలి వన్డే వేదికగా ఉన్న డర్బన్ కింగ్స్‌మీడ్ మైదానంలో భారత్ రికార్డు అంత బాగాలేదు. ఇప్పటివరకు సఫారీలతో ఇక్కడ ఆడిన ఏడు వన్డేల్లో ఆరు మ్యాచుల్లో ఓటమిని చవిచూడగా, ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. 2003 వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌లో భాగంగా భారత్ ఇక్కడ కెన్యా, ఇంగ్లండ్‌లను ఓడిం చింది. ఇది కొంచెం భారత్‌కు ఊరట నిచ్చే విషయమే. మొత్తంగా చూస్తే కింగ్స్‌మీడ్ మైదానంలో భారత్ ఆడిన 9 మ్యాచ్‌ల్లో 7 ప్రత్యర్థులకు కోల్పోయి రెండింటిలో విజయం సాధించింది.

పిచ్ గోధుమ వర్ణంలో ఉంది

డర్బన్‌లో మంగళ వారం రాత్రి వర్షం కురియటంతో కింగ్స్‌మీడ్ మైదానంలోని పిచ్ గోధుమ వర్ణంలో కనిపించిందని స్థానిక మైదాన పరిశీలకులు పేర్కొన్నారు. గురువారం కూడా చిరుజల్లులు పడే అవకాశముందని స్థానిక వాతావరణ విశ్లేషకులు తెలిపారు. సఫారీల మిడిల్ ఆర్డర్‌ను నియంత్రించడంలో కీలక పాత్ర పోషించేందకు భారత్ ఒక స్పిన్నర్‌పై ఆధారపడుతుందని అంచనా. ఒకవేళ చైనామ్యాన్ కులదీప్ యాదవ్ తోపాటు అక్సర్‌పటేల్, యజువేంద్ర చాహల్‌కు జట్టులో చోటిస్తే సఫారీల మిడిలార్డర్ బ్యాట్స్‌మన్లు డేవిడ్ మిల్లర్, జెపి. డుమ్నిలకు చుక్కలు చూపించ టం సాధ్యమేనని పరిశీలకులంటున్నారు. ఒకవేళఒ క స్పిన్నర్‌తో ఆడితే పార్ట్‌టైం స్పిన్నర్‌గా కేదార్ జాదవ్‌ను ఉపయోగించుకునే అవకాశముంది.

గాయంతో మూడు వన్డేలకు డి విల్లియర్స్ దూరం

దక్షిణాఫ్రికా కూడా రానున్న ప్రపంచకప్‌పై కన్నేసి తమ జట్టుపై ప్రయోగాలను చేపడుతుంది. చేతి వేలికి గాయం కావడంతో మూడు వన్డేలకు దూరమైన డి విల్లియర్స్ భారత్‌తో ఆడనున్న మూడు వన్డేలకు దూరమయ్యాడు. ఈ పరిస్థితిలో అతని స్థానంలో ఫర్హాన్ బెహ్రాదీన్‌ను ఆడిస్తారు. కాని అలా జరగటంలేదు. డర్బన్‌కు చెందిన ఆటగాడు ఖయేలి హ్లే జోండో చివరి 11 మందిలో ఉంటాడని అంచనా. ఆ జట్టు కెప్టెన్‌కు మరో అవకాశం కూడా లేకపోలేదు. హాశీం అమ్లా, క్వింటన్ డి కాక్, ఏడెన్ మర్క్రంలు కూడా అవకాశముంది. సఫారీల్లో ఒక్క స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్‌తో బరిలోకి దిగుతారని అంచనా.

జట్లు:

భారత్: విరాట్ కోహ్లీ(కెప్టెన్), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, ఆజింక్యా రహానే, శ్రేయాస్ ఐయ్యర్, మనీష్ పాండే, దినేష్ కార్తిక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ(వికెట్ కీపర్) హార్దిక్ పాండ్యా, యజువేంద్ర చాహల్, కులదీప్ యాదవ్, అక్సర్ ప టేల్, భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ శమి, శార్దుల్ థాకూర్

దక్షిణాఫ్రికా: ఫఫ్ డుప్లెస్సెస్(కెప్టెన్), హాషీం ఆమ్లా, క్వింటొన్ డి కాక్(వికెట్ కీపర్), జెపి డుమిని, ఇమ్రాన్ తాహిర్, ఏడెన్ మర్క్రం, డేవిడ్ మిల్లర్, మోర్నీ మోర్కెల్, క్రిస్ మోరిస్, లుంగిసాని ఎన్గిడి, ఆండిలె పెహ్లుక్‌వాయో, కగిస్కో రబాడా, టాబ్రా యుజ్ శాంసి, ఖాయేలిహ్లే జొండో.

ప్రధాని మోడీ చేతుల మీదుగా ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ ప్రారంభం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్(కేఎస్ఐజీ) గురువారం ప్రారంభించారు. ఈ క్రీడలు ఫి బ్రవరి 8 వరకు జరుగుతాయి. ఈ క్రీడలు దేశ క్రీడా నైపుణ్యాలు, శక్తిని ప్రపంచానికి చాటు తాయని అన్నారు. అత్యంత రమణీయంగా అలంకరించిన ఇందిరాగాంధీ స్టేడియంలో కేఎస్ఐజీ క్రీడలను ప్రారంభిస్తున్నట్లు మోడీ ప్రకటించారు. ఈ క్రీడలు గురు-శిష్య సంబంధాలకు ప్రతీకగా నిలుస్తాయని ప్రధాని అన్నారు. యువత జీవితాల్లో క్రీడలు ప్రధాన భాగమని.. వ్యక్తిత్వ వికాసానికేగాక, వారి శరీర దారుఢ్యాన్ని పెంచేందుకు ఉపకరిస్తాయన్నారు. దేశంలో క్రీడలను సామాన్య ప్రజల్లోకి విస్తరించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఆ విధంగా క్రీడలను దేశవ్యాప్తంగా ప్రాధాన్యతను పెంచాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని క్రీడా విభాగాలనుంచి ఏటా వెయ్యి మంది పి ల్లలను ఎంపిక చేసి వారికి ఎనిమిదేళ్లపాటు తలా రూ.5లక్షలు ఇస్తామన్నారు. కేఎస్ఐజీ క్రీడలు 16 క్రీడా విభాగాల్లో జరుగుతాయి. 29 రాష్ట్రా లకు చెందిన 17 ఏళ్లలోపు వారు ఇందులో పాల్గొంటారు.



తొలి స్వర్ణం ఉత్తర ఖండ్‌కు

ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ తొలి రోజు పోటీల్లో ఉత్తరాఖండ్ తొలి స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. మొత్తం ఆరు స్వర్ణ పతకాలకు గాను తమిళనాడు రెండు స్వర్ణాలను గెలుచుకోగా ఉత్తరాఖండ్, కేరళ, ఉత్తర ప్రదేశ్, హర్యానా తలో స్వర్ణ పతకంను గెలుచుకున్నాయి. ఉత్తరాఖండ్ రాయ్‌పూర్ స్పోర్ట్స్ కాలేజ్‌లో శిక్షణ పొందుతున్న అనుకూమార్ 1500 మీటర్ల పరుగులో 4.04.77 నిమిషాల్లో పూర్తిచేసి స్వర్ణంను గెలుచుకోగా రజతంను తమిళనాడుకు చెందిన బి మాథేష్, కాంస్యాన్ని యూపీకి చెందిన సందీప్‌కువమార్ గెలుచుకున్నారు. బాలికల్లో 1500 మీటర్ల పరుగుపందెంలో గుజరాత్ క్రాస్‌కు చెందిన విద్యార్థిని కథారియా శ్రద్ధా ఫినిషింగ్ లైన్‌ను చేరినప్పటికి ప్రత్యర్థులు నిర్ణయాన్ని సవాల్ చేశారు. తమను నెట్టుకొని గీతను తాకినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం జడ్జీలు ఆమెను డిస్‌క్వాలిఫై చేశారు. తర్వాత స్థానంలో వచ్చిన కేరళకు చెందిన సి చాన్‌తినికి స్వర్ణం అప్పజెప్పారు. యూపీకి చెందిన అభిషేక్ సింగ్ షాట్‌పుట్‌లో 18.73 స్కోరు సాధించి స్వర్ణంను గెలుచుకోగా మధ్యప్రదేశ్‌కు చెందిన కార్తికేయ దేస్వాల్ రజతంను గెలుచుకున్నాడు. బాలుర ట్రిపుల్ జంప్‌లో తమిళనాడుకు చెందిన సి. ప్రవీణ్ బంగారు పతకంను గెలుచుకోగా యూపీకి చెందిన సచిన్ గుజ్జార్ రజతం, కేరళకు చెందిన వర్గీస్ కాంస్య పతకంను గెలుచుకున్నాడు. ట్రిపుల్ జంప్ బాలికల విభాగంలో తమిళనాడుకు చెందిన జె కొలెషియా స్వర్ణంను, కేరళకు చెందిన సాంద్రాబాబు రజతంను, తమిళనాడులకు చెందిన తబిత కాంస్యంను గెలుచుకున్నారు. షాట్‌పుట్ బాలికల పోటీల్లో హర్యానాకు చెందిన పూజా స్వర్ణం గెలుచుకోగా అదే రాష్ట్రా నికి చెందిన రేఖ కాంస్య పతకంను గెలుచుకుంది. తమిళనాడుకు చెందిన అజ్నిసి సుసాన్ రజతంను గెలుచుకుంది.

నాకు విశ్రాంతి అవసరం

బీఏఐకి సైనా లేఖ

న్యూఢిల్లీ : ఈ ఏడాది రానున్న ప్రధాన టోర్నీల్లో గెలుపొందడానికి తనకు కొంత విశ్రాంతి అవసరమని వ్యాఖ్యా నించింది సైనా. మలేసియాలోని అలోర్ సెటార్‌లో జరిగే ఆసియా టీం ఛాంపియన్‌షిప్ నుంచి తనను ఉపసంహ రించాలంటూ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ)కు సైనా లేఖ రాసింది.

Published & Printed by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812
RNI Regd.No.32178/1977, Printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT.